www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 327

మంగళవారం | 12-3-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ ఉ. 7.15, తదియ తె. 4.03 వరకు; నక్షత్రం: రేవతి రా. 8.30 తదుపరి అశ్విని; వర్జ్యం: ఉ.9.47-11.12; దుర్ముహూర్తం: ఉ.8.52-9.39, రా.10.20-11.07; అమృతఘడియలు: రా.6.21-7.47; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.21

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భద్రాచలం సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు



యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న సీఎం రేవంత్ దంపతులు

మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ ఖాళీ!

పార్టీలో మిగిలేది కేసీఆర్ కుటుంబమే

నాడు మీ ఎమ్మెల్యేలనే సీఎం కలవలేదు.. నేడు విపక్షాన్నీ కలుస్తున్నాం

ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే అండ.. కాపాడుకుంటాం అంటున్నారు

పేడిమూతోడు.. దూలం లెక్క పెరిగినోడు.. కాళేశ్వరాన్ని కూల్చారు

కేసీఆర్ ఒక చార్లెస్ శోభరాజ్.. అంతర్జాతీయంగా రాష్ట్రం పరువు తీశాడు

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై వస్తే తెలంగాణ ప్రజలు చెప్పుతో కొడతారు

మణుగూరు 'ప్రజాదీవెన' సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

మీరు ఇళ్లు కట్టించిన చోటే ఓట్లడగండి.. కేసీఆర్, మోదీలకు రేవంత్ సవాల్

'డబుల్' పేరుతో ఓట్ల వ్యాపారం.. మోసాన్ని గ్రహించి ప్రజలు బొంద పెట్టారు

ఇంటి స్థలం ఉంటే 5 లక్షల సాయం.. ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు: రేవంత్

ఐదో గ్యారెంటీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి శ్రీకారం

యాదాద్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం.. సీఎం రేవంత్ దంపతులు హాజరు

ఖమ్మం, భద్రాచలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే చూడలేక కేసీఆర్ కుటుంబం అంతా శాప నార్థాలు పెడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగుతుందా? అని ప్రశ్నించారు. సోమవారం ఆయన మంత్రివర్గ సహచరులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించారు. భద్రాచలంలో పార్టీ ఆరు గ్యారెంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మణుగూరులో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్రజాదీవెన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటూ సిగ్గు లేకుండా తమకు నీతులు చెబుతున్న కేటీఆర్ వారి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పదేళ్లయినా అమలు కాని విషయాన్ని ఏనాడైనా ఆలోచించాడా? అని సీఎం ఎద్దేవా చేశారు. "అరే సన్నాసీ.. పేడి మూతి బోడిలింగం గాడివి, నువ్వూ నీ బావ ఇద్దరూ బిల్లా రంగాలే. పేడిమూతోడు శానా మాట్లాడుతుండు. అరే సన్నాసీ మళ్లీ

మిగతా 13వ పేజీలో...

వరాల క్యాబినెట్!

నేడు రాష్ట్ర మంత్రివర్గ భేటీ

అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా పలు నిర్ణయాలు

ఉద్యోగులకు డీఏ, ఆరోగ్య పథకంపై తీపి కబురు

ఎమ్మెల్సీలుగా కోదండ, అమీర్ అలీపై మళ్లీ సిఫారసు

రైతు భరోసాపై చర్చ.. 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం

'కాళేశ్వరం'పై 15 అంశాలతో విచారణకు నిర్ణయం!

కొడంగల్ ఎత్తిపోతల డిజైన్‌లో మార్పునకు ఆమోదం?

3

తిరుగులేని దివ్యాస్త్రం!



భారత్ అమ్ములపొదిలోకి ఎంఐఆర్వీ టెక్నాలజీ

బహుళ వార్‌హెడ్లకు ఏకకాలంలో వేర్వేరు లక్ష్యాలు

అన్నింటికీ గైడెడ్, కంట్రోలింగ్ సాంకేతికత

అగ్ని-5 క్షిపణితో విజయవంతంగా పరీక్ష

అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, పాక్ సరసన ఎంఐఆర్వీ టెక్నాలజీలో భారత్‌కు చోటు

ఎంఐఆర్వీలో పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతికత

తొలి ప్రయత్నంలోనే డీఆర్‌డీవో విజయం

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ అభినందనలు

వరుసగా క్షిపణి ప్రయోగాలకు సన్నాహాలు!

అందుకే బంగాళాఖాతం తీరంలో నోఫ్లైజోన్!

చైనా నిఘా నౌక మోహరింపూ అందుకేనా?

ఒక దెబ్బకు రెండు పిట్టలు..! ఇది పాత మాట..! ఇప్పుడు ఒకే దెబ్బకు ఏకకాలంలో రెండు కంటే ఎక్కువ పిట్టలు అని చెప్పుకోవాలి. భారత అమ్ముల పొదిలోకి మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ-ఎంట్రీ వెహికిల్(ఎంఐఆర్వీ) సాంకేతికత చేరింది. అంటే.. ఒకే మిసైల్‌తోపాటు పలు వార్‌హెడ్‌లను ప్రయోగించి, వేర్వేరు లక్ష్యాలను ఏకకాలంలో ఛేదించవచ్చు. అంతేకాదు.. పూర్తిస్థాయిలో స్వదేశీ పరిజ్ఞానంతో.. ఆత్మ నిర్భర్ భారత్, 'మిషన్ దివ్యాస్త్ర'లో భాగంగా డీఆర్‌డీవో రూపొందించిన ఈ సాంకేతికతలో వార్‌హెడ్లను గుర్తించడం శత్రుదేశాలకు దాదాపు అసాధ్యమే..! న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగల అగ్ని-5 ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్‌తో భారత్ సోమవారం ఎంఐఆర్వీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది.

3

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

ఆయన భార్య; బీఆర్ఎస్ ఎమ్మెల్సీకి చెందిన కంపెనీ పేరుతో రిజిస్ట్రేషన్

ధరణితో కేసీఆర్ కుటుంబం అక్రమాలు.. కేటీఆర్ కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థ

ఆయన ఆప్తులకే నిర్వహణ బాధ్యతలు: ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి



హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ధరణి పేరుతో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ సోమవారం పెద్ద బాంబునే పేల్చింది. కేసీఆర్‌కు అన్నివేళలా వెన్నంటి ఉండే ఆయన బంధువు, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్.. ధరణిని ఆసరాగా చేసుకొని 22 ఎకరాల నిషేధిత భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాంగ్రెస్ నేత, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి ఆరోపించారు. గ్రామంలోని అందరి భూములు నిషేధిత జాబితాలో ఉండగా, సంతోష్ ఒక్కడి భూమి మాత్రమే రిజిస్ట్రేషన్ అయిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ధరణి కమిటీ మరో సభ్యుడు సునీల్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధరణి ద్వారా తొలుత పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి.. వాటిని పెద్దలు చేజిక్కించుకున్న తర్వాత దాని నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు చేసుకునే వ్యవహారం గత ప్రభుత్వంలో కొనసాగిందని

మిగతా 12వ పేజీలో...

ధరణి స్పెషల్ డ్రైవ్ మరో వారం రోజులు పొడిగింపు 12

అమల్లోకి సీఏఏ

పౌరసత్వ సవరణ చట్టం నిబంధనలు నోటిఫై చేస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు

పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ నుంచి వలసవచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని ప్రసాదించే చట్టం

ఎలాంటి పత్రాలూ లేకున్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చాన్స్

రాజ్యాంగనిర్మాతల వాగ్దానాన్ని మోదీ నెరవేర్చారు: అమిత్‌షా

ఒక వర్గాన్ని ఏకీకృతం చేసేందుకే సీఏఏ అమలు: విపక్షాలు

న్యూఢిల్లీ, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలకు ముందు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఎప్పుడో 2019లో ఆమోదించిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ).. ఇప్పుడు అమల్లోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో మత మైనారిటీలుగా హింసకు గురై.. ఎలాంటి పత్రాలూ లేకుండా 2014 డిసెంబరు 31కి ముందు మనదేశానికి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చే చట్టమిది. ఆయా దేశాల నుంచి

మిగతా 2వ పేజీలో...

గడువు పెంచం

ఎన్నికల బాండ్ల వివరాలు నేడు ఈసీకి ఇవ్వండి 2

ఎస్‌బీఐని ఆదేశించిన సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం

గడిచిన 26 రోజుల్లో ఏం చర్యలు తీసుకున్నారని నిలదీత

గడువు పొడిగింపు కోరుతూ వేసిన పిటిషన్ కొట్టివేత

ఎస్‌బీఐ ఇచ్చిన వివరాల్ని మార్చి 15 సాయంత్రం 5 గంటల్లోగా అధికారిక సైట్‌లో పెట్టాలని ఈసీకి ఆదేశం

మోదీ అసలు స్వరూపం బయటపడబోతోంది: రాహుల్



"ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించాలంటూ మేం ఫిబ్రవరి 15న తీర్పు ఇచ్చాం. ఇప్పటివరకు దీనిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పలేదు. 'ఇదుగో మేం ఈ పని చేశాం. మాకు మరికొంత సమయం కావాలి' అని చెప్పి ఉండాల్సింది. ఎస్‌బీఐ నుంచి మేం ఆ నిష్పక్షికతను ఆశిస్తాం."

- సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యలు



నేటి నుంచే రంజాన్

భారత్‌లో నెలవంక దర్శనం

ముస్లింలకు సీఎం శుభాకాంక్షలు

చార్మినార్ /యాకుత్‌పురా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో సోమవారం నెలవంక దర్శనంతో దేశవ్యాప్తంగా మంగళవారం నుంచి ముస్లింల ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇస్లామిక్ సంవత్సరంలో రంజాన్ మాసానికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని

మిగతా 12వ పేజీలో...

ఇక వడ్డీలేని రుణం!

గ్రామ సమాఖ్యలోని ఎస్‌హెచ్‌జీలకు కోటి దాకా

63లక్షల మంది మహిళలకు రూ.5లక్షల బీమా

తెలంగాణ మహిళాశక్తి పేరుతో పథకానికి శ్రీకారం

నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షమంది మహిళలతో సభ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు మరింత చేయుతనిచ్చేందుకుగాను 'తెలంగాణ మహిళాశక్తి' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేయనుంది. ఈ పథకం కింద గ్రామ సమాఖ్యలోని సంఘాలకు రూ. కోటి దాకా వడ్డీలేని రుణాన్ని అందజేయనుంది. పైగా ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించనున్నారు. ఈ మేరకు

మిగతా 13వ పేజీలో...

మోదీ 'మిషన్ సౌత్'

15 నుంచి 5 రోజుల పాటు ఐదు రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటన

16, 17, 19న ఏపీ, తెలంగాణలో..

నేడు రాష్ట్రానికి అమిత్ షా

నేడో, రేపో బీజేపీ రెండో జాబితా

14

కరీంనగర్‌లో బీఆర్ఎస్ కదనభేరి

లోక్‌సభ ఎన్నికలకు నేడు తొలి సభ

పాల్గొననున్న పార్టీ అధినేత కేసీఆర్

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

అభ్యర్థుల రెండో జాబితాపై కసరత్తు

నేడు ప్రకటించే అవకాశం

ప్రణీత్‌రావు ఎక్కడ?

సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు.. అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?

పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా ధ్వంసం.. 'హార్డ్‌డిస్కుల' కేసులో కీలక ఆధారాలు

గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా.. ప్రతిఫలంగా అడ్డదారిలో పదోన్నతి?

విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి

ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

12

యూపీఎస్సీ, ఆర్ఆర్‌బీలో భారీగా కొలువులు

న్యూఢిల్లీ, మార్చి 11: వివిధ విభాగాల్లో 2,280 ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో అత్యధికంగా 1,930 నర్సింగ్ ఆఫీసర్, 323 పర్సనల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. యూపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైల్వే నియామక బోర్డు (ఆర్ఆర్‌బీ) అన్ని రీజియన్లలో 9,144 టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులు 1,092, గ్రేడ్-3 ఉద్యోగాలు 8,052 ఉన్నాయి. ఏప్రిల్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 21 ఆర్ఆర్‌బీ రీజియన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.

అయోధ్యలో అపోలో ఆసుపత్రి

అయోధ్య, మార్చి 11: పుణ్యక్షేత్రమైన అయోధ్యలో అపోలో ఆసుపత్రి సేవలు ప్రారంభించబోతున్నట్లు ఆ సంస్థ సోమవారం ప్రకటించింది. ఇటీవల రామమందిర నిర్మాణం జరిగిన రామ జన్మభూమి స్థలంలోనే 5వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రిని నిర్మించనున్నారు. అక్కడ సాధారణస్థాయి, అత్యవసర సేవలతో పాటు క్రిటికల్‌కేర్, టెలీమెడిసిన్ వంటి విస్తృత స్థాయి సేవలు అందుబాటులోకి రానున్నట్లు అపోలో గ్రూప్ ఛైర్మన్ సి.ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతేగాకుండా బాలరాముడి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు.

రక్త పరీక్షతో నిద్రలేమి గుర్తింపు!

న్యూఢిల్లీ, మార్చి 11: నిద్రలేమితో బాధపడుతున్న వారిని రక్తపరీక్షతో గుర్తించే విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయం, యూకేలోని బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నిపుణులు చేసిన ఈ రిసెర్చ్ స్టడీ 'సైన్స్ అడ్వాన్సెస్' అనే జర్నల్‌లో ప్రచురితమయింది. 24 గంటల పాటు మేల్కొని ఉన్నవారి శాంపిళ్లను బాగా నిద్రపోయిన వారి శాంపిళ్లతో పోల్చి పరీక్షించినప్పుడు.. మేల్కొన్న వారిని గుర్తించడంలో 99.2 శాతం సరైన ఫలితం వచ్చిందని పరిశోధకులు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 20 శాతం రోడ్డు ప్రమాదాలు నిద్రలేమి కారణంగానే జరుగుతున్నాయని, నిద్రలేమితో ఉన్న డ్రైవర్లను భవిష్యత్తులో ఈ పరీక్ష ద్వారా వేగంగా, సులభంగా గుర్తించవచ్చని చెప్పారు.

నెలసరిలో మానసిక కల్లోలం

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నెలసరి సమయంలో ఆందోళన, మానసిక కల్లోలంతో పాటు తీవ్రమైన ఒత్తిడితో 60% మంది మహిళలు బాధపడుతున్నారు. దేశవ్యాప్తంగా 2,400 మంది మహిళలపై చేసిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడయింది. రుతుసమయానికి, మానసిక ఆరోగ్యానికి మధ్య ఏమైనా సంబంధం ఉందా అన్న కోణంలో ఆదిత్యబిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు, ఎంపవర్ ఉజాస్ ఆ సర్వే చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వే వివరాలను విడుదల చేసింది. మహిళలు తమ నెలసరికి ముందో లేదా నెలసరి సమయంలోనో ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లు అందులో స్పష్టమైంది. సర్వే ప్రకారం.. నెలసరి సమయంలో రోజువారీ పనులు చేసుకోవాలంటే చాలా కష్టంగా ఉందని, పనిపై ధ్యాస కూడా ఉండడం లేదని 55 శాతం మంది మగువలు అభిప్రాయపడ్డారు.

సరిహద్దు సమస్యను జటిలం చేయడమే..

» మోదీ అరుణాచల్ పర్యటనపై చైనా అక్కసు

న్యూఢిల్లీ, మార్చి 11: ప్రధాని మోదీ ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటించడంపై చైనా తన అక్కసు వెళ్లగక్కింది. భారత్ చర్య సరిహద్దు సమస్యను జటిలం చేస్తుందని ఆక్షేపించింది. దీనిపై భారత్‌తో దౌత్యపరమైన నిరసనను తెలిపినట్లు వెల్లడించింది. సైనిక బలగాలు, సాయుధ సంపత్తిని తరలించేందుకు వీలుగా చైనా సరిహద్దులోని తవాంగ్‌లో 'సేలా' సొరంగ మార్గాన్ని మోదీ శనివారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే అరుణాచల్‌ను జాంగ్‌నన్(దక్షిణ టిబెట్)గా పేర్కొంటున్న చైనా.. భారత్ చర్యను తీవ్రంగా వ్యతిరేకించింది. 'భారత్ అక్రమంగా ఏర్పాటుచేసిన అరుణాచల్‌ను చైనా ఎన్నడూ గుర్తించలేదు. జాంగ్‌నన్‌ను ఏకపక్షంగా అభివృద్ధి చేసే హక్కు ఆ దేశానికి లేదు" అని చైనా పేర్కొంది.

అమల్లోకి సీఏఏ

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడికి వచ్చినవారిలో ముస్లింలు మినహా మిగతా మతాలవారికి.. హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు ఈ చట్టం కింద మన పౌరసత్వం ఇస్తారు. దీనికి దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుందని.. ఇందుకోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించామని కేంద్ర హోం శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ చట్టం కింద మన పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేవారిని ఎలాంటి పత్రాలూ అడగబోమని ఆయన వెల్లడించారు. మతప్రాతిపదికన పౌరసత్వాన్ని ఇచ్చే ఈ వివాదాస్పద చట్టం 2019 డిసెంబరులో.. ఉభయ సభలతోపాటు, రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిన సంగతి తెలిసిందే. అయితే, నిబంధనలు నోటిఫై చేయనందున ఇన్నాళ్లుగా అమల్లోకి రాలేదు. నిజానికి ఏదైనా చట్టం రాష్ట్రపతి ఆమోద ముద్ర పొందాక.. ఆరునెలల లోపే దానికి సంబంధించిన నిబంధనలను రూపొందించి విడుదల చేయాలని పార్లమెంటరీ వర్క్ మాన్యువల్ చెబుతోంది. అలా కాని పక్షంలో మరింత గడువు కావాలని సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని కోరాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కేంద్ర హోం శాఖ 2020 నుంచి పొడిగింపులు కోరుతూ వస్తోంది. సోమవారం విడుదల చేసిన నిబంధనలు.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లో మత మైనారిటీలుగా ఉన్నవారు మనదేశ పౌరసత్వాన్ని పొందడానికి ఉపకరిస్తాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఆయా దేశాల్లో నివసించే హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రిస్టియన్లకు





సీఏఏ అమల్లోకి రావడంతో భోపాల్‌లో బీజేపీ కార్యకర్తల సంబరాలు

మన రాజ్యాంగ నిర్మాతలు చేసిన వాగ్దానాన్ని ప్రధాని మోదీ నెరవేర్చారని కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందే ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చి తీరుతామని ఆయన ఇటీవలికాలంలో పలు సందర్భాల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా... ఒక వర్గాన్ని ఏకీకృతం చేసేందుకే సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు మోదీ సర్కారు ఈ ఉత్తర్వులు జారీ చేసిందని కాంగ్రెస్ సహా పలు పార్టీలు మండిపడ్డాయి. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాల వెల్లడికి ఎస్‌బీఐకి మరింత గడువు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తిరస్కరించడంతో.. పత్రికల్లో దానిపై పతాక శీర్షికల్లో వచ్చే వార్తలను ఆపడానికే మోదీ సర్కారు హుటాహుటిన సీఏఏ నిబంధనలను విడుదల చేసిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ ఆరోపించారు. నిబంధనలు నోటిఫై చేయడానికి తొమ్మిదిసార్లు పొడిగింపులు కోరి.. ఇప్పుడు సరిగ్గా ఎన్నికల ముందు విడుదల చేయడమంటే, అది ఎన్నికల్లో ఒక వర్గాన్ని.. ప్రత్యేకించి పశ్చిమబెంగాల్, అసోంలో ఒక వర్గాన్ని పోలరైజ్ చేయడం కోసమేనని జైరామ్ రమేశ్ దుయ్యబట్టారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ చట్టాన్ని.. మతపరంగా విభజించే చట్టంగా అభివర్ణించారు. తమ రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు కానీయబోమని స్పష్టం చేశారు. కాగా.. 2019లో ఉభయసభల ఆమోదం పొందాక ఈ చట్టాన్ని నిరసిస్తూ వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో, పోలీసు చర్యల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో.. సోమవారం ఢిల్లీలోని షాహీన్ బాఘ్, జామియా తదితర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

కీలకాంశాలు

పాక్, అఫ్ఘాన్, బంగ్లాదేశ్ నుంచి.. 2014 డిసెంబరు 31కి ముందు ఇక్కడికి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చే లక్ష్యంతో రూపొందించిన చట్టమిది. దీని ప్రకారం..

- అలా వచ్చి మన దేశ పౌరసత్వం కోరేవారు గడిచిన ఏడాది మొత్తం భారత్‌లో నివసించి ఉండాలి. గత పద్నాలుగేళ్లలో కనీసం ఐదేళ్లు ఇక్కడ గడిపి ఉండాలి. గతంలో ఈ వ్యవధి 11 సంవత్సరాలుగా ఉండేది.
- రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో పొందుపరచిన.. అసోం, మేఘాలయ, మిజోరాం, త్రిపురలోని గిరిజన ప్రాంతాలను ఈ చట్టంలో మినహాయించారు.
- ఏ భారతీయుడి పౌరసత్వాన్నీ ఈ చట్టం కింద తొలగించరు. పైన పేర్కొన్న మూడు దేశాల్లో మతపరమైన అణచివేతకు గురవుతూ.. భారత్‌కు తప్ప వేరే ఏ దేశానికీ వెళ్లే దిక్కులేని ముస్లిమేతరులకు మన పౌరసత్వం కల్పించడమే ఈ చట్టం లక్ష్యం.

లోకం తీరు



ముస్లిమేతర శరణార్థుల హర్షం

సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నిబంధనలు విడుదల చేయడం పట్ల దీనివల్ల లబ్ధి పొందే ముస్లిమేతర శరణార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. ఇలా పాక్ నుంచి శరణార్థులుగా వచ్చి ఢిల్లీ, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో తలదాచుకుంటున్న 500 కుటుంబాలకు దీంతో భారత పౌరసత్వం లభించనుందని వారిలో ఒకరైన పాక్ హిందూ శరణార్థి ధరమ్ వీర్ సోలంకి అన్నారు. "నేను, నా కుటుంబం ఈ నిర్ణయం కోసమే దశాబ్దకాలానికి పైగా వేచిచూస్తున్నాం. ఎట్టకేలకు.. భారతీయులం అనిపించుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. 2013లో పాక్ నుంచి నా మాతృదేశానికి (భారత్‌కు) రావాలన్న నిర్ణయం తీసుకున్నందుకు ఎంతగానో ఆనందిస్తున్నా" అని సోలంకి తెలిపారు. సీఏఏ అమలు తమకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందని మరో శరణార్థి సోనాదాస్ అన్నారు. మరోవైపు.. బంగ్లాదేశ్ నుంచి ఎన్నో ఏళ్ల క్రితం పశ్చిమబెంగాల్‌కు వలస వచ్చిన మటువా తెగ హిందువులు కూడా సీఏఏ అమలుపై సంతోషం వెలిబుచ్చారు. ఈ వార్త వినగానే డప్పులు మోగిస్తూ వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 30 లక్షల మంది ఉండే మటువాలు.. బెంగాల్‌లో 30 అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలను తారుమారు చేయగలరు.

1414 మందికి పౌరసత్వం

ఈ చట్టం కింద.. పాక్, అఫ్ఘాన్, బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం ఇవ్వడానికి వీలుగా గత రెండేళ్లుగా 30 జిల్లాల మేజిస్ట్రేట్లకు, తొమ్మిది రాష్ట్రాల (గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర) హోం శాఖల కార్యదర్శులకు కేంద్రం అధికారాలు ఇచ్చింది. కేంద్ర హోం శాఖ వార్షిక నివేదిక 2021-22 ప్రకారం.. 2021 ఏప్రిల్ 1 నుంచి 2021 డిసెంబరు 31 దాకా ఆ మూడు దేశాలకు చెందిన 1414 మంది ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చారు.

ప్రజలను రెచ్చగొట్టడానికే ఎన్నికల ముందు సీఏఏ

» ఎలక్షన్ బాండ్ల నుంచి దృష్టి మళ్లించడానికే...

» విపక్షాల విమర్శలు.. అస్సాంలో నిరసనలు

» కేరళలో అమలు చేయబోమని సీఎం ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 11: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నిబంధనలను నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విపక్షాలు తప్పుపట్టాయి. రాజకీయ కారణాలతోనే ఈ నిర్ణయాన్ని తీసుకొందని విమర్శించాయి. కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను కావాలని రెచ్చగొట్టడానికే ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. పార్లమెంటు ఆమోదించిన నాలుగేళ్లకు నోటిఫై ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిబంధనలు వివక్షపూరితంగా ఉన్నాయని అనిపించినా, ఉన్న హక్కులను హరించేవిగా ఉన్నా తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. సీఏఏ పశ్చిమ బెంగాల్‌తో పాటు, ఈశాన్య రాష్ట్రాలకు చాలా కీలకమని అంశమని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు ఎలాంటి ఆందోళనలు జరగాలని కోరుకోవడం లేదని చెప్పారు. ఎన్‌సీపీ (శరద్ పవార్) అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో ముంబైలో మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని ఆరోపించారు. ముస్లింలను ద్వితీయ శ్రేణుల పౌరులుగా మార్చాలన్న గాడ్సే సిద్ధాంతాన్ని అమలు చేయడానికే ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని హైదరాబాద్‌లో ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఉపాధి లేక లక్షలాది మంది దేశాన్ని విడిచి వెళ్లిపోతుంటే పక్క దేశాల వారికి పౌరసత్వం ఇస్తామనడం అర్థం లేని మాట అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.

సీఏఏ.. అసోంపై ఢిల్లీ జరిపిన దాడి

అసోం నాయకులు సీఏఏను తీవ్రంగా వ్యతిరేకించారు. అస్సాంకు వలస వచ్చిన హిందువులు సహా, ఇతర ప్రాంతాలవారందర్నీ పంపించి వేయాలని గతంలో తాము ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నోటిఫికేషన్ కారణంగా అస్సాంలో అక్రమంగా నివసిస్తున్న 15-20 లక్షల మంది బంగ్లాదేశీ హిందువులకు పౌరసత్వం వచ్చే ప్రమాదం ఉందని రైజోర్ దళ్ అధ్యక్షుడు అఖిల్ గొగోయ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ఉంటున్న 1.7 కోట్ల మంది హిందువులు అస్సాంకు వలస వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది అస్సాంపై ఢిల్లీ జరిపిన దాడి అని విమర్శించారు. దాదాపు 30 సంఘాల ప్రతినిధులు సీఏఏ ప్రతులను దహనం చేశారు. సీఏఏ నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం అని ఆమ్నెస్టీ పేర్కొంది.

మహిళా సాధికారతలో.. కొత్త అధ్యాయం లిఖిస్తాం



ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన సంస్థలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న మోదీ

మూడోసారీ విజయం మాదే: మోదీ

» దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్ల విలువైన హైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన

» ఇందులో రూ.14 వేల కోట్లతో బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే

న్యూఢిల్లీ, మార్చి 11: తాను మూడోసారి ప్రధానిగా వచ్చాక మహిళా సాధికారతలో కొత్త అధ్యాయం లిఖిస్తామని ప్రధాని మోదీ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. సోమవారం ఆయన రూ.లక్ష కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా తలపెట్టిన హైవేల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే హరియాణా-ఢిల్లీ నడుమ విస్తరించిన ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. 'సశక్త్ నారీ-వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రసంగించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు రుణాల కింద రూ.8 వేల కోట్లు విడుదల చేశారు. అలాగే ఆయా సంఘాలకు మూలధన మద్దతు నిధిగా రూ.2,000 కోట్లు పంపిణీ చేశారు. ఇప్పటివరకు మహిళల కోసం తన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. 'మరుగుదొడ్లు లేకపోవడం.. శానిటరీ ప్యాడ్ల వినియోగం, కట్టెలు, బొగ్గు పొయ్యిలతో మహిళల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం.. వారికికి బ్యాంకు ఖాతాల అవసరం గురించి మాట్లాడిన ప్రథమ ప్రధానిని నేనే. కాంగ్రెస్ తదితర పార్టీలు నన్ను హేళన చేశాయి. అవమానించాయి. నా ఇంట్లో, పొరుగిళ్లలో, గ్రామాల్లో చూశాక మహిళల కోసం పథకాలు రూపొందించాను. వివిధ ప్రభుత్వ స్కీంల కింద ఇప్పటివరకు రూ.8 లక్షల కోట్లను వారికి పంపిణీ చేశాం. కోటి మందికిపైగా మహిళల లక్షాధికారులు (లఖ్‌పతీ దీదీ) అయ్యారు' అని వ్యాఖ్యానించారు. వ్యవసాయం, ఇతర అవసరాలకు ఉపయోగించేందుకు 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద వెయ్యి మందికి డ్రోన్లను అందజేశారు. రూ.లక్షల కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టడం చూసి కాంగ్రెస్, దాని అహంకార ఇండీ కూటమి తట్టుకోలేకపోతున్నాయని మోదీ అన్నారు. వాటికి నిద్ర పట్టడం లేదన్నారు. 'పదేళ్లలో దేశం పరివర్తన చెందింది. అయినా వ్యతిరేకత దృష్టితోనే విపక్షాలు చూస్తున్నాయి. మీ (ప్రజలు) అందరికీ నా గురించి తెలుసు. చిన్న చిన్న కలలు కనను. నేనేది కోరుకున్నా భారీగా ఉంటుంది. శరవేగంగా జరిగిపోవాలి. 2047లోపు నా దేశం వికసిత్ భారత్‌గా ఆవిర్భవించడం చూడాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

లక్ష కోట్ల ప్రాజెక్టులు!

రూ.లక్ష కోట్ల విలువ చేసే 114 జాతీయ హైవే ప్రాజెక్టులకు ప్రధాని సోమవారం శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.14 వేల కోట్లతో తలపెట్టిన బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే కూడా ఉంది. హరియాణాలోని గురుగ్రామ్-ఢిల్లీ మధ్య ప్రయాణ దూరాన్ని బాగా తగ్గించే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను ఆయన ప్రారంభించారు. దీని నిడివి 29 కిలోమీటర్లు. ఇందులో హరియాణాలో 18.9 కిమీ, 10.1 కిమీ ఢిల్లీలో ఉంది. దేశంలోని మొట్టమొదటి 8 లైన్ల జాతీయ రహదారి ఇది. దీనితో పాటు ఏపీలో రూ.2,950 కోట్ల వ్యయంతో 16వ నంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన ఆనందపురం-పెందుర్తి-అనకాపల్లి రోడ్డును కూడా ఆయన ప్రారంభించారు.

గడువును పెంచం!



ఎన్నికల బాండ్ల వివరాలు మంగళవారం సాయంత్రంలోగా ఈసీకి ఇవ్వండి

» ఎస్‌బీఐకి సుప్రీం ధర్మాసనం ఆదేశం

» 'గడువు పొడిగింపు' పిటిషన్ కొట్టివేత

» మోదీ అసలు స్వరూపం బయటపడబోతోంది: రాహుల్



ఎస్‌బీఐ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్ల వివరాల వెల్లడికి సమయం కావాలంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. మంగళవారం (మార్చి 12) సాయంత్రంకల్లా ఆ వివరాలన్నింటినీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించి తీరాల్సిందేనని.. ఎన్నికల కమిషన్ ఆ వివరాలను వచ్చే శుక్రవారం (మార్చి 15) సాయంత్రం 5 గంటలకల్లా తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాలని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను మార్చి 13లోగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలంటూ ఫిబ్రవరి 15న తాము ఇచ్చిన ఆదేశాలను పాటించకపోతే.. 'ఉద్దేశపూర్వక ఉల్లంఘన'గా భావించి ఎస్‌బీఐపై తగినచర్యలు చేపడతామని హెచ్చరించింది. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ఫిబ్రవరి 15న సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. 2019 ఏప్రిల్ 12 నుంచి ఎన్నికల బాండ్లను కొన్నవారి వివరాలు, వాటి విలువ, వాటిని ఎవరు స్వీకరించారు? అనే వివరాలను మార్చి 6లోగా ఈసీకి తెలపాలని ఎస్‌బీఐకి.. మార్చి 13లోగా ఆ వివరాలను తన వెబ్‌సైట్‌లో పెట్టాలని ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఎస్‌బీఐ నిర్ణీత గడువులోపు ఆ వివరాలను ఈసీకి సమర్పించకపోగా.. అందుకు ఇచ్చిన గడువును జూన్ 30 దాకా పొడిగించాలని సుప్రీంను కోరింది. దీంతో ఎస్‌బీఐపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఎస్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. దాతలు, గ్రహీతలకు సంబంధించిన వివరాలు ఎస్‌బీఐ శాఖల్లోని రెండు చోట్ల ఉంచినందున.. వాటన్నింటినీ సేకరించి, సరిచూసుకోవడానికి మరింత సమయం కావాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సరిచూసే ప్రక్రియ వద్దంటేగనక.. మూడువారాల్లో వివరాలు సమర్పించగలమన్నారు. ఇందుకు ధర్మాసనం.. అలా సరిపోల్చాలని తాము ఆదేశించలేదని గుర్తుచేసింది. కేవలం ఆ వివరాలను ఈసీకి ఇవ్వాలని చెప్పినట్టు వివరించింది. అంతేకాదు.. ఫిబ్రవరి 15నాటి తీర్పులో తాము ఇచ్చిన ఆదేశాల అమలుకు ఎస్‌బీఐ తీసుకున్న చర్యలు ఏంటని కూడా ధర్మాసనం నిలదీసింది. "గడిచిన 26 రోజుల్లో మీరు ఏమేం చర్యలు తీసుకున్నారు? మీరు దాఖలు చేసిన అప్లికేషన్‌లో ఆ వివరాలేవీ లేవు" అని ప్రశ్నించింది. దీనికి సాల్వే.. కోర్టు ఆదేశాల మేరకు బాండ్ల జారీని నిలిపివేసినట్టు తెలిపారు. తమ ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ ఛైర్మన్, ఎండీని ఆదేశించారు.

మోదీ విరాళాల వ్యాపారం..

ఎస్‌బీఐ వినతిని సుప్రీంకోర్టు తిరస్కరించడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. మోదీ సర్కారు కుటిల తంత్రాల నుంచి ప్రజాస్వామ్యాన్ని సుప్రీంకోర్టు మరోసారి కాపాడిందని కొనియాడింది. "నరేంద్రమోదీ విరాళాల వ్యాపారం బయటపడబోతోంది" అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. "పగ్గాలు చేపట్టిన 100 రోజుల్లోగా.. స్విస్‌బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన (మోదీ) సర్కారు.. సొంత బ్యాంకులో సమాచారాన్ని దాచడానికి ఆపసోపాలు పడింది" అని ఎద్దేవా చేశారు. ఎన్నికల బాండ్లు భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవబోతున్నాయని.. అవినీతి పారిశ్రామికవేత్తలతో సర్కారు మిలాఖత్‌ను బయటపెట్టడం ద్వారా నరేంద్రమోదీ అసలు స్వరూపాన్ని దేశ ప్రజలకు చూపబోతున్నాయని రాహుల్ ట్వీట్ చేశారు.

సాయిబాబాకు ఊరట



న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మావోయిస్టులతో ఆయనకు సంబంధాలున్నాయన్న అభియోగాలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందంటూ ఇటీవల బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్ సాయిబాబాతోపాటు మరో ఐదుగురిని నిర్దోషులుగా విడుదల చేసింది. అయితే, హైకోర్టు తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని అభ్యర్థించింది. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రాథమికంగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది. అన్ని కోణాల్లోనూ పరిశీలించే హైకోర్టు తీర్పు చెప్పిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు తీర్పుపై స్టే ఇవ్వాల్సిన అవసరం లేదని మౌఖికంగా తేల్చి చెప్పింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై విచారణ చేస్తామని, నిర్ణీత సమయంలో దీనిని పరిశీలిస్తామని పేర్కొంది. ఈ నెల 5న బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మహారాష్ట్ర వేసిన పిటిషన్‌ను సాధ్యమైనంత త్వరగా లిస్టింగ్ చేయాలన్న అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ సందర్భంగా రాజు స్పందిస్తూ ఈ కేసులో కొన్ని పత్రాలు దాఖలు చేయాల్సి ఉందని, ముఖ్యంగా ఉగ్రవాద నిరోధక చట్టం(ఉపా) కింద సాయిబాబాను విచారించేందుకు అనుమతి పొందిన పత్రాలను సమర్పించాల్సి ఉందని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. "చట్టం ఎప్పుడూ అమాయకుల పక్షానే ఉంటుంది. నిర్దోషిగా విడుదల ఆదేశాలు పొందాక.. వారి అమాయకత్వం మరింత బలపడుతుంది" అని వ్యాఖ్యానించింది.

అలాంటి క్రూరమైన వ్యాఖ్యలు ఎలా చేస్తారు?

» చిన్నారుల అశ్లీల వీడియోల వీక్షణ నేరం కాదన్న తీర్పుపై సుప్రీం ఆగ్రహం

చెన్నై, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిన్నారుల అశ్లీల వీడియోలు(చైల్డ్ పోర్నోగ్రఫీ) డౌన్‌లోడ్ చేసుకోవడం, వాటిని వీక్షించడం తప్పు కాదని, మరొకరికి ఫార్వర్డ్ చేస్తేనే నేరమన్న మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఒక అదనపు న్యాయమూర్తి ఇలాంటి క్రూరమైన అభిప్రాయాన్ని ఎలా వ్యక్తం చేస్తారని నిలదీసింది. ఈ వ్యాఖ్యలను మూడు వారాల్లోగా ఉపసంహరించుకోవాలని సూచించింది. చెన్నైకి చెందిన హరీశ్(28) చిన్నారుల అశ్లీల వీడియోలు చూస్తున్నాడని గతంలో కేసు నమోదైంది. దీనిపై హరీశ్ మద్రాస్ హైకోర్టుకు వెళ్లగా.. అతని చర్య పోక్సో, ఐటీ చట్టాల కింద నేరం కాదని జడ్జి తీర్పునిచ్చారు. ఆ తీర్పును రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది.

కేంద్రం జోక్యంపై విచారిస్తాం.. వెంటనే లిస్టింగ్ చేయండి

ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 11: కేంద్ర ఎన్నికల సంఘానికి కొత్త సభ్యుల నియామకంలో కేంద్రం జోక్యాన్ని నివారించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిశీలనకు స్వీకరించింది. గతంలో ఎప్పుడో దాఖలయిన ఈ పిటిషన్‌ను సత్వరం లిస్టింగ్ చేయాలని ఆదేశించింది. ఎన్నికల కమిషనర్లను నియమించే కమిటీ నుంచి సుప్రీంకోర్టు సీజేను మినహాయిస్తూ 2023లో కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా అరుణ్ గోయల్, గతంలో అనూప్ చంద్ర పాండేల రాజీనామాలతో రెండు ఎన్నికల కమిషనరు పోస్టులు ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గతంలో తాను వేసిన పిటిషన్ విషయాన్ని కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ కోర్టు దృష్టికి తెచ్చారు. తమపిటిషన్ సత్వరం లిస్ట్ అయ్యేలా చూడాలని ఆమె తరఫున సీనియరు న్యాయవాదులు వికాస్ సింగ్, వరుణ్ ఠాకూర్ కోరగా, 'మెయిల్ చేయండి.. మేం చూస్తాం' అని జస్టిస్ డీవై చంద్రచూడ్ బెంచ్ తెలిపింది.

కమిషనర్ల నియామకంపై కమిటీ భేటీ ఒక రోజు ముందే!

న్యూఢిల్లీ, మార్చి 11: ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న ఇద్దరు కమిషనర్ల నియామకంపై ప్రధాని మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం ఒక రోజు ముందుకు జరిగింది. తొలుత 15న సాయంత్రం 6 గంటలకు కమిటీ భేటీ ఉంటుందని ప్రకటించారు. ఇప్పుడు దానిని గురువారం (ఈ నెల 14న) నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాని, కేంద్ర మంత్రి, లోక్ సభలో ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ సమావేశమై.. ఎన్నికల కమిషనర్ల నియామకంపై రాష్ట్రపతికి పేర్లను సిఫారసు చేయనున్నట్లు తెలుస్తోంది. తరువాతి కొద్దిసేపటికి రాష్ట్రపతి నిర్ణయం వెలువడనుందని చెబుతున్నారు. లేదంటే మరుసటి రోజు జరిగే వీలుందని పేర్కొంటున్నారు. సమావేశం మార్పుపై కమిటీలోని సభ్యులకు కేంద్ర న్యాయ మంత్రిత్వ సమాచారం చేరవేసింది. కాగా, గత శనివారం ఒక ఈసీ నియామకానికి సంబంధించి భేటీపై కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఇంతలో శుక్రవారం కమిషనర్ గోయల్ రాజీనామా చేశారు. ఇప్పుడు ఇద్దరు కమిషనర్లను ఒకేసారి నియమించనున్నారు.

ఈడీపై దాడి కేసు సీబీఐకి ఇవ్వడం సబబే

న్యూఢిల్లీ, మార్చి 11: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో ఈడీ అధికారులపై జరిగిన దాడి ఘటనపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ విషయమై కలకత్తా హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. జనవరి 5న జరిగిన ఈ దాడిపై దర్యాప్తును రాష్ట్ర సీఐడీకి బదులు కేంద్రం ఆధ్వర్యంలోని సీబీఐకి అప్పగించాలని ఈ నెల 5న హైకోర్టు ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అదే రోజున అప్పీలు చేయగా, అత్యవసర విచారణ జరపడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. సోమవారం జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేసును చేపట్టింది. దాడికి పాల్పడ్డ టీఎంసీ నేత షాజహాన్‌ను ఎందుకు వెంటనే అరెస్టు చేయలేదని ప్రశ్నించింది.

నారీశక్తికి గౌరవమిస్తేనే సమాజ పురోగమనం: మోదీ

» వర్చువల్‌గా 'నమో డ్రోన్ దీదీ'

మహేశ్వరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నారీశక్తిని గౌరవిస్తేనే సమాజం పురోగమిస్తుందని, వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవానికి నారీమణులు నాయకత్వం వహించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. సోమవారం కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడ, అలాగే దేశంలోని 11 ప్రాంతాల్లో నిర్వహించిన 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ అందించిన 200 డ్రోన్లు, అలాగే మరో వెయ్యి డ్రోన్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా డ్రోన్ పైలెట్లకు అందజేశారు.



డ్రోన్ పైలెట్లుగా నియామకపత్రాలు, డ్రోన్లు అందుకున్న వివిధ రాష్ట్రాల మహిళలు

ఈ సందర్భంగా... ప్రధాని వివిధ రాష్ట్రాల మహిళా రైతులతో వర్చువల్‌గా మాట్లాడారు. మహిళా రైతులతో సంభాషించడంతో దేశ భవిష్యత్తుపై తనకు మరింత విశ్వాసం పెరిగిందన్నారు. పట్టుదల, సంకల్పంతో మహిళలు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశమంతటా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయాలన్నారు. వంటింటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి, ఉద్యోగాల్లో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. తక్కువ శ్రమతో ఒక్క డ్రోన్‌తో రోజుకు 30 ఎకరాలకు ఎరువులు చల్లే వీలుంటుందన్నారు. అనంతరం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ అరుణ్ అళగప్పన్ మాట్లాడుతూ దేశంలో 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమంతో సంఘాల సభ్యులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు మద్దతుగా వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు కోరమండల్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. డ్రోన్ పైలెట్లుగా ఎంపికైన తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రెండు వందల మంది మహిళలకు డ్రోన్ పైలెట్ ధ్రువపత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్మట్టి నుంచి నీటి తరలింపు వద్దు

» 16 టీఎంసీల తరలింపుతో.. జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుతుంది
» తెలంగాణపై తీవ్ర ప్రభావం పడుతుంది
» గోదావరి-కావేరి అనుసంధానంలో నీటి
» తరలింపుపై కేంద్రానికి తెలంగాణ లేఖ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా కర్ణాటకకు కేటాయించిన 16 టీఎంసీల నీటిని ఆల్మట్టి నుంచి తరలించే ప్రతిపాదనకు ఒప్పుకోబోమని తెలంగాణ పేర్కొంది. అదే జరిగితే తమపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నీటిని కర్ణాటక.. ఆల్మట్టి నుంచి తరలించేలా జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తాజాగా ముసాయిదా డీపీఆర్‌లో ప్రతిపాదించింది. ఆల్మట్టి నుంచి నీటిని తరలిస్తే.. జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుతుందని, దీన్ని అంగీకరించే ప్రసక్తే లేదంటూ తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు. నదుల అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల్లో 50 శాతం వాటాను తెలంగాణకు ఇవ్వాలని కోరారు. అంతకుముందు 45.06 టీఎంసీలను ప్రతిపాదించగా.. తాజా ముసాయిదా డీపీఆర్‌లో 41.21 టీఎంసీలకు తగ్గించారని గుర్తుచేశారు. కరువుపీడిత ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలు ఉన్నందున.. తరలించే నీటిలో 50 శాతానికి తగ్గకుండా నీటి కేటాయింపులు చేయాలన్నారు. తుపాకులగూడెం బ్యారేజీకి ఎగువన 12 కిలోమీటర్ల దూరంలో ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ కట్టాలని ప్రతిపాదించారని, అయితే ఆ బ్యారేజీ తుపాకులగూడెం బ్యాక్‌వాటర్‌పై రానుందని తెలిపారు. అదే జరిగితే నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. ఇక 18.5 టీఎంసీల సామర్థ్యంతో కర్ణాటకలో చేపట్టే బెడ్తి-వారాద లింకులోనూ 50 శాతం వాటాను తెలంగాణకు కేటాయించారని లేఖలో రాహుల్ బొజ్జా గుర్తుచేశారు. గోదావరి-కావేరి అనుసంధానంలో కాలువల కోసం 5984 ఎకరాల భూమిని సేకరించనున్నారని, ఇందుకోసం భూమి కోల్పోతున్నవారికి పునరావాసం కల్పించాలని, పునర్నిర్మాణ చట్టం ప్రకారం సాయం చేయాలని కోరారు.

వరాల క్యాబినెట్!

నేడు రాష్ట్ర మంత్రివర్గ భేటీ..అన్ని వర్గాలను ఆకట్టుకునేలా నిర్ణయాలు

» ఉద్యోగులకు డీఏ, ఆరోగ్య పథకంపై తీపి కబురు అందించే అవకాశం
» ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాల పైనా
» కోదండ, అమీర్ అలీపై మళ్లీ సిఫారసు
» రైతు భరోసాపై చర్చ.. 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం
» 'కాళేశ్వరం'పై విచారణకు నిర్ణయం!



హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్ఠాత్మకమైన లోక్‌సభ ఎన్నికల ముంగిట.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మంగళవారం జరగనుంది. సుదీర్ఘంగా సాగే అవకాశం ఉందని భావిస్తున్న ఈ భేటీలో ముఖ్యమైన వర్గాలైన.. ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, మహిళలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. సచివాలయం 6వ అంతస్తులోని కేబినెట్ మీటింగ్ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు కేబినెట్ సమావేశం జరిగినా.. ప్రధానంగా బడ్జెట్‌కు ఆమోదం తెలపడానికే నిర్వహించారు. మంగళవారం భేటీలో మాత్రం అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలు ఉండనున్నాయి. సమావేశం అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో లక్షమంది స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో ఏర్పాటు చేసిన సదస్సులో వడ్డీ లేని రుణాలిచ్చే విషయాన్ని సీఎం రేవంత్ ప్రకటించే అవకాశముంది. దీనికి సంబంధించి మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. ఇక ఉద్యోగులకు కరువు భత్యం (డీఏ), ఆరోగ్య పథకంపైనా తీపి కబురు రానుందని భావిస్తున్నారు. మరో ప్రధాన అంశం.. హైకోర్టు తీర్పు నేపథ్యంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకం. ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ పేర్లను మరోసారి గవర్నర్‌కు సిఫారసు చేయడంపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. కాగా, రైతుబంధు స్థానంలో రైతు భరోసాను అమలు చేయనున్నారు. పథకంలో కొన్ని మార్పులు చేయాలని సర్కారు యోచిస్తోంది. కొండలు, గుట్టలున్న, రోడ్ల నిర్మాణంలో పోయిన భూములకు ఆర్థిక సాయాన్ని వర్తింపజేయవద్దన్న ఆలోచనలో ఉంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు. ఈ అంశం మంత్రివర్గంలో ప్రస్తావనకు రానుంది. ధరణి పోర్టల్ లోపాలు, లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)పైనా చర్చిస్తారు.

కాళేశ్వరం విచారణపై..

కాళేశ్వరం ఎత్తిపోతలలోని అన్ని కాంపొనెంట్లపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ చేపట్టే అంశంపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. సిటింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ప్రభుత్వం హైకోర్టుకు లేఖ రాయగా.. కోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు/సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో విచారణ జరిపించడంపై స్పష్టత ఇవ్వనున్నారు. 15 అంశాలతో విచారణ విధి విధానాలు రూపొందించినట్లు సమాచారం. ప్రాజెక్టులోని అన్ని కాంపొనెంట్లపై కాగ్ నివేదికతో పాటు విజిలెన్స్ మధ్యంతర నివేదికలు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన ప్రాథమిక నివేదికల ఆధారంగా విచారణ విధివిధానాలు సిద్ధం చేశారు.

డీఎస్సీ-08 అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెర

ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ-2008 అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వ భావిస్తోంది. మెరిట్ జాబితాలో ఉన్నా.. ఉద్యోగాలు రానివారికి ఏపీలో మాదిరే స్థిర జీతాన్ని ఖరారు చేయనుంది. ఇతర రాష్ట్రాలలో మాదిరి.. అడ్మిషన్లు, ఫీజుల ఖరారు వంటి ముఖ్య అంశాల్లో ప్రభుత్వం జోక్యం ఉండేలా.. ప్రైవేట్ వర్సిటీల నియంత్రణకు విధానం తీసుకురావడంపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేశారనే ఆరోపణలున్న కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణానికి ఆమోదం

ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణాన్ని మంత్రివర్గం ఆమోదించే అవకాశాలున్నాయి. పథకంలో అవసరమైన చోట్ల సొరంగాల (టన్నెల్)కు బదులు ప్రెషర్ మెయిన్ (ప్రత్యేక పైప్‌లైన్ వ్యవస్థ)ను ఏర్పాటు చేయనున్నారు. పనుల్లో వేగం పెంచేందుకే ఈ విధంగా చేయనున్నట్లు తెలుస్తోంది. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు నీరందించేలా రూ.2945.59 కోట్లతో ఈ ఎత్తిపోతలకు ప్రభుత్వం గత నెలలో పాలనాపరమైన అనుమతినిచ్చింది. నిర్మాణంలో భాగంగా బ్యారేజీల మధ్య నీటి తరలింపునకు తొలుత సొరంగాలను ప్రతిపాదించారు. ఇది సంక్లిష్టతతో కూడుకున్న అంశం కావడం, భూ సేకరణతో ముడిపడి ఉండటంతో ప్రత్యామ్నాయంగా ప్రెషర్ మెయిన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. దీంతో నిర్మాణం వ్యయం రూ.500 కోట్ల మేర పెరగనుంది.

వకుళాభరణం రామకృష్ణకు జస్టిస్ ఆవుల స్మారక పురస్కారం

» ప్రకటించిన తెలుగు వర్సిటీ - మార్చి 18న అవార్డు ప్రదానం



హైదరాబాద్ సిటీ, మార్చి11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణను 'జస్టిస్ ఆవుల సాంబశివరావు స్మారక పురస్కారానికి' ఎంపిక చేసినట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య కిషన్‌రావు తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవం మార్చి18, సోమవారం ఉదయం 11గంటలకు నాంపల్లిలోని యూనివర్సిటీ ఆడిటోరియంలో జరగనుందని పేర్కొన్నారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు హాజరుకానున్నారు. విద్య, సాహిత్య, సాంస్కృతిక, చరిత్ర, పాత్రికేయ తదితర రంగాలలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు... హేతువాద ఉద్యమ నాయకుడు, ఉమ్మడి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన దివంగత జస్టిస్ ఆవుల సాంబశివరావు పేరుతో పురస్కారాన్ని ప్రతియేటా తెలుగు వర్సిటీ అందిస్తోంది. కాగా, ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చరిత్ర బోధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలపై పలు పుస్తకాలు రాశారు. ఆయన ప్రధాన సంపాదకత్వంలో 'ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర - సంస్కృతి' తొమ్మిది సంపుటాలుగా వెలువడ్డాయి.

మిడ్‌వైఫరీ శిక్షణలో తెలంగాణ టాప్

» వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మిడ్‌వైఫరీ శిక్షణలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని, రాష్ట్రంలో మరిన్ని మిడ్‌వైఫరీ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేశాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో ఆధునికీకరించిన భవనంలో నేషనల్ మిడ్‌వైఫరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను మంత్రి ప్రారంభించారు. మిడ్ వైఫరీలో 18 నెలల కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను మంత్రి దామోదర ప్రదానం చేశారు. రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీఎంఈ డాక్టర్ వాణి, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్వింటా పసుపు.. రూ.18,299

» నిజామాబాద్ మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర

నిజామాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పసుపుకు భారీ ధర వచ్చింది. జిల్లాలోని పెర్కిట్‌కు చెందిన తీగల గంగారెడ్డి అనే రైతు తీసుకువచ్చిన పసుపుకు క్వింటా రూ.18,299 ధర పలికింది. పన్నెండేళ్లలో ఇంత ధర పలకడం ఇదే మొదటిసారి. వారం క్రితం క్వింటా 15,825 పలికిన విషయం సంగతి తెలిసిందే. ఆరేళ్లుగా పసుపు ధరలు తగ్గుతూ వస్తుండటంతో రైతులు సాగును తగ్గించారు. ఫలితంగా రోజురోజుకూ పసుపు ధరలు పెరిగిపోతున్నాయి.

మావోయిస్టు సంజయ్ కేసులో చార్జిషీట్ దాఖలు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు సంజయ్ దీపక్ రావు అలియాస్ వికాస్ అలియాస్ ఆనంద్ అలియాస్ అర్వింద్ కేసుకు సంబంధించి ఎన్‌ఐఏ దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. సంజయ్ దీపక్ రావు కేసులో మావోయిస్టుల నియామకాలు, నిధుల సేకరణకు సంబంధించి దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు అధికారులు నాంపల్లిలోని ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టులో సోమవారం చార్జిషీట్ దాఖలు చేశారు. గత సంవత్సరం సెప్టెంబరు 15న సైబరాబాద్ పోలీసులు దీపక్‌రావును అరెస్ట్ చేశారు.

తిరుగులేని దివ్యాస్త్రం!

భారత్ అమ్ముల పొదిలో ఎంఐఆర్వీ టెక్నాలజీ



న్యూఢిల్లీ, మార్చి 11: 'మిషన్ దివ్యాస్త్ర'లో భారత్ కీలక మైలురాయిని చేరుకుంది. ఎంఐఆర్వీ సాంకేతికతతో.. 5 వేల నుంచి 5,800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే అగ్ని-5 క్షిపణి ప్రయోగం విజయవంతమవ్వడం యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఎంఐఆర్వీ టెక్నాలజీ అంటే.. ఏకకాలంలో ఒకే క్షిపణి సాయంతో వేర్వేరు లక్ష్యాలను ఛేదించేలా బహుళ రీ-ఎంట్రీ వాహనాలను(వార్‌హెడ్‌లు) ప్రయోగించడం. ఇప్పటి వరకు ఎంఐఆర్వీ టెక్నాలజీ ఉన్న దేశాల జాబితాలో అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, చైనా, పాకిస్థాన్ ఉన్నాయి. అగ్ని-5తో పరీక్షించిన ఎంఐఆర్వీ విజయవంతం అవ్వడంతో.. ఆ దేశాల సరసన భారత్ చేరింది. పాకిస్థాన్ 2017లో 2,200 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే 'అబాబీల్' మీడియం రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని ఎంఐఆర్వీ టెక్నాలజీతో పరీక్షించింది. ఇంటర్మీడియట్ రేంజ్ క్షిపణి అయిన అగ్ని-5 ద్వారా భారత్ ఈ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించింది.

శత్రువుకు చిక్కదు.. దొరకదు..!

సాధారణంగా క్షిపణులను ఇంటర్‌సెప్ట్ చేసి, వాటిని గాల్లోనే ధ్వంసం చేసే సాంకేతికత చాలా దేశాలకు అందుబాటులో ఉంది. ఇటీవల హమాస్ దాడుల తర్వాత.. ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ వ్యవస్థ పతాక శీర్షికలకెక్కింది. అయితే.. ఎంఐఆర్వీ సాంకేతికతలో అలా ఇంటర్‌సెప్ట్ చేయడం దాదాపు అసాధ్యమే..! బాలిస్టిక్ క్షిపణులు లక్ష్యాన్ని చేరేముందు భూ వాతావరణాన్ని దాటి పైకి వెళ్తాయి. లక్ష్యాన్ని చేరడానికి తిరిగి భూ వాతావరణంలోకి రావడాన్ని రీ-ఎంట్రీ అంటారు. భారత్ అభివృద్ధి చేసిన ఎంఐఆర్వీలో.. క్షిపణి ప్రయోగం జరిగాక.. టార్గెట్లను నిర్దేశించిన వార్‌హెడ్‌లు భూవాతావరణంలోకి రీ-ఎంట్రీ అయితే.. వాటిని నిరోధించడం శత్రుదేశాలకు సాధ్యమయ్యే పనికాదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. భారత ఎంఐఆర్వీలో అన్ని వార్‌హెడ్లకు గైడెడ్, కంట్రోలింగ్, ప్రత్యేక ప్రోగ్రామింగ్ వ్యవస్థలున్నాయి. "మన ఎంఐఆర్వీలకు కచ్చితత్వంతో దూసుకుపోయేలా సెన్సర్లున్నాయి. వార్‌హెడ్లు ఒక్కసారి రీ-ఎంట్రీ అయితే.. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తాయి. చైనా ఉత్తరభాగంతోపాటు.. ఐరోపాలోని కొన్ని ప్రాంతాలు, ఆసియా మొత్తం అగ్ని-5 క్షిపణి పరిధిలో ఉంటుంది" అని డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. "ఈ వార్‌హెడ్‌లు ఏకకాలంలో వేర్వేరు లక్ష్యాలను ఛేదిస్తాయి. ఇందుకోసం అగ్ని-5లో బహుళ వార్‌హెడ్‌లను అమర్చేందుకు వీలుంటుంది. న్యూక్లియర్ వార్‌హెడ్లను కూడా ఎంఐఆర్వీలో తరలించవచ్చు. భారత్ ఒక్కసారి ఎంఐఆర్వీతో ఎదురుదాడి చేస్తే శత్రుదేశాలకు కోలుకోని దెబ్బ తప్పదు" అని డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్, ప్రస్తుతం నీతి ఆయోగ్ శాస్త్ర సాంకేతిక విభాగం సభ్యుడిగా సేవలందిస్తున్న డాక్టర్ వీకే సారస్వత్ వెల్లడించారు.

వరుసగా క్షిపణుల ప్రయోగాలు?

భారత్ మరికొన్ని క్షిపణులను కూడా ప్రయోగించనున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కారణంగానే బంగాళాఖాతం తీర ప్రాంతాల్లో నో ఫ్లైజోన్‌ను ప్రకటించింది. నోటీస్ టు ఎయిర్‌మెన్(నోటమ్) ప్రకటన చేసింది. ఒక ప్రాంతాన్ని నోటమ్‌గా ప్రకటిస్తే.. ఏక్షణంలోనైనా క్షిపణి ప్రయోగాలు జరపవచ్చని దాని అర్థం. అగ్ని-5 ద్వారా ఎంఐఆర్వీని విజయవంతంగా పరీక్షించిన భారత్.. జలాంతర్గాముల ద్వారా ప్రయోగించడానికి రూపొందించిన అణ్వాయుధ సామర్థ్యం కలిగిన క్షిపణి కే-4ను పరీక్షించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్షిపణి రెండు టన్నుల బరువున్న వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. బంగాళాఖాతం పరిధిలో తాజాగా జారీచేసిన నోటమ్ ఈ నెల 16 దాకా కొనసాగనుంది. నోటమ్ ఫ్లైజోన్ కూడా బంగాళాఖాతానికి దక్షిణాన 3,500 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. కే-4 క్షిపణి పరిధి కూడా 3,500 కిలోమీటర్లు.

క్షుణ్ణంగా పరిశీలిస్తున్న డ్రాగన్?

హిందూ మహాసముద్ర ప్రాంతంపై చైనా కొంతకాలంగా నిఘా పెంచింది. గత నెలలో శ్రీలంక సముద్ర తీరంలో తన పరిశోధనా నౌక (జియాన్ యాంగ్‌హాంగ్-3)ను ఉంచిన డ్రాగన్.. తాజాగా బంగాళాఖాతంలోనూ పరిశోధన నౌక జియాన్ యాంగ్‌హాంగ్-01ను మోహరించింది. ఒడిసా తీరంలో భారత్ క్షిపణి పరీక్షలకు సిద్ధమైన వేళ చైనా చర్యలు అనుమానాలకు తావిస్తున్నాయి. నోటమ్‌ను ప్రకటించగానే చైనా నౌక విశాఖ సముద్ర తీరానికి 260 నాటికల్ మైళ్ల (480 కిలోమీటర్లు) దూరంలో లంగరు వేయడం గమనార్హం..! ఈ నెల 6న మలక్కా జలసంధి మీదుగా ప్రవేశించిన ఆ నౌక.. 8న నికోబార్ ద్వీపం, భారత ద్వీపకల్పం మధ్య కనిపించింది. ఉపరితల ధ్వని సంకేతాలను గుర్తించే సెన్సర్లు ఆ నౌకలో ఉన్నాయని భారత్ భావిస్తోంది. భారత నౌకాదళం ఆ నౌక కదలికలను నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది.

ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము ప్రశంసలు

అల్వాల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎంఐఆర్వీ సాంకేతికతను డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించడంపై ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము అభినందనలు తెలిపారు. "డీఆర్‌డీవో మరో ఘనత సాధించింది. 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో.. బహుళ లక్ష్యాలను ఛేదించగల ఎంఐఆర్వీని 'అగ్ని-5' క్షిపణిపై విజయవంతంగా పరీక్షించింది. ఈ ఘనత సాధించిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు అభినందనలు" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో ప్రశంసించారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను చూసి దేశం గర్విస్తోందని ప్రధాని అన్నారు. "ఈ ఘనత దేశ రక్షణతో పాటు.. వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు నా అభినందనలు" అని రాష్ట్రపతి ముర్ము ఓ ప్రకటనలో తెలిపారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల పరీక్ష సిలబస్ విడుదల

» 100 మార్కులతో ఎంపిక
» 160 ప్రశ్నలకు 80 మార్కులు
» టెట్ వెయిటేజీ 20 మార్కులు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా భర్తీ చేయనున్న స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు నిర్వహించే రాత పరీక్ష సిలబస్‌ను విద్యా శాఖ ఖరారు చేసింది. సోమవారం ఈ సిలబస్‌ను విడుదల చేసి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) కేటగిరీల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 220 స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్), మరో 796 సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ టీచర్ పోస్టులకు పరీక్షను 80మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 160ప్రశ్నలతో పరీక్ష ఉండగా.. ఒక్కో ప్రశ్నకు 0.5 మార్కు ఉంటుంది. మరో 20 మార్కులను టెట్ వెయిటేజీ ద్వారా ఇస్తారు. ఇలా 100 మార్కులకు అభ్యర్థుల మెరిట్ జాబితా రూపొందిస్తారు. టీచర్ పోస్టులకు అభ్యర్థులు వచ్చే నెల 2వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు 8వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. పరీక్ష తేదీలను త్వరలోనే ప్రకటించనున్నారు. స్కూల్ అసిస్టెంట్ (2,629), లాంగ్వేజి పండిట్ (727), ఫిజికల్ ఎడ్యుకేషన్ (182), ఎస్జీటీ (6,508), ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)-220, ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)-796 పోస్టులు భర్తీ చేయనున్నారు.

డిగ్రీ స్థాయిలో మరో 2 కొత్త కోర్సులు

» బీకాం ఫైనాన్స్, బీఏ స్పెషల్..

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ స్థాయిలో మరో రెండు కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. బీకాం ఫైనాన్స్, బీఏ స్పెషల్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. వీటిని ఈ ఏడాది నుంచే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సోమవారం మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న పలు యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో చర్చించిన తర్వాత కొత్త కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈమేరకు బీకాం ఫైనాన్స్, బీఏ స్పెషల్ కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. ఈ కోర్సులను ప్రారంభించేందుకు సుమారు 22 కాలేజీలు ముందుకొచ్చాయి. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలున్నాయి. ఉన్నత విద్యా మండలి, బ్రిటిష్ కౌన్సిల్, అబెరిస్ట్‌విత్ యూనివర్సిటీ, వెల్ష్ యూనివర్సిటీ, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు కలిసి రూపొందించిన ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధికారాలు హెచ్‌ఎంలకు

రాష్ట్రంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల కాలపరిమితి ముగియడంతో వాటి అధికారాలను హెడ్‌మాస్టర్లకు బదిలీ చేస్తూ విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక పరమైన అంశాలపై హెచ్‌ఎం, మరో టీచర్ కలిసి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకు చెక్కులపై హెచ్‌ఎం, మరో సీనియర్ ఉపాధ్యాయుడి జాయింట్ సంతకాలు ఉండాలని సూచించారు.

టి-సాట్ సీఈవోగా వేణుగోపాల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్కిల్, అకడమిక్ అండ్ ట్రైనింగ్(టి-సాట్) సీఈవోగా సీనియర్ పాత్రికేయులు బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టి-సాట్ ప్రధాన కార్యాలయంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఐటీ శాఖ అదనపు కార్యదర్శి కిరణ్ కుమార్, సీనియర్ జర్నలిస్టుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే దిశగా టి-సాట్‌ను విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్ల గడువు

14 వరకు ఉపసంహరణ, 28న ఎన్నిక

మహబూబ్‌నగర్, మార్చి 11 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల పర్వం సోమవారం ముగిసింది. మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నవీన్ కుమార్‌రెడ్డి పోటీలో నిలువగా, బీజేపీ పోటీకి దూరంగా ఉంది. 14 మంది ఇండిపెండెంట్లు పోటీలో ఉన్నారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన ఉండగా, ఈనెల 14 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. 28న ఎన్నిక, ఏప్రిల్ 2న కౌంటింగ్ జరుగనుంది. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మంత్రి జూపల్లి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, ఈర్లపల్లి శంకర్ తరలి వచ్చారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు తరలి వచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'పౌరసత్వ' ఉపద్రవం

ఈ సార్వత్రిక ఎన్నికలకు ముందే 'పౌరసత్వ సవరణచట్టం–2019'ని అమలులోకి తీసుకువస్తామని హోంమంత్రి అమిత్‌షా నెలక్రితమే చెప్పారు. తదనుగుణంగానే, నాలుగేళ్ళనాటి ఈ చట్టాన్ని ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటానికి కాస్తంత ముందు ఆచరణలోకి తెచ్చారు. అసలు ఆ చట్టం రూపకల్పనలోనే రాజకీయ లక్ష్యాలు, దురుద్దేశాలున్నాయని విపక్షాలు భావిస్తున్నప్పుడు, వాటిని మరింత బాగా నెరవేర్చుకొనే సమయాన్ని అధికారపక్షం ఎంచుకుంటే ఎందుకంత ఆగ్రహిస్తున్నాయో అర్థంకాదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఒక ప్రధాన అస్త్రంగా ఉపకరించిన అంశాన్ని నాలుగేళ్ళుగా దాచివుంచింది మరో పుణ్యకాలం కోసమే కనుక, సమయం, సందర్భం చూసి అధికారపక్షం దానిని ప్రయోగించింది, ఎందుకైనా మంచిదని దానికి ఓ గ్యారంటీ ట్యాగ్ కూడా వేలాడదీసింది.

ఎన్నికల బాండ్ల గుట్టు ఇప్పట్లో విప్పేది లేదని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నందుకు, సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టి, మంగళవారం లోగా వివరాలు ఇవ్వాల్సిందేనని ఆదేశించిన నాడే పాలకులు సీఏఏని ఆచరణలోకి తేవడం కూడా కొందరికి విచిత్రంగా అనిపించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలసవచ్చిన ముస్లిమేతర శరణార్థులకు తగిన పత్రాలు లేకున్నా ఈ దేశ పౌరసత్వాన్ని కల్పించేందుకు ఈ చట్టంలోని నిబంధనలున్నాయి. 2014 డిసెంబరు 31 కంటే ముందు ఈ మూడుదేశాల నుంచి మనదేశానికి వచ్చిన ఒక మతంవారు మినహా మిగతా మతస్థులంతా భారత పౌరసత్వాన్ని సునాయాసంగా స్వీకరించవచ్చు. దేశచరిత్రలో తొలిసారిగా భారత పౌరసత్వ అర్హత పరీక్ష మతం ప్రాతిపదికన జరగబోతున్నదని అర్థం. మూడు ముస్లిం దేశాల్లో మతపరమైన హింస దౌర్జన్యాలను తట్టుకోలేక తరలివచ్చిన అక్కడి మైనారిటీలకు ఈ సవరణ చట్టం ఉపకరిస్తుందని పాలకులు అంటున్నప్పటికీ, మతమే పునాదిగా ఒకరికి పౌరసత్వాన్ని కల్పించడం రాజ్యాంగ ఆశయాలకు భిన్నంగా వ్యవహరించడమేనని ఈ దేశంలోని మేధావుల ఆవేదన. కులం, మతం ఇత్యాది భావనలతో, వ్యక్తిగత నమ్మకాలతో నిమిత్తం లేకుండా ఈ దేశంలో నివసించేవారంతా భారత పౌరులేనని రాజ్యాంగం ప్రవచిస్తుంటే, మూడు ఇస్లామిక్ దేశాలనుంచి తరలివచ్చిన ఆయా మతాలవారు అంటూ కొందరిని ప్రత్యేకించి, ఒక మతం వారిని వేరుపరచడం రాజ్యాంగాన్ని అవమానించడం, భారతదేశ లౌకిక స్వరూప స్వభావాలకు పూర్తి భిన్నంగా నడుచుకోవడమే. మతపరమైన ఊచకోతలు, దాడులతో ఈ మూడు దేశాల నుంచి పారిపోయి వచ్చి భారత్‌లో నివాసం ఉంటున్నవారికి పౌరసత్వాన్ని కట్టబెట్టడంలో తప్పేమీ లేదనుకుంటే, పాకిస్థాన్‌లోనే చాలా ముస్లిం తెగలు వీరితో సమానమైన తీవ్ర మతవివక్షను ఎదుర్కొంటున్నాయి.

దీని అమలుతో తక్షణంగా లబ్ధిపొందేది ఓ ముపె[illegible]ల మందికి మించి ఉండకపోవచ్చు. కానీ, ఎన్నికల తరుణంలో ఇది అందించే సందేశం బలమైనది. 2020లో సుదీర్ఘకాలం సాగిన ఉద్యమాలు, వాటిని అణచివేసేందుకు పాలకులు ప్రయోగించిన హింసను గుర్తుచేసుకుంటే, రాబోయే రోజులు ఎలా ఉండబోతున్నాయో అర్థమవుతుంది. యూనివర్సిటీల్లో ఇప్పటికే నిరసనలు జోరందుకున్నాయి, దేశ రాజధాని భయపడుతోంది, అసోం మళ్ళీ వేడెక్కుతున్నది. అసోంలో ముపె[illegible]విద్యార్థి సంఘాలు నిరసనకార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. అక్రమ వలసదారుల ఏరివేత కోసం దశాబ్దాలుగా ఈశాన్యం పోరాడుతూంటే, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడినవారిలో హిందువులను మాత్రం ఈ చట్టంతో స్థిరపరచే ప్రయత్నం జరుగుతోందని వారందరి భయం. ఇక, కొన్ని రాష్ట్రాలు ఈ సవరణ చట్టాన్ని అమలు చేసేది లేదని ఇప్పటికే ప్రకటించినప్పటికీ, పశ్చిమబెంగాల్ రాజకీయాన్ని ఇది మరింత తీవ్రంగా ప్రభావితం చేయబోతున్నది. సవరణ చట్టం అమలుకు నిబంధనలను నోటిఫై చేయడమే ప్రధానం కనుక, అతిముఖ్యమైన ఆ పని ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందు కాక, ఎన్నడో జరిగివుంటే ఉన్నతంగా ఉండేది. 'మోదీ గ్యారంటీ'లన్నీ అధికారపక్షానికి రాజకీయంగా ప్రయోజనం చేకూర్చేరీతిలోనే అమలు జరుగుతాయని, మిగతావన్నీ అమిత్ షా 'జుమ్లా'లుగా మిగిలిపోతాయని పాలకులే తమ చర్యలతో తేల్చేస్తున్నారు.

ఆఖరి అంకంలో జగన్ పాలన

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి పనిచేయాలని భారతీయ జనతా పార్టీ ఎందుకు నిర్ణయించింది? ఈ రెండు పార్టీలతో కలిసి పనిచేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని, వారి అభ్యున్నతికి ఈ నిర్ణయం దోహదం చేస్తుందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనలోనే ఈ ప్రశ్నకు సమాధానం ఉన్నది. 2047 నాటికి భారత్‌కు ఈ అగ్రరాజ్య స్థాయిని సాధించేందుకు అతి వేగవంతమైన నిర్ణయాలను ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. అగ్రరాజ్యంగా మారాలంటే భారత్ దాదాపు 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాల్సి ఉంటుంది. ఇప్పటికే భారతదేశం ప్రపంచంలో అయిదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. మరో మూడేళ్లలోనే భారత్ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారేందుకు అవసరమైన చర్యలను మోదీ ఇప్పటికే తీసుకున్నారు. రానున్న సంవత్సరాల్లో భారతదేశం ఏడు శాతానికి పైగా అభివృద్ధి రేటు సాధించేందుకు సమాయత్తం కావల్సివున్నది. ఇప్పటికే అసాధారణమైన రీతిలో లక్షల కోట్ల మేరకు మూలధన వ్యయాన్ని కేటాయించడం ద్వారా భారతదేశం మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. ఈ నిర్మాణ క్రమం మరింత వేగవంతం అయ్యేందుకు నిర్మాణాత్మక సంస్కరణలను కూడా చేపట్టాల్సి ఉన్నది.



▪ వై. సత్యకుమార్

సత్యకాలమ్

గడచిన అయిదేళ్లలో దేశంలో అనేక రాష్ట్రాలు అభివృద్ధి చెందుతుంటే ఆంధ్రప్రదేశ్ మాత్రం కొన్ని దశాబ్దాలు అభివృద్ధిలో వెనుకబడిపోయింది. ప్రధానమంత్రి అన్ని రాష్ట్రాల మాదిరే ఆంధ్రప్రదేశ్‌లో కూడా భారీ ఎత్తున ప్రాజెక్టులు అమలు కావాలని, రాజధానితో పాటు అనేక నగరాలు ఏపీలో అధునాతనంగా అభివృద్ధి చెందాలని ఆశించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి అవసరమైన నిధులను కేటాయించారు. ఢిల్లీ ఎప్పుడు వచ్చినా సాదరంగా మాట్లాడి ఆర్థిక తోడ్పాటుకు సహకారం అందించారు. కాని జగన్‌కు అభివృద్ధే ప్రధాన ఎజెండా కానప్పుడు కేంద్రం ఏమి చేయగలదు? ఏడాదికి 341 రోజులు ఏపీ అప్పులు చేస్తూనే ఉన్నదని, సగం రోజులకు పైగా ఓవర్ డ్రాఫ్ట్‌లపై ఆధారపడుతోందని కాగ్ నివేదికలు చెబుతున్నాయి. 55కు పైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూపాయి కేటాయించకపోగా వాటి పేరుతో కూడా అప్పులు చేశారు. గడచిన అయిదేళ్లలో దాదాపు రూ. పదిలక్షల కోట్ల మేరకు రుణాలు చేశారు. కేంద్రం ఇస్తున్న నిధులు వివిధ అవసరాలకు మళ్లిస్తున్నారు. ఆఖరుకు పంచాయితీ నిధులను, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను కూడా మళ్లించారు. కేంద్రం ఇస్తున్న రాయితీలు, సబ్సిడీలు ప్రజలకు చేరడం లేదు. వివిధ సంక్షేమ పథకాలకు రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్లను విడుదల చేయకపోవడంతో అవి నత్తనడక నడుస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన రాజధానిని కూడా గాలికి వదిలేసి మూడు రాజధానులంటూ తుగ్లక్ నిర్ణయాలు తీసుకుని వేలాది రైతుల నోళ్లలో మట్టి కొట్టారు. ప్రతి రోజూ జగన్ నొక్కుతున్న బటన్ల ద్వారా, అసంపూర్తి ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ప్రజలను మోసగిస్తున్నారు. అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టివేయడం తప్ప జగన్ ఈ అయిదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదు. ఆఖరుకు ప్రభుత్వ కార్యాలయాల్ని కూడా తాకట్టు పెట్టారు. పేరుకు మద్య నిషేధం అమలు చేస్తామని ప్రకటించినా రకరకాల బ్రాండ్లతో మద్యాన్ని ప్రవహింపచేసి వేల కోట్లు లూటీచేశారు. భారీ ఎత్తున విద్యుత్ ఛార్జీలను పెంచారు. జాబ్ క్యాలెండర్ అని బూటకపు ప్రకటనలుచేసి లక్షలాది యువతీ యువకులు ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు తరలివెళ్లేలా చేశారు.



రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించే కేంద్రానికి, బీజేపీ నాయకత్వానికి ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో బాగా తెలుసు. జగన్ ప్రభుత్వం పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకతను కూడా కేంద్రం గమనించింది. అందుకే అభివృద్ధిని ఆశించే శక్తులతో చేతులు కలపాలని బీజేపీ నిర్ణయించుకుంది. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిపోకుండా చూడడమే ప్రధాని మోదీ ప్రధాన లక్ష్యం.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా కేంద్రం లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ఏపీకి మంజూరు చేసింది. కాని జగన్ హయాంలో ఈ ప్రాజెక్టులన్నీ నత్తనడక నడుస్తున్నాయి. అనేక ప్రాజెక్టులు భూమి కేటాయించకపోవడంతో ముందుకుసాగలేకపోతున్నాయి. లోటు బడ్జెట్‌ను పూరించడం నుంచి, ప్రత్యేక ప్యాకేజీ వరకు కేంద్రం తోడ్పాటు నందిస్తోంది. ప్రతి జిల్లాలోనూ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు నిధులు మంజూరు చేసింది. అనేక ఉన్నత విద్యాసంస్థలను ప్రారంభించింది కాని కేంద్రం ఇచ్చిన తోడ్పాటును ఉపయోగించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనే జగన్ ప్రభుత్వానికి లేకుండా పోయింది.

ఇవన్నీ కేంద్రానికి ఎప్పటికప్పుడు తెలిసినందువల్లే జగన్ పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయించారు. విద్యుత్ పీపీఏల రద్దు నుంచి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటడం వరకు కేంద్రం ఎన్నోసార్లు జగన్ ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వం గురించి హెచ్చరికలు చేసింది. ఇసుక, మద్యం, మైనింగ్ మొదలైన అనేక రంగాల ద్వారా జరుగుతున్న భారీ అవినీతి గురించి కేంద్రానికి అనేక నివేదికలు అందాయి. గ్రీన్ ట్రిబ్యునల్‌లోనూ, కోర్టుల్లోనూ జగన్ అరాచకాలు, అవినీతిపట్ల చేస్తున్న వ్యాఖ్యలూ కేంద్రం దృష్టిలో ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులను అణిచివేసేందుకు జగన్ సర్కార్ పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం, తప్పుడు కేసులు పెట్టడం, పార్టీ గూండాల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమ ఆక్రమణలకు పాల్పడడం, దొంగ ఓట్లను చేర్చడం వంటి దుర్మార్గాలూ కేంద్రం దృష్టికి వచ్చాయి. బాబాయి హత్యకేసులో సీబీఐ విచారణ కోరి తర్వాత దానిపై వెనక్కి తగ్గడం, సీబీఐపైనే ఆరోపణలు చేయడం కూడా బీజేపీ గమనించింది. తనపై పెండింగ్‌లో ఉన్న అనేక కేసుల్లో విచారణ ముందుకు సాగకుండా రకరకాల సాకులతో న్యాయవిచారణను జాప్యం చేయడం కూడా బీజేపీకి తెలియని విషయంకాదు. జగన్ హయాంలో దేవాలయాలపై దాడులు మాత్రమే కాదు, చాప క్రింద నీరులాగా క్రైస్తవ మత వ్యాప్తికి తోడ్పడుతున్న విషయమూ క్రింది స్థాయిలో బీజేపీ కార్యకర్తలు కనిపెడుతున్నారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే జగన్ చేస్తున్న దుర్మార్గాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉన్నట్లు ప్రచారం చేసుకోవడం. కోర్టుల్లో కేసులు కదిలినప్పుడల్లా, తన దుర్మార్గాల గురించి ప్రజలకు తెలిసినప్పుడల్లా ఢిల్లీ వచ్చి ఏదోసాకుతో ప్రధానమంత్రిని, ఇతర కేంద్రమంత్రులను కలుసుకోవడం ద్వారా ఇన్నాళ్లూ జగన్ తనకు కేంద్రం ఆశీర్వాదాలు ఉన్నాయంటూ మభ్యపెడుతూ వచ్చారు. తన రాజకీయ ప్రత్యర్థులను అణిచివేయడానికి, ప్రతిపక్ష నేతలను జైళ్లపాలు చేసేందుకు కూడా కేంద్రం తోడ్పడుతుందనే దుష్ప్రచారానికి జగన్ తెరలేపారు. కాని రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరించే కేంద్రానికి, బీజేపీ నాయకత్వానికి ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో బాగా తెలుసు. జగన్ ప్రభుత్వం పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకతను కూడా కేంద్రం గమనించింది. అందుకే అభివృద్ధిని ఆశించే శక్తులతో చేతులు కలపాలని నిర్ణయించుకుంది. అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి పోకుండా చూడడమే ప్రధానమంత్రి మోదీ ప్రధాన లక్ష్యం.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

ముందు ఇచ్చిన ఆ గ్యారంటీల మాటేమిటి?

మోదీ గ్యారంటీ అనే ప్రచారం రేడియో, టీవీలలో పెద్ద ఎత్తున నేడు జరుగుతోంది. ఎన్నికల ముందు ఈ రకమైన ప్రచారానికి కేంద్ర ప్రభుత్వ డబ్బులతో పూనుకోవడం సబబేనా అన్నది ఒక అంశమైతే, అసలు ఈ ప్రచారంలో పస ఎంత అన్నది ముఖ్యమైన అంశం. తాము మరలా అధికారంలోకి వస్తే 80కోట్ల మందికి పైగా ప్రజలకు 2028 వరకు ఉచితంగా ఐదు కేజీల బియ్యం ఇస్తామని, 55కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పది కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్, 14కోట్ల మంది గ్రామీణ కుటుంబాలకు గృహ వసతి కల్పిస్తామనే వాగ్దానాలతో ఈ మోదీ గ్యారంటీ సాగుతోంది. వికసిత భారత్, 2047 కల్లా మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంపై కూడా ప్రచారం జరుగుతోంది. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే పదేళ్లలో ఆర్టికల్ 370 రద్దు, రామాలయం నిర్మాణం మినహా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా తామేం చేశామో చెప్పడం కాక, మరలా గెలిస్తే ఏం చేస్తామో చెప్పడం విశేషం. అదే సందర్భంలో తామిస్తున్న ఉచిత బియ్యం వంటి హామీల ద్వారా దేశంలో పేదరికం ఎంత తీవ్రంగా ఉందో వీరు చెప్పకనే చెబుతున్నారు. ఈ గ్యారంటీల విశ్వసనీయత కూడా ఎంతో తెలియాలంటే ఒక విషయాన్ని తప్పకుండా పరిశీలించాలి. అదేమిటంటే గతంలో ఈ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి అన్నది.

2014 ఎన్నికలకు ముందు దేశంలోని నల్లధనమంతా వెలికి తీసి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని అనేక వాగ్దానాలు చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి పదేళ్ళ ప్రత్యేక హోదా ఇస్తామని, తెలుగు రాష్ట్రాలకు రాష్ట్ర విభజన చట్టం సంపూర్ణంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. విచిత్రం ఏమిటంటే ఈ పదేళ్ల కాలంలోనూ వీటిలో ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయకపోగా దానికి భిన్నంగా పాలన ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న గిరిజన యూనివర్సిటీలు, బయ్యారం, కడప ఉక్కు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలు, రామాయపట్నం పోర్టు, మెట్రో రైల్, రైల్వే జోన్, వెనకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ వంటి అన్ని అంశాలలోనూ మోదీ ప్రభుత్వం ద్రోహమే చేసింది.



మోదీ ప్రభుత్వ పదేళ్ల పాలనను కొద్దిగా పరిశీలించిన వారెవరికైనా సరే మరో ఐదేళ్లు అధికారం ఇస్తే ఏం జరుగుతుందన్నది ఇట్టే అర్థమవుతుంది. మరలా ఈ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే వారి గ్యారంటీల మాటేమో గానీ, కొన్ని దుష్పరిణామాలు మాత్రం గ్యారంటీగా జరిగి తీరుతాయి.

నల్లధనం ఏరివేత పేరుతో చేసిన పెద్ద నోట్ల రద్దు ప్రహసనం కొండను తవ్వి ఎలకను కూడా పట్టని చందంగా మారింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల మాట అటుంచి, ఈ కాలంలో రెండు కోట్ల మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వ వివిధ డిపార్టుమెంట్లలో అధికారికంగా 10 లక్షల వరకు ఖాళీలు ఉన్నాయని పార్లమెంటులో ఒక ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం తెలిపింది. వాస్తవంలో ఇవి 30 లక్షల వరకు ఉంటాయని అంచనా. ఆఖరుకు సైన్యంలో నియామకాలు కూడా కాంట్రాక్టు పద్ధతికి మార్చేశారు. ఉత్తరప్రదేశ్‌లో 60,244 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు గాను 50 లక్షలకు పైగా పరీక్షకు హాజరయ్యారంటే నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. ఇంకా విశేషమేమంటే పేపర్ లీక్ పేరుతో పరీక్ష రద్దుచేసి, ఆ పోస్టులను కూడా నింపలేదు. రైతుల ఆదాయాలు రెట్టింపు మాట అటుంచి, అప్పులు మాత్రం రెట్టింపయ్యాయి. ఆత్మహత్యలు పెరిగాయి. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు మా పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వండి మహాప్రభో అని దేశ రాజధాని చేరుకున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధానికి పూనుకుంది. రోడ్లపై మేకులు దిగ్గొట్టింది. ముళ్ళకంచెలు వేసింది. ఇవి చాలదన్నట్లు రోడ్లను తవ్వేసింది. దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై నీటి ఫిరంగులతో దాడి చేసింది. శత్రువులపై వాడే డ్రోన్లతో బాష్ప వాయువు కూడా ప్రయోగించింది. ఇన్ని ఘన కార్యాలు చేసి, ఈ పదేళ్ళ లోనూ దేశ ప్రజలకు ఏం చేశామో చెప్పుకోవడానికి ఏమీ లేక ఇప్పుడు మోదీ గ్యారంటీ పేరుతో మరో కొత్త ప్రచారానికి తెరలేపింది.

వీరి పదేళ్ల పాలనలో జరిగిన వాస్తవం ఏమిటంటే పేదరికం, ఉపాధి కల్పన వంటి అనేక అంశాలలో ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశం అధమ స్థాయికి, ఆకలి, ఆదాయ అసమానతలలో మాత్రం అగ్ర భాగానికి చేరుకుందని అనేక అంతర్జాతీయ సంస్థలు తెలిపాయి. పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. మానవ హక్కులు హరించి వేయబడుతున్నాయి. ప్రశ్నించిన వారిపై నిర్బంధం ప్రయోగించడం, హత్యలకు పాల్పడడం పరిపాటిగా మారింది. దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయి. బేటీ బచావో – బేటీ పఢావో వంటి ఆకర్షణీయ నినాదాలిచ్చినా ఆచరణలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. 2019–21 మధ్య కాలంలో 13.13 లక్షలమంది అమ్మాయిలు కనపడకుండా పోయారని స్వయంగా హోం మంత్రిత్వ శాఖే పార్లమెంటులో ప్రకటించింది. అడవులు, సముద్రంతో సహా సహజ వనరులను తన కార్పొరేట్ మిత్రులకు దోచి పెడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల ద్వారా బెదిరించడం, అధిక మొత్తంలో డబ్బు ఆశ చూపి ప్రలోభపెట్టడం వంటి చర్యలతో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూలుస్తూ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చింది. ఎన్నికల బాండ్ల పేరున కార్పొరేట్ల నుండి భారీగా నిధులు పొందడాన్ని చట్టబద్ధం చేయడం చెల్లదని, తన తొత్తు ఎన్నికల అధికారి ద్వారా చండీఘర్ మేయర్ ఎన్నికను తారుమారు చేయడం చెల్లదని పేర్కొంటూ, వాటిని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పులు మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనం.

మోదీ ప్రభుత్వ పదేళ్ల పాలనను కొద్దిగా పరిశీలించినవారెవరికైనా సరే మరో ఐదేళ్లు అధికారం ఇస్తే ఏం జరుగుతుందన్నది ఇట్టే అర్థమవుతుంది. మరలా ఈ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే వారి గ్యారంటీల మాటేమో గానీ, కొన్ని దుష్పరిణామాలు మాత్రం గ్యారంటీగా జరిగి తీరుతాయి.

దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటినీ అమ్మేయడం ఖాయం. మసీదులు పడగొట్టి దేవాలయాలు నిర్మించడం ద్వారా మత ఘర్షణలు రెచ్చగొట్టడం ఖాయం. మణిపూర్‌లో లాగా తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రజల మధ్య చిచ్చులు పెట్టి మారణహోమం సృష్టించడం ఖాయం. దేశంలో పేదరికం మరింత పెరగడం ఖాయం. ధరలు ఆకాశాన్నంటడం ఖాయం. అడవుల నుండి ఆదివాసులను, సముద్రం నుండి మత్స్యకారులను గెంటివేయడం ఖాయం. రైతుల అప్పులు, ఆత్మహత్యలు పెరగడం ఖాయం. నిరుద్యోగ యువత ఉద్యోగాలపై ఆశలు వదులుకోవడం ఖాయం. అంబానీ, అదానీల ఆస్తులు భారీగా పెరగటం ఖాయం. ప్రజాస్వామ్యం మటుమాయం కావడం ఖాయం. రాజ్యాంగం ధ్వంసం కావడం మరింత ఖాయం. ఇప్పుడు మోదీ గ్యారంటీ మాయ మాటలను నమ్ముతామా, మరలా అధికారంలోనికి వస్తే గ్యారంటీగా జరగబోయే వాటిని నమ్ముతామా అన్నది ఈ పదేళ్ల అనుభవంతో తేల్చుకోవాల్సిన సమయమిదే.

● ఎ. అజ శర్మ

ధరణి సవరణలతో రైతుల్లో ఆనంద హేల!


తెలంగాణ రాష్ట్రంలో చాలా నెలల తర్వాత తహశీల్దార్ కార్యాలయాలు రైతులతో కళకళలాడుతున్నాయి. సుమారు నలభై నెలల పాటు తహశీల్దార్ కార్యాలయం మెట్లు తొక్కని రైతులు ఇప్పుడు నమ్మకంతో మళ్లీ కార్యాలయాలకు వస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ రైతాంగాన్ని చిన్నాభిన్నం చేసిన సందర్భాన్ని చూశాం. భూ సంస్కరణల పేరుతో లోపభూయిష్టమైన సాఫ్ట్‌వేర్‌తో తెచ్చిన 'ధరణి' రైతులకు శాపంగానే మారింది. రాష్ట్రంలో నేడు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలనలో భాగంగా ధరణిని పునర్నిర్మించే ప్రయత్నాలు ఆరంభించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ధరణి పోర్టల్‌లో సమూల మార్పులు, అధికార వికేంద్రీకరణ– వీటి వల్ల రైతుల్లోనే కాకుండా రెవెన్యూ విభాగంలోనూ నూతనోత్సాహం కనిపిస్తోంది.

గత ప్రభుత్వం అద్భుతమైన కొత్త భూచట్టం వస్తుందంటూ సుమారు మూడు నెలలకు పైగా రాష్ట్రంలో అన్ని రకాల లావాదేవీలను నిలిపివేసి చివరకు గుదిబండ లాంటి ధరణి పోర్టల్‌ను తెచ్చి ప్రజల నెత్తిన భారంగా మోపింది. అక్టోబరు 29, 2020న ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో ప్రజల ఆస్తులైన వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించిన సమీకృత భూమి రికార్డుల నమోదు ఉండే అధికారిక పోర్టల్‌గా ధరణిని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ ధరణి పుట్టుకతోనే తెలంగాణ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. అప్పటివరకు రైతులకు భూమి హక్కులకు సంబంధించిన ఏ సేవనైనా ఉచితంగానే పొందే అవకాశం ఉండేది. తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకుంటే పట్టాదార్ పాస్ పుస్తకం నుంచి మొదలు ఇతర అన్ని రకాల సేవలు ఉచితంగానే అందేవి. కానీ ధరణి పోర్టల్ వచ్చాక ప్రతి సేవకు ఒక ధర పెట్టి రైతులను దోపిడీ చేశారు. ఏ సేవ పొందాలన్నా ముందుగా వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఎలాంటి కారణం చెప్పకుండానే చేసిన దరఖాస్తులన్నీ కూడా తిరస్కరించే వారు. ఈ విధంగా సేవ పొందకుండానే తిరస్కరణకు గురైన దరఖాస్తులు సుమారు 5 లక్షలకు పైగానే ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అంటేనే రెవెన్యూ విభాగం. ప్రజలు సైతం రెవెన్యూ విభాగాన్నే ప్రభుత్వంగా భావించేవారు. తమకు ఏ ఆపద వచ్చినా, సమస్య ఏర్పడినా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అర్జీ పెట్టుకునేవారు. కానీ ధరణి వచ్చాక తహశీల్దార్లకే కాదు ఆర్డీఓలకు ఉన్న అధికారాలను సైతం తొలగించేశారు. కొన్ని అధికారాలను కలెక్టర్లకు ఇచ్చి మిగతా వాటిని సీసీఎలఏకు మార్చారు. ఏ భూములకు సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా ఊరి నుంచి హైదరాబాద్‌లోని సీసీఎలఏకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితిని తెచ్చి పెట్టారు. గతంలో గ్రామంలో లేదా మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యను ధరణి పుణ్యాన హైదరాబాద్ వరకు తెచ్చారు. కేవలం ధన బలం, రాజకీయ బలం ఉన్న వారికే ధరణిలో పని అయ్యే పరిస్థితి ఏర్పడింది. సామాన్యులకు ధరణి సేవలు అందని పండుగానే మిగిలిపోయాయి. ఈ క్రమంలోనే బలవంతులు, ధనవంతులు ఇష్టారాజ్యంగా వారి పేర భూములను ధరణిలోకి ఎక్కించుకున్నారనే ఆరోపణలున్నాయి. నగర శివారులోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములను సైతం కొల్లగొట్టారు. ప్రభుత్వ ఆస్తులుగా ఉన్న కొండలు, గుట్టలు, చెరువులు అన్నీ కూడా ధరణిలో ప్రైవేటు వ్యక్తుల పేర్లతో నమోదయ్యాయి. ధరణితో ప్రజల ఆస్తుల ధ్వంసంతో పాటు ప్రభుత్వ భూములను మింగేశారు. ధరణి సృష్టించిన విధ్వంసం చరిత్రలో ఒక పీడకలగానే మిగిలిపోనుంది.

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరణి పోర్టల్ ప్రక్షాళన, సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎం.కోదండరెడ్డి నేతృత్వంలో న్యాయవాది, భూ చట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్, విశ్రాంత స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ మధుసూదన్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ పలుమార్లు రెవెన్యూ, దేవాదాయ, అటవీ, ఇతర అన్ని విభాగాలతో సమావేశమై లోతుగా చర్చించింది. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పరిష్కారానికి గల మార్గాలను అన్వేషించింది. రైతుల భూ సమస్యలు పరిష్కారం కావాలంటే అవి క్షేత్రస్థాయిలోనే చేయాలని ప్రభుత్వానికి కమిటీ సూచించింది. కమిటీ సూచనల ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోను, ఇతర ఉన్నతాధికారులతోనూ సమాలోచనలు చేశారు. ధరణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తులను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు.

ధరణి పోర్టల్‌లోని లోపభూయిష్టమైన సాఫ్ట్‌వేర్‌తో డేటా అంతా కూడా తప్పుల తడకగానే నమోదైంది. ఒక రైతుకు రెండు సర్వే నంబర్లలో 3 ఎకరాలు ఉంటే ధరణిలో ఎకరం మాత్రమే నమోదైంది. మిగతా ఒక ఎకరం పక్క రైతు పేరు మీద నమోదైంది. లక్షల కేసులు ఇలాంటివే. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం ఈ తరహా డేటా కరెక్షన్ కోసమే 2,43,541 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 66,339 దరఖాస్తులను మాత్రమే ఓకే చేశారు. మిగతా 77,142 దరఖాస్తులను తిరస్కరించారు, ఇంకా లక్ష దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మొత్తంగా ధరణికి వచ్చిన మొత్తం దరఖాస్తులు 16,57,407 కాగా వీటిలో 8,78,282 మాత్రమే పరిష్కారం కాగా మిగిలిన 5,37,984 తిరస్కరించగా, నేటికి 2,40,127 పెండింగ్‌లోనే ఉన్నాయి. తరుచుగా తిరస్కరించిన దరఖాస్తులతో రైతులకు భారం పెరిగిపోగా ధరణి నిర్వాహకులకు మాత్రం ఇదే మంచి ఆదాయ వనరుగా మారింది.



ధరణి పోర్టల్ పేరు మార్పా? లేదా ప్రక్షాళనా? పునర్నిర్మాణమా? అనే విషయాలను పక్కన పెట్టి ముందు తక్షణ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెండింగ్‌లో ఉన్న 2.40 లక్షల దరఖాస్తులు పరిష్కరించేలా కేంద్రీకృతమై ఉన్న అధికారాలను వికేంద్రీకరించింది. నాలుగు స్థాయిలలో దరఖాస్తులలోని అంశాల వారీగా పరిష్కారాలు ప్రారంభించాలని సీసీఎలఏ నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

ధరణి పోర్టల్ పేరు మార్పా? లేదా ప్రక్షాళనా? పునర్నిర్మాణమా? అనే విషయాలను పక్కన పెట్టి ముందు తక్షణ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెండింగ్‌లో ఉన్న 2.40 లక్షల దరఖాస్తులు పరిష్కరించేలా కేంద్రీకృతమై ఉన్న అధికారాలను వికేంద్రీకరించింది. నాలుగు స్థాయిలలో దరఖాస్తుల లోని అంశాల వారీగా పరిష్కారాలు ప్రారంభించాలని సీసీఎలఏ నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. తహశీల్దార్ పరిధిలో ఎసైన్డ్ భూములతో పాటు అన్ని రకాల వారసత్వ, బదిలీ ప్రక్రియలు; రెండు, మూడు ఖాతాలు నమోదై ఉంటే కలపడం; జీపీఏ, ఎస్‌పీఏ, ఇతర భూ సంబంధిత దరఖాస్తులను సేత్వార్, ఖాస్రా పహణీ, ఇతర మూల పత్రాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించడం చేస్తున్నారు. పాస్‌పుస్తకాలు లేకుండా వ్యవసాయేతర భూములుగా నమోదైనవి, భూ సేకరణకు సంబంధించినవి, ప్రవాసీయులకు సంబంధించినవి, సంస్థల పేరుతో పాస్ పుస్తకాలు, కోర్టు కేసులు, జారీ చేసిన పాస్ పుస్తకాలలో దొర్లిన తప్పులకు సంబంధించిన ఆర్డీవోల స్థాయిలో పరిష్కారం చేస్తున్నారు. యాజమాన్య హక్కుల బదిలీ, వారసత్వ బదిలీలు, నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించినవి, సెమీ అర్బన్ భూములు, ఇంటి స్థలాలు వ్యవసాయేతర భూములుగా మార్పిడి, పాస్ పుస్తకాలలో సవరణలు, ఏజెన్సీ ప్రాంతాలలో భూ సమస్యలను ఆర్డీవోల విచారణ అనంతరం కలెక్టర్లు చేస్తున్నారు. చివరి స్థాయి ఉన్నతమైనది సీసీఎలఏ స్థాయిలో టీఎం 33 మాడ్యూల్‌కు సంబంధించిన అన్ని రకాల పాస్ పుస్తకాల సవరణలను సీసీఎలఏ చేయనున్నారు. భూ సమస్య లేని తెలంగాణ కావాలంటే ముందుగా ధరణి సమస్య పరిష్కారం కావాలి. అప్పుడే రైతులకు సులభంగా, వేగంగా రెవెన్యూ సేవలు అందుతాయి. దీంతోపాటు రైతులకు ఏ విధమైన భారం లేకుండా గ్రామ స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి తేవాలి. సకాలంలోనే అన్ని రకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలని ఆశిద్దాం.

వర్సిటీల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణలో 10 విశ్వవిద్యాలయాలకు నూతన వైస్ ఛాన్సలర్ల నియామకాలకు రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా 1382 దరఖాస్తులు వచ్చాయి. గత ప్రభుత్వం నియమించిన వీసీల పదవీకాలం మూడు నెలలు మిగిలివుండగానే నూతన వీసీలను నియమించాలని నిర్ణయించడం అభినందనీయం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కేంద్రాలుగా ఉన్న వర్సిటీలు, స్వరాష్ట్రంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. కేటాయిస్తున్న నిధులు సరిపోక, రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక విశ్వవిద్యాలయాలు విలవిల్లాడుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా వీసీల నియామకంతోనే సరిపెట్టకుండా, యూనివర్సిటీల సమస్యలు పరిష్కారం చేసి వాటిని అభివృద్ధి దిశగా నడిపించాలి.

2014లో రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి వీసీల కాలపరిమితి తీరిన తర్వాత రెండేళ్లు ఐఏఎస్ ఆఫీసర్లను వీసీలుగా పెట్టినప్పుడు విశ్వవిద్యాలయాల పరిపాలన నత్తనడకన సాగింది. 2016లో తొలిసారిగా తెలంగాణలో వీసీల నియామకాలు జరిగాయి. 2019లో మళ్ళీ ఇన్‌చార్జిల పాలన తర్వాత పూర్తిస్థాయిలో 2021లో ప్రభుత్వం వీసీల నియామకాలను చేపట్టింది. ఈ కాలం అంతా యూనివర్సిటీలను ఎన్నడూ పేదలకు విద్యను అందించే కేంద్రాలుగా ప్రభుత్వం చూడలేదు. కనీసం ఈ రాష్ట్ర ఉద్యమం కోసం అగ్రభాగాన నిలిచిన కేంద్రాలుగా చూడలేదు. కేవలం అధికార పార్టీ రాజకీయ నాయకుల పునరావాస కేంద్రాలుగా వీటిని మార్చారు. అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడం, రిసెర్చ్ గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో పరిశోధనలు పక్కదారి పట్టాయి. రాజకీయ జోక్యం కారణంగా కుల, మత ప్రభావంతో విశ్వవిద్యాలయాలు తమ ప్రభ కోల్పోయాయి. అభివృద్ధి, నాణ్యత లేక ప్రమాణాలు దిగజారిపోయి ర్యాంకింగులలో పడిపోతున్నాయి. అందుకే వైస్–ఛాన్సలర్స్ నియామకాలు పారదర్శకంగా జరిగినప్పుడే వర్సిటీల అభివృద్ధి సాధ్యమవుతుంది.



రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు యూనివర్సిటీలు నిధులు క్రమంగా తగ్గాయి. అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు శూన్యం. కొత్తగా మహిళా, ఫారెస్ట్ యూనివర్సిటీలను గత ప్రభుత్వం తీసుకుని వచ్చినా, కనీసం సౌకర్యాలు, ఫ్యాకల్టీ నియామకాలను చేపట్టలేదు. నిధులు లేక బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థులు ఆందోళనలు చూశాం. విద్యార్థులకు మెస్, ల్యాబ్స్, లైబ్రరీ సౌకర్యాలు లేవు. రేకుల షెడ్లు, పాత భవనాల్లో హాస్టళ్లు నడుస్తున్నాయి. నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ యూనివర్సిటీల ప్రాధాన్యత తగ్గించే కుట్రలు చేస్తున్నారు. సరైన భోజన సదుపాయాలు, వైద్య, వసతి సదుపాయాలు లేవు.

2013 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర యూనివర్సిటీలలో నియామకాలు లేవు. గత ప్రభుత్వం తమకు తెలియకుండా నియామకాలు చేపట్టరాదని జీవో కూడా తెచ్చింది. రాష్ట్ర యూనివర్సిటీలలో కేవలం 24 శాతం మాత్రమే రెగ్యులర్ పోస్టులున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీల తరహాలో రిటైర్ అవుతున్న వారి స్థానంలో వెంటనే నియామకాలు జరగాలి. రాష్ట్రంలో 8000 బోధన, బోధనేతర ఖాళీలు ఉన్నాయని 2020లో ప్రభుత్వం ప్రకటించింది. వాటిని భర్తీ చేయలేదు. కాంట్రాక్టు, పార్ట్ టైం పద్ధతిలో అధ్యాపకులను భర్తీ చేశారు. వారికి కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. పైగా రెగ్యులర్ అధ్యాపకులు లేరని కోర్సులు మూసివేస్తున్నారు. రాష్ట్రంలో 2828 పోస్టులు మంజూరు కాగా, 1869 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిలో 238 ప్రొఫెసర్, 781 అసోసియేట్ ప్రొఫెసర్, 850 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకులు లేకపోవడంతో పరిశోధనలు కాదుకదా, కనీసం చదువుకునే అవకాశం లేకుండా పోతోంది. తెలుగు యూనివర్శిటీలో తెలుగు ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రతి యేటా గ్రూపుల, డీఎస్సీలు, నోటిఫికేషన్స్ ద్వారా వేలాది పోస్టులు భర్తీ చేస్తున్నా యూనివర్సిటీలలో మాత్రం ఇప్పటికీ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవడం లేదు.

రాజకీయ జోక్యంతో వచ్చిన వీసీలు రెగ్యులర్ కోర్సులను రద్దు చేస్తూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రోత్సహిస్తున్నారు. వేలాది రూపాయలు పేద విద్యార్థుల నుంచి దండుకుంటున్నారు. తెలంగాణ రాకముందు ఉస్మానియా యూనివర్సిటీలో 3 నుంచి 5 వేలు ఉన్న కోర్సు ఫీజును 35 వేల రూపాయలు చేశారు. రెండు వేలు ఉన్న పీహెచ్‌డీ ఫీజు 20 వేల రూపాయలకు పెంచారు. దీంతో అణగారిన వర్గాలను చదువుకు దూరం చేస్తున్నారు.

గత ప్రభుత్వం కనీసం ఒక్కసారి కూడా యూనివర్సిటీ విద్య, సౌకర్యాలపై సమీక్ష చేయలేదు, ఈ ప్రభుత్వమైనా సమీక్షించి సమస్యలు పరిష్కరించాలి. పేద వర్గాల విద్యార్థులను పరిశోధనలు చేయడానికి ప్రోత్సహించాలి. నేషనల్ ఫెలోషిప్స్ రాని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు 25 వేల రూపాయలు ఫెలోషిప్ ఇవ్వాలి. పీజీ విద్యార్థులకు నెలకు ఐదు వేలు ఫెలోషిప్ ఇవ్వాలి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్యార్థుల స్కిల్స్ పెంచడానికి చర్యలు తీసుకోవాలి. యూనివర్శిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలి. నూతన హాస్టల్స్ నిర్మాణం, మోడ్రన్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, రిసెర్చ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి, ప్రజాస్వామ్య రక్షణకు విద్యార్థి సంఘాలు ఎన్నికలు నిర్వహించాలి. ప్రతి సంవత్సరం అన్ని యూనివర్శిటీలకు రిసెర్చ్ గ్రాంట్స్ ఇవ్వాలి. వీసీల నియామకాలు ఒక్కటే కాకుండా ప్రభుత్వ యూనివర్శిటీలను, వాటి అనుబంధ క్యాంపస్‌లను అభివృద్ధి చేయాలి.

– టి. నాగరాజు, ఎసఎఫఐ రాష్ట్ర కార్యదర్శి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.2 కనిష్ఠం 23.5

కరెంటే లేదు!

వసతులు అసలే లేవు.. తాగునీళ్లకూ దిక్కులేదు



హెచ్‌బీకాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- ఇంకా పూర్తికాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- పట్టాలిచ్చి సదుపాయాలు మరిచిన గత ప్రభుత్వం
- 10 శాతం ఇళ్లల్లోకి లబ్ధిదారుల చేరిక
- మిగతా వాటిని త్వరగా పూర్తిచేయాలని కోరుతున్న లబ్ధిదారులు



డబుల్ బెడ్‌రూం ఇల్లు వచ్చిందన్న సంతోషం ఆరునెలలు గడిచినా లబ్ధిదారులకు కలగడం లేదు. కారణం.. ఎన్నికలకు ముందు హడావిడిగా పట్టాలిచ్చిన అప్పటి ప్రభుత్వం.. ఆ ఇళ్లకు కరెంట్ ఇవ్వలేదు. తాగునీటి సరఫరా చేయలేదు. కాలయాపనతో అనేక ఇళ్లకు సంబంధించి విద్యుత్ వైర్లు, నల్లాలు, కిటికీలగ్రిల్స్ చోరీకి గురయ్యాయి. కేవలం 10 శాతం ఇళ్లలోకి లబ్ధిదారులు వచ్చి చేరారు. వసతులన్నీ కల్పిస్తే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు వద్దామని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూడు, నాలుగేళ్ల క్రితం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడిగా పంపిణీ చేశారు. ఏళ్ల తరబడి నిర్వహణ లేని ఇళ్లలో మౌలిక సదుపాయాల విషయాన్ని గతంలో ఎవరూ పట్టించుకోలేదు. పట్టాలు అందజేసిన సమయంలో నెల రోజుల్లో మరమ్మతు పనులతోపాటు వసతులు కల్పిస్తామని అధికారులు చెప్పారు. ఆరునెలలైనా.. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరిగిన దాఖలాలు లేవు. దీంతో ఇళ్లు పొందామన్న ఆనందం నిరుపేదల్లో కనిపించడం లేదు.

చోరీ సామగ్రి తిరిగి ఏర్పాటు..

గ్రేటర్‌లో రూ.9,714 కోట్ల అంచనాతో లక్ష రెండు పడకల ఇళ్లు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. స్థల వివాదాలు, ఇతరత్రా కారణాలతో 2 వేల ఇళ్ల పనులు ప్రారంభం కాలేదు. 98 వేల ఇళ్లలో పూర్తయిన 68,804 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. దాదాపు 64 వేల పైచిలుకు ఇళ్లను అసెంబ్లీ ఎన్నికల ముందు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పంపిణీ చేశారు. అంతకుముందు ఇన్‌సిటు లబ్ధిదారులకు 4వేలకుపైగా ఇళ్లు ఇచ్చారు. 64 వేల ఇళ్లలో అత్యధికం మూడు, నాలుగేళ్ల క్రితం పూర్తయినవే. స్టిల్ట్ ప్లస్ ఐదు నుంచి 11 అంతస్తుల వరకు బ్లాక్‌లుగా ఇళ్ల నిర్మాణం జరిగింది. ఎక్కువ అంతస్తులుండడంతో నివాసితులు పైకి ఎక్కేందుకు వీలుగా లిఫ్టులు, జనరేటర్లు అమర్చారు. వాటి నిర్వహణ ఆదాయాన్ని అద్దె ఆదాయం ద్వారా పొందేలా దుకాణాలు నిర్మించారు. ఏర్పాటుచేసిన నాటి నుంచి లిఫ్టు వినియోగించకపోవడంతో అవి పనిచేయని పరిస్థితి నెలకొంది. దీంతో వాటి మరమ్మతు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లోని ఇళ్లలో విద్యుత్‌వైర్లు, నల్లాలు, కిటికీల గ్రిల్స్ వంటివి చోరీకి గురయ్యాయి. వాటిని ఇప్పుడు తిరిగి అమర్చుతున్నారు. ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు రూ.50 కోట్ల వరకు ఖర్చవుతుందని సూత్రప్రాయంగా అంచనా వేశారు. సగానికిపైగా పనులు పూర్తయ్యాయని ఓ అధికారి తెలిపారు.


విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో..

గత సెప్టెంబర్, అక్టోబర్‌లో ఇళ్ల పంపిణీ జరిగింది. సదుపాయాలు లేకపోవడం, విద్యా సంవత్సరం సగంలో ఉండడంతో లబ్ధిదారులు ఇళ్లలోకి

మిగతా 8వ పేజీలో..


విద్యుత్ సరఫరా లేక..

తాగునీరు, విద్యుత్ సరఫరా కోసం ఆ ఇళ్లకు రూ.616 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇందులో వాటర్‌బోర్డు పైపులైన్ పనులు సింహభాగం పూర్తయ్యాయి. చాలా ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఇప్పటికీ జరగలేదు. నిధులు పూర్తిస్థాయిలో ఇవ్వనందునే పనుల్లో జాప్యం జరుగుతున్నదన్నది విద్యుత్ విభాగం వారి వాదన. స్తంభాలు ఉన్నా విద్యుత్ సరఫరా చేయడం లేదు. కొన్నిచోట్ల సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా లేని దృష్ట్యా.. లబ్ధిదారులకు మీటర్లు ఇచ్చేందుకూ టీఎస్ఎస్‌పీడీసీఎల్ నిరాకరిస్తోంది.



రంజాన్ దీక్షలు ఆరంభం

నెలవంక కనిపించడం, మసీదుల్లో సోమవారం సైరన్ మోగడంతో ముస్లింలు రంజాన్ దీక్షలు ప్రారంభించారు. ఈనేపథ్యంలో పాతబస్తీలోని మక్కామసీదును సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





హుస్సేన్‌సాగర్ అలలపై..

అద్భుత లేజర్ షో!


- దేశ చరిత్రలోనే తొలిసారిగా ఏర్పాటు..
- నేటి సాయంత్రం ప్రారంభించనున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగరంలో పర్యాటకానికి సంబంధించిన మరో కొత్త ప్రాజెక్టు ప్రజలకు అంకితం కానుంది. అత్యాధునిక సాంకేతికతతో వాటర్ స్ర్కీన్, మ్యూజికల్ ఫౌంటెయిన్‌పై లేజర్ ఆధారిత సౌండ్, లైట్ షోను కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నారు. ఓ చెరువు అలలపై లేజర్ ఆధారిత సౌండ్

మిగతా 8వ పేజీలో..

జాండిస్‌తో

జాగ్రత్త



- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు
- పారాసిటమాల్, టీబీ మందులతో ఇబ్బందులు
- షుగర్ నియంత్రణలో లేకపోతే అవస్థలే
- నాటు వైద్యం చేస్తే మరింత ప్రమాదం

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాండిస్ (పచ్చకామెర్లు) కామన్ కదా.. అని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పుగా మారొచ్చు. కాలేయ మార్పిడికి దారితీయొచ్చు. మంచాన పడేవరకూ చాలా మంది వ్యాధి సోకిందనే విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. ఏమాత్రం ఆలస్యం జరిగినా సీరియస్‌గా మారుతోందని వైద్యులు చెబుతున్నారు.

రక్తంలో బిలిరుబిన్ పెరిగితే..

రక్తంలో బిలిరుబిన్ స్థాయి పెరిగినప్పుడు జబ్బు తీవ్రత పెరుగుతుందని సీనియర్ హెపటాలజిస్ట్, కాలేయ మార్పిడి నిపుణులు డాక్టర్ ఆనంద్ వి కులకర్ణి చెప్పారు. ప్లాస్మాలోని బిలిరుబిన్ గాఢత సాధారణ విలువ 1 మిల్లీగ్రామ్ కంటే ఎక్కువ ఉంటే జాండిస్ వచ్చినట్లుగా పరిగణిస్తామని చెప్పారు. చర్మం, కనుగుడ్లు పసుపురంగులో కనిపిస్తే జాండిస్‌గా గుర్తిస్తారు. లివర్ ఫంక్షన్‌టెస్ట్‌తో వ్యాధిని గుర్తించొచ్చు. అల్ట్రాసౌండ్ పరీక్షతో సమస్య తీవ్రత నిర్ధారణ అవుతుంది.

కారణాలు అనేకం

సాధారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో జాండిస్ వస్తుంటాయి. 99 శాతం చికిత్సతో పూర్తిగా నయం అవుతుంది. ఒక శాతం మందిలో కాలేయ పనితీరుపై ప్రభావం చూపుతుందని డాక్టర్ ఆనంద్ కులకర్ణి చెప్పారు. కాలేయ మార్పిడి చేయాల్సి ఉంటుందన్నారు. మద్యం అతిగా తాగేవారికీ జాండిస్ వచ్చే అవకాశాలు ఉంటాయి. కేన్సర్ ఉన్నవారికి వ్యాధి సోకితే ప్రాణాలకు ముప్పు అని వైద్యులు పేర్కొంటున్నారు.

లక్షణాలు ఇలా..

- కంటిలో తెల్లగుడ్డు పచ్చగా మారడం
- మూత్రం పసుపురంగులోకి మారడం
- బూడిదరంగు మలం, జ్వరం, ఒళ్లు నొప్పులు
- ఆకలి తగ్గడం, దురదలు, వాంతులు రావడం
- కామెర్లు తీవ్రమైతే పాదాల వాపు, నిద్రపట్టకపోవడం, రక్తపు వాంతులు, చేతులు వణకడం వంటి లక్షణాలు ఉంటాయి.

ఈ జాగ్రత్తలు పాటించండి..



- అనుమానం ఉంటే రక్తపరీక్ష, ఎల్‌ఎఫ్‌టీ, అల్ట్రాసౌండ్ పరీక్షల ద్వారా నిర్ధారించుకోవాలి.
- జాండిస్ ఉన్నవారు ఆల్కహాల్ తాగితే కాలేయం ఫెయిల్ అయి చనిపోయే ప్రమాదం ఉంది.
- వారానికి ఒకసారి షుగర్ టెస్ట్ చేయించుకోవాలి.
- ప్రతిఒక్కరు వ్యాక్సిన్ వేసుకోవాలి
- వ్యక్తిగత శుభ్రత పాటించాలి.
- కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉండాలి.
- హెపటైటిస్ నివారణకు టీకాలు తీసుకోవాలి.
- నీళ్లు బాగా తాగాలి. హైప్రొటీన్ ఆహారం తీసుకోవాలి.

- డాక్టర్ ఆనంద్ వి కులకర్ణి, సీనియర్ హెపటాలజిస్ట్, కాలేయ మార్పిడి నిపుణులు, ఏఐజీ ఆస్పత్రి

నేడు నగరంలో

ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో మంగళవారం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సంబంధిత విభాగ అధికారులు వెల్లడించా రు. అమిత్‌షా రోడ్డు మార్గంలో వెళ్లి చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం సికింద్రాబాద్, ఎల్బీస్టేడియం, బేగంపేటతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని అధికారులు తెలిపారు. ఆయా మార్గాల్లో ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.



మహిళను నిలదీస్తున్న బస్తీవాసులు

కిడ్నాప్ కలకలం

- రెజిమెంటల్‌బజార్‌లో ఇద్దరు మహిళల కిడ్నాప్‌యత్నం
- ఒకరిని పట్టుకుని బస్తీవాసుల దేహశుద్ధి
- పోలీసుల అప్పగింత

8

- ఆగస్టులోగా తరలించేందుకు ప్రణాళికలు
- ఇక అద్దెకు అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్



'మహా' ఆఫీస్

@ పైగా ప్యాలెస్

హైదరాబాద్ సిటీ, మార్చి11 (ఆంధ్రజ్యోతి) హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కార్యాలయం బేగంపేటలోని పైగా ప్యాలెస్‌కు మారనుంది. 15ఏళ్ల క్రితం వరకు అక్కడే ఉన్న హెచ్ఎండీఏ కార్యాలయాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. తొలుత ఆ ప్యాలెస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి క్యాంప్ ఆఫీసు కోసం పరిశీలించారు. రేవంత్‌రెడ్డి విముఖత చూపినట్లు తెలిసింది. దీంతో పైగా ప్యాలెస్‌లో హెచ్ఎండీఏ కార్యాలయం కొనసాగించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

ప్యాలెస్ విశిష్టత ఇదీ..

బేగంపేట చిరాన్‌లేన్‌లోని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పైగా ప్యాలెస్ ఇంద్ర భవనంలా ఉంటుంది. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ దగ్గర ప్రధానమంత్రిగా పని చేసిన నవాబ్ వికారుల్ ఉమ్రా 1900లో ఈ ప్యాలెస్ నిర్మించారు. ఉమ్రా పైగా వంశానికి చెందినవారు కావడంతో దీనికి పైగా ప్యాలెస్‌గా పేరొచ్చింది. అత్యాధునిక హంగులతో యూరోపియన్ శైలిలో ప్యాలెస్ నిర్మించారు. ఈ ప్యాలెస్‌కు 22 అడుగుల ఎత్తయిన పైకప్పు ఉంది. మొదటి అంతస్తులో 20 గదులున్నాయి. వాటి బాతురూమ్‌లే 300 చదరపు అడుగుల వైశాల్యంలో ఉన్నాయంటే ప్యాలెస్ ఏరకంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్యాలెస్ రెండో అంతస్తుకు చేరుకోవడానికి కలపతో చేసిన మెట్లుంటాయి.

హుడా ఏర్పాటు పైగా ప్యాలెస్‌లోనే..

ఉమ్మడిరాష్ట్రంలో 1975లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) ఏర్పాటైంది. తొలినాళ్లలో కార్యాలయాన్ని పైగా ప్యాలెస్‌లో ఏర్పాటు చేశారు. నిజాం పాలన తర్వాత పైగా ప్యాలెస్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో అప్పట్లో హుడా కార్యాలయం కోసం కేటాయించారు. హుడాకు తొలి చైర్‌పర్సన్‌గా సరోజినీ పుల్లారెడ్డి ఉండగా, తొలి వైస్‌చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి వసంత్ బవా కొనసాగారు. 2008లో హుడా పరిధిని ఏడు జిల్లాలకు విస్తరిస్తూ అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హెచ్ఎండీఏగా మార్చారు. ఆ సమయంలో హుడా కార్యాలయంగా కొనసాగుతున్న పైగా ప్యాలెస్‌ను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ కార్యాలయానికి అప్పగించారు. దాంతో హెచ్ఎండీఏ కార్యాలయం తార్నాకలోని హుడా కాంప్లెక్స్‌లోకి మారి 12 ఏళ్లు కొనసాగింది. మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌కు తరలించారు.

15ఏళ్ల పాటు యూఎస్ కాన్సులేట్ కోసం..

హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ నిర్వహణ కోసం పైగా ప్యాలెస్‌ను కేటాయించారు. 15 ఏళ్ల అనంతరం గతేడాది ఏప్రిల్‌లో తిరిగి హెచ్ఎండీఏకు అప్పగించారు. ప్రస్తుతం పైగా

మిగతా 8వ పేజీలో..

నీటి పొదుపుతోనే

సమస్య దూరం



- నగరంలో నీటి సంక్షోభంపై సంకేతాలు
- కాలనీలకు తగ్గిన నీటి సరఫరా...
- నీటి పరిరక్షణ చర్యలతోనే గట్టెక్కగలమంటున్న నిపుణులు



హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో నీటి ఎద్దడి మొదలైంది. పలు కాలనీలకు సరఫరా అవుతున్న నీటిలో కోత విధిస్తున్నారు. రెండు నెలల క్రితంతో పోలిస్తే ప్రెషర్ తక్కువగా వస్తుందని పలు కాలనీలవాసులు పేర్కొంటున్నారు. బెంగళూరు ఉదంతం నేపథ్యంలో వేసవిలో జాగ్రత్తపడాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో నీటి కష్టాలు గట్టెక్కేందుకు పలు సూచనలు చేస్తున్నారు.


రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్..

అపార్ట్‌మెంట్లలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్స్‌తో భూగర్భజలాలు గణనీయంగా పెరుగుతాయని అధ్యయనాలు, అనుభవాలూ చెబుతున్నాయి. ఆ మేరకు వాటిని నిర్వహిస్తే నీటి కొరత తీరే అవకాశం ఉంది. ప్రస్తుతం వస్తున్న ట్యాప్‌లతో ఇళ్లలో నీటిని ఆదా చేయొచ్చు. సాధారణ ట్యాప్‌లతో నిమిషానికి 15-20 లీటర్ల నీటిని వదిలితే, సాంకేతికతతో కూడిన ట్యాప్‌లు కేవలం 8 లీటర్ల నీటిని మాత్రమే వదులుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఇంకా ఏం చేయవచ్చంటే..

నీటి పొదుపు అడాప్టర్స్‌తో దాదాపు 50 శాతం నీటిని ఆదా చేయవచ్చు. బట్టలు ఉతికిన నీటిని ఫ్లష్ కోసం వాడితే నీరు చాలా వరకూ ఆదా అవుతుంది. డ్యూయల్ ఫ్లష్ టాయ్‌లెట్స్ వాడటం వల్ల కూడా నీరు ఆదా అవుతుంది. వంటపాత్రలు కడిగేటప్పుడు ట్యాప్ ఏకధాటిగా వదిలి ఉంచకూడదు. పాత్రలు నానబెట్టిన తరువాత కడగాలి. కూరగాయలను ట్యాప్ కింద పెట్టి కడగకుండా పాత్రలో వేసి కడగాలి. ఇలా చేయడం వల్ల కూడా నీరు ఆదా చేయొచ్చు.

లీకేజీలే ప్రధాన సమస్య..



చాలా వరకూ అపార్ట్‌మెంట్లలో లీకేజీ పెద్ద సమస్యగా ఉంటుంది. 15-20 ఏళ్ల క్రితం అపార్ట్‌మెంట్లలో నీటి పైపులన్నీ జీఐ లేదంటే ఐరన్ పైపులే ఉండేవి. అవి తుప్పు పట్టి లీకేజీలు అవుతుంటాయి. వీటి వల్ల సంవత్సరానికి 10 వేల లీటర్ల నీటిని వృధా చేసినట్లే! లీకేజీలు లేకుండా చూసుకుంటే చాలా వరకూ నీటిని ఆదా చేసుకోవచ్చు. రెండు, మూడు జతలకే కాకుండా బట్టలు నిండుగా ఉన్నప్పుడే వాషింగ్ మెషీన్‌ను వాడాలి. అలా చేస్తే నీరు ఆదా అవుతుంది. దానితో పాటు విద్యుత్తు, వాషింగ్ పౌడర్ కూడా ఆదా అవుతుంది. అపార్ట్‌మెంట్లలో నీళ్ల విషయంలో జరిగే వాదనలు ఒక్కోసారి వివాదాలకూ దారి తీస్తాయి. అలా కాకూడదనుకుంటే స్మార్ట్ వాటర్ మీటర్లు పెట్టుకోవాలి. వాటర్ ట్యాంక్‌ల నియంత్రణకు హౌసింగ్ సొసైటీ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ నైబియం లాంటి వాటి సహాయం తీసుకోవచ్చు. ట్యాంకర్ ఎప్పుడొచ్చింది, ఎప్పుడు వెళ్లింది, ఎంత నీరు సరఫరా చేసిందనేది తక్షణం అపార్ట్‌మెంట్ వాసులకు తెలుస్తుంది. దీనివల్ల పారదర్శకత పెరిగి, ఖర్చు తగ్గే అవకాశాలున్నాయి.

మీర్‌పేట మేయర్‌పై వీగిన అవిశ్వాసం

- ముఖం చాటేసిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు

8



గ్రీన్ మెట్రోఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ బస్సులు

రోడ్డుపైకి

గ్రీన్‌మెట్రో బస్సులు

- నేడు అందుబాటులోకి 22 వాహనాలు
- ఒక్కసారి చార్జింగ్ చేస్తే 220 కిలోమీటర్లు
- మహిళలకు ఉచిత ప్రయాణం

హైదరాబాద్ సిటీ/ మారేడుపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ మెట్రోఎక్స్‌ప్రెస్.. నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు మంగళవారం నుంచి రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. 22 బస్సులను ఖైరతాబాద్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం మంత్రులు ప్రారంభించనున్నారు. గ్రేటర్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో 500 గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను అందుబాటులోకి తేనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులకు ఒక్కసారి చార్జింగ్ చేస్తే 220 కిలోమీటర్లు ప్రయాణించనున్నాయి. డీసీ ఫాస్ట్ చార్జింగ్ పాయింట్‌తో గంట నుంచి గంటన్నరలో ఎలక్ట్రిక్ బస్సులకు పూర్తిస్థాయిలో చార్జింగ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈబస్సుల ఆపరేషన్స్ మియాపూర్, కంటోన్మెంట్ డిపోల నుంచి నిర్వహించనున్నారు. ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల తరహాలో నాన్ ఏసీ బస్సుల్లో సీటింగ్ ఉండనుంది. ఈ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు.

నేడు ఆరెంజ్ కలర్ వందేభారత్ రైలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు బయలుదేరే కొత్త ఆరెంజ్ కలర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును మంగళవారం ఉదయం 9గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గంటకు 80కిలోమీటర్ల సగటు వేగంతో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి 699కిలోమీటర్ల దూరాన్ని 8.45గంటల్లో ఈ రైలు చేరుకుంటుంది. ఈ ఏసీ ట్రైన్.. రెగ్యులర్‌గా విశాఖపట్నంలో ఈ నెల 13నుంచి, సికింద్రాబాద్‌లో ఈ నెల 15నుంచి అందుబాటులోకి వస్తుంది. ఈ రోజు నుంచి రిజర్వేషన్ బుకింగ్ ప్రారంభం అవుతాయి.

వందేభారత్‌తో కష్టాలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం-సికింద్రాబాద్, విశాఖపట్నం-తిరుపతిల మధ్య వందేభారత్ రైళ్లు తరచూ ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం సాంకేతిక లోపంతో వందేభారత్ రైలు విశాఖపట్నంలో ఆలస్యంగా బయలుదేరింది. దీని కారణంగా అనేక రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గంటల కొద్దీ స్టేషన్లలోనే పడిగాపులుగాయాల్సి వచ్చింది.

నవభారత సాక్షరతను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కదిరవన్

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నవభారత సాక్షరతను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. హైదరాబాద్ జిల్లాలో 68,454మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు పట్టణ ప్రగతి సర్వే ద్వారా గుర్తించామన్నారు. ఈ ఏడాది 9,135 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వయోజన విద్య డీడీ నాగలక్ష్మి, డీఈఓ రోహిణి, ఎస్సీ వెల్ఫేర్ డీడీ యాదయ్య, డీఎండబ్ల్యూఓ ఇలియాజ్ అహ్మద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న, డీటీడబ్ల్యూఓ కోటాజీ, ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి, చిత్రంలో డీసీపీ సునితారెడ్డి

పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌ను.. ఆకస్మికంగా తనిఖీ చేసిన రాచకొండ సీపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌లో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది ప్రతీ ఒక్కరి పని విధానాన్ని పరిశీలించి, విధి నిర్వహణలో ఉపయోగపడే పలు రకాల మెళకువలను తెలియజేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. సీసీటీవీల నిర్వహణపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీపీ వెంట మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

నాగులబండలో సమస్యలను పరిష్కరించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయ్ కుమార్

చాంద్రాయణగుట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా నాగులబండ అంబేద్కర్‌నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్నను సోమవారం బీజేపీ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బోయిని విజయ్ కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ... అంబేద్కర్‌నగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న కమ్యూనిటీ హాల్ భవనాన్ని కూల్చి నూతన హంగులతో కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. అంతేకాకుండా నూతన పవర్ బోర్, సీసీ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ పనులకు కూడా నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి



మొగల్‌పుర ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్‌ను శాలువాతో సత్కరిస్తున్న బీజేపీ నాయకుడు దినేష్ అంబారే

యాకుత్‌పురా, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు ఎల్లవేళల పోలీసులకు సహకరించాలని మొగల్‌పుర ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ అన్నారు. మొగల్‌పుర పోలీస్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను నగర బీజేపీ నాయకుడు, స్థానిక వార్డు కమిటీ మాజీ మెంబర్ దినేష్ అంబారే మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. స్థానికంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ ప్రాంతంలో అనుమానం కలిగిన వ్యక్తులు సంచరించిన అలాంటి వారి వివరాలను వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, తద్వారా నేరాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. సయ్యద్ అలీ ఛబుత్రాలోని పాత శాలిబండా పోలీస్టేషన్‌ను వేరే ప్రాంతానికి తరలించడంతో ఖాళీగా ఉన్న ఈ ప్రాంతంలో మొగల్‌పుర పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకుడు దినేష్ అంబారే నూతన ఇన్‌స్పెక్టర్‌ను కోరారు.

షాపుల కేటాయింపుల్లో అవకతవకలపై ఫిర్యాదు



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్ గౌడ్

గోషామహల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గం లోని జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రభుత్వ షాపుల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని.. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులైన వారికి షాపులను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు లిబర్టీలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్ రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అహ్మద్ బాయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బార్స్, వైన్స్ షాపులపైన వేధింపులు ఆపాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బార్స్, వైన్స్ షాపులపైన వే బిల్లులు చెల్లించాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు వేధిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ వైన్స్ షాపుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం నాంపల్లిలోని ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిసి తమకు జరుగుతున్న వేధింపులు, అన్యాయాలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, రామకృష్ణ, పి.రాఉ గౌడ్, సంజయ్ రాజు గౌడ్, వెంకటేశ్వర రావు, రామచంద్ర రెడ్డి, ప్రభు, సుభాష్, నరసింహా గౌడ్, సూరజ్, గోవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడిగా నర్సింగ్‌రావు

రాజేంద్రనగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షులుగా రాజేంద్రనగర్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన నర్సింగ్‌రావు నియమితులైనారు. ఆదివారం సాయంత్రం ఉప్పర్‌పల్లిలో సమావేశమైన దళిత నాయకులు, జయంతి ఉత్సవాల కమిటీ మాజీ కార్యవర్గ సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ప్రేమావతిపేట్‌కు చెందిన సూర్యం, కోశాధికారిగా బుద్వేల్‌కు చెందిన శ్రావణ్‌లు నియమితులైనారు. కార్యక్రమంలో దళితనాయకులు నర్సింహ్మామాదిగ, యాదయ్య మాదిగ, జయంతి ఉత్సవాల కమిటీ మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేశ్, శ్రీనివాస్, జాన్‌పాల్, జీవన్‌దాస్, రాజు, డాక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు

నేడు డాక్టర్ జి.చిన్నారెడ్డికి సన్మానం

రాజేంద్రనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అగ్రికల్చరల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉదయం 9:30 గంటలకు రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఐఐఆర్ఆర్)లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ జి.చిన్నారెడ్డికి సన్మానం చేయనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కృపాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొంటారన్నారు.

నేడు డాక్టర్ సీరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపర్డ్‌నెస్ నిర్మాణానికి శంకుస్థాపన

రాజేంద్రనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీహెచ్) ఆవరణలో డాక్టర్ సీరస్ పూనావాల్లా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీసెస్ అండ్ పాండమిక్ ప్రిపర్డ్‌నెస్ నిర్మాణానికి ఈ నెల 12న ఉదయం 10 గంటలకు భూమి పూజ చేయనున్నట్లు సంస్థ చైర్మన్ శ్రీనివాస సి రాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ మధుబాల, చీఫ్ మెంటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డిలు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శితో పాటు వైద్యశాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.

పరస్పర సహకారంతోనే మహిళాభివృద్ధి



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మహిళా దినోత్సవంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తదితరులు



మహిళా దినోత్సవంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం మహిళా అధికారులు

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న మహిళలకు తోటి మహిళలు సహకారం అందించి వారిని ఆదుకున్నప్పుడే మహిళాభివృద్ధి సాధ్యమవుతోందని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పిల్లల పోషణ సరిగా లేనప్పుడు తల్లిని తప్పు పడుతారే తప్పా.. తండ్రిని అనరని, మహిళలు ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలన్నారు. మహిళలకు సమాజంలో గౌరవం ఉందని, మహిళా సాధికారతకు జీహెచ్ఎంసీ నిదర్శనమన్నారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమా, ఇందిరా గాంధీ మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు చైతన్యవంతం కావాలని మేయర్ పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి మాట్లాడుతూ.. మహిళలు మగవారితో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. తొలుత మేయర్ విజయలక్ష్మి కేక్ కట్ చేశారు. అనంతరం 15 మంది శానిటేషన్ కార్మికులను సన్మానించి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, అడిషనల్ కమిషనర్ గీతామాధురి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, అడిషనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

రాజేంద్రనగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని వర్సిటీ పరిపాలనా భవనంలో జరిగిన నృత్య, నాటికలో ఏకపాత్రాభినయాలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ వార్షిక సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేయనున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ.. మహిళలు పరిపాలనా దక్షిత కలిగి ఉంటారన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో

అఫ్జల్‌గంజ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ శక్తి మహిళా మండలి, ప్రతిఘటన మహిళా శక్తి ఫౌండేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గన్‌ఫౌండ్రి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తి మహిళా మండలి అధ్యక్షురాలు కె.రాధిక, ప్రతిఘటన మహిళా శక్తి ఫౌండేషన్ అధ్యక్షులు శీలం సరస్వతీ, అనురాధ, సంతోషి, సుమలత, ఉమాదేవి, గాయత్రి, రమా, అనుష, అనిత, నాగలక్ష్మీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మలేషియా అంతర్జాతీయ శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మిరియాల జానికిరామ వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, వైజ్ఞానిక, విజ్ఞాన, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సేవా, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మార్చి 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని మే 10న మలేషియాలోని కౌలాలంపూర్‌లో పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగినవారు 9666910480 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాల్కం వినయ్ రాజ్

పాల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ లేదా ఎమ్మెల్సీ పదవులు కేటాయించాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 20 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తుల (దర్జీ)కు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా పురోగాభివృద్ధి సాధించాలంటే తమ జాతికి చెందిన పాల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవీని కేటాయించి న్యాయం చేయాలని మేరు యువజన సంఘం నాయకులు పాల్కం వినయ్ రాజ్, నర్సింహా, వై.శివ కుమార్, రఘురాం, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శంకర్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ రాజ్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ మేరు కులస్తులకు ఏ ఒక్క ఎమ్మెల్యే సీటు కేటాయించలేదని... ప్రస్తుతం రాజ్యసభలో కూడా ప్రాతినిధ్యం ఇవ్వలేదని.. కనీసం నామినేటెడ్ పదవుల్లో లేదా ఎమ్మెల్సీగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ పాల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ లేదా ఎమ్మెల్సీ కేటాయించాలని కోరారు.

14న పడమట సంధ్యారాగం యూనిట్‌కు అభినందన సత్కారం

రవీంద్రభారతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంస్థ అభినందన ఆధ్వర్యంలో ఈ నెల 14న రవీంద్రభారతి ప్రధాన వేదికపై వివిధ తెలుగు టీవీ చానల్స్, సీరియల్స్‌లోని నటీనటులతో పడమట సంధ్యారాగం సీరియల్ యూనిట్‌ను సత్కరించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు భవాని తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, బండారు సుబ్బారావు, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సభకు ముందు ప్రముఖ గాయకుడు డి.ఎ.మిత్ర నేతృత్వంలో సంగీత విభావరి నిర్వహించనున్నారు. అభినందన సంస్థ సభ్యులచే కోలాటం ప్రదర్శన ఉంటుందని భవాని తెలిపారు.




ఎల్‌బీ స్టేడియంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగసభ కోస జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్న రాంచంద్రారెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్గాయ్యల ప్రదీప్ కుమార్, కాశం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, ఎన్వీ సుభాష్, గౌతమ్‌రావు తదితరులు



జహీరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు, సూర్య శుక్లా, వెంకటేశ్ కులకర్ణి, ఆనంద్ మిశ్రా, రామేశ్వర్ మిశ్రా, మనోజ్‌ల బృందం సోమవారం ఆయనను కలిసి మర్యాదపూర్వకంగా బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

- గోషామహల్, మార్చి 11 ఆంధ్రజ్యోతి

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర



మాట్లాడుతున్న శ్రీధర్మపురి క్షేత్రం వ్యవస్థాపకురాలు సత్యవాణి

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని భారతీయం సంపాదకురాలు, శ్రీధర్మపురి క్షేత్రం వ్యవస్థాపకురాలు సత్యవాణి అన్నారు. మహిళలు చాలా శక్తిమంతులని, వారు ఓర్పు, నేర్పు, నిబద్ధతతో పనిచేస్తారని ఆమె పేర్కొన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన వేడుకలకు సత్యవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో, కుటుంబంలో స్త్రీయే ప్రధాన బిందువని, మన సంస్కృతి, సంప్రదాయం, చరిత్ర తదితర, విషయాలను చిన్నతనంలోనే అధ్యయనం చేయాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, తోటి మహిళలు ఆపదలో ఉన్నప్పుడు సాయం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యోగులు సత్యవాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్, డీఆర్ఓ వెంకటాచారి, డిప్యూటీ కలెక్టర్లు లావణ్య అపర్ణ, తహసీల్దార్లు, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జయప్రకాశ్ నారాయణ తదితరులు

కార్వాన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని మాజీ ఐఏఎస్, మాజీ ఎమ్మెల్యే లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ అన్నారు. సోమవారం నాడు మెహిదీపట్నం సెయింట్స్ ఆన్స్ మహిళా కళాశాలలో ఎండోమెంట్ లెక్చర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా జ్ఞాన సందపను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పుడు మరవవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అల్లం విజయరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓల బలోపేతం ద్వారా రైతులకు మేలు



మాట్లాడుతున్న నాబార్డ్ మహారాష్ట్ర ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ రష్మీ ఎ దరద్

రాజేంద్రనగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పట్టభద్రులకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా ఫార్మర్స్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లను బలోపేతం చేయడానికి నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) చేస్తున్న కృషి అభినందించదగినదిగా ఉందని నాబార్డ్ మహారాష్ట్ర ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ రష్మీ ఎ దరద్ అన్నారు. వ్యవసాయ పట్టభద్రులకు 50 రోజుల పాటు నార్మ్ ఎ-ఐడియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్ ద్వారా అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఏబీఎండీపీ)ను ప్రవేశపెట్టడం సంతోషకరమైన విషయమన్నారు. చాలా వరకు ఎఫ్‌పీఓలు ప్రారంభించి ఎలాంటి లాభాలు గడించక అయోమయ పరిస్థితులలో ఉన్నాయని, శిక్షణ పొందిన యువ బీఎస్సీ అగ్రికల్చర్ పట్టభద్రులు వచ్చాక ఆ ఎఫ్‌పీఓలు ఎంతో బలోపేతమై ఆర్థికంగా లాభపడతాయన్నారు. నార్మ్ డైరెక్టర్, ఎ-ఐడియా ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధికి ఎఫ్‌పీఓల కృషి అభినందనీయమన్నారు. అన్ని ఎఫ్‌పీఓల ద్వారా రైతులకు మేలు చేయడానికి యువ వ్యవసాయ పట్టభద్రులకు శిక్షణ ఇచ్చి వారికి ఎఫ్‌పీఓల బాధ్యతలను అప్పగించడం ద్వారా మరింత మేలు జరుగుతుందన్నారు. నార్మ్ ఎ-ఐడియా సీఈవో డాక్టర్ సెంథిల్ వినాయగమ్ మాట్లాడుతూ.. ఇటీవల రెండు బ్యాచ్‌ల ద్వారా 62 మంది యువ బీఎస్సీ పట్టభద్రులకు శిక్షణ ఇచ్చి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఎఫ్‌పీఓల బలోపేతానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నార్మ్, నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, సాహిత్య పోటీలు ప్రారంభం

రాజేంద్రనగర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను కనబరిచేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు వేదికగా నిలుస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ అన్నారు. రాజేంద్రనగర్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ అగ్రికల్చరల్ డాక్టర్ సీమ, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డీన్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ వి జయలక్ష్మీ వి.రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పార్వతీ హర్షిత్‌రావుకు సత్కారం



పార్వతీ హర్షిత్‌రావుకు గోల్డ్ మెడల్‌ను అందజేస్తున్న బాక్సర్స్, బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మనం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పొందగలమని చత్రినాక ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. బ్రదర్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పూల్‌బాగ్ చమాన్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో శివాజీ మహారాజ్ 394వ జయంతిని పురస్కరించుకొని బ్రదర్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన పార్వతీ హర్షిత్ రావు గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చత్రినాక ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్, తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.రాజ్‌నారాయణ్ ముదిరాజ్, ఇండియన్ కోచ్ దుర్గా ప్రసాద్‌లు గెలుపొందిన బాక్సర్లకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కోచ్ దుర్గా ప్రసాద్, బ్రదర్స్ బాక్సింగ్ క్లబ్ కోచ్, ప్రెసిడెంట్ ప్రతాప్ ప్రదీప్, జాతీయ బాక్సర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zdOaB8X లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: https://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.



గోవులతో ఉన్న లారీని పట్టుకున్న గో రక్షాదళ్ కార్యకర్తలు

ఆవులతో ఉన్న లారీని పట్టుకున్న గో రక్షా దళ్ కార్యకర్తలు

రాజేంద్రనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నుంచి బహదూర్‌పురా కమేళాకు టీఎస్12 యూడీ 6703 నెంబర్ డీసీఎంలో ఆవులను తీసుకువస్తున్నారనే సమాచారం అందుకున్న గో రక్షాదళ్ కార్యకర్తలు ఆదివారం అర్ధరాత్రి సమయంలో డీసీఎంను ఆపి ఆవులను పట్టుకుని స్థానిక గోశాలకు తరలించారు. రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ పాట్రిక్ ఫెలన్

ది వ్యాల్యూ ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ కార్యక్రమం

నార్సింగ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీజీసీ, యంజిఐటి, జీఈసీఎఫ్ ఆధ్వర్యంలో ది వాల్యు ఆఫ్ ఎనర్జీ ఎఫిసియన్సీ అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పాట్రిక్ ఫెలన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాట్రిక్ ఫెలన్ మాట్లాడుతూ.. ఇంధన సామర్థ్యం పెంపొందించే అంశాలను, ఇంధన పునరుత్పాదక వనరుల గూర్చి ఆయన క్లుప్తంగా వివరించారు. అమెరికాలోని అరిజోనస్టేట్ యూనివర్సిటీలో మెకానికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఇలాంటి ఎన్నో ప్రయోగాలను నిర్వహించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పరిశోధన అంశాలను విద్యార్థులు ఏకాగ్రతతో నేర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



గౌలిపురా డివిజన్‌లో రూ.43.50 లక్షల నిధులతో నిర్మించనున్న ఎస్‌డబ్ల్యూ డ్రైన్ పైపులైన్ పనులను సోమవారం గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ప్రారంభించారు

- చాంద్రాయణగుట్ట, ఆంధ్రజ్యోతి

శ్మశాన వాటికను నిర్మించండి

అఫ్జల్‌గంజ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలోని దర్జీమాత, గోశాల ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలంలో వైకుంఠధామం హిందూ శ్మశాన వాటికను నిర్మించడానికి తగుచర్యలు తీసుకోవాలని టీపీసీసీ కార్యదర్శి నిర్మల్ కుమార్ యాదవ్, గోషామహల్ నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ సతీష్‌కుమార్ గౌడ్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఆటోడ్రైవర్ అరెస్ట్

రాజేంద్రనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న ఓ ఆటోడ్రైవర్‌ను రాజేంద్రనగర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసారు. రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్‌నగర్ డివిజన్ ఎంఎం పహడీ, బాసిత్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ షకీల్(34) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతను ఆటోలో తిరుగుతు గంజాయి విక్రయిస్తున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాజేంద్రనగర్ జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి నేతృత్వంలో టీమ్‌సభ్యులు ఆదివారం సాయంత్రం పీడీపీ చౌరస్తా నుంచి ఉప్పర్‌పల్లి వెళ్లేమార్గంలో ఉన్న డీమార్ట్ సర్వీస్ రోడ్డులో తనిఖీలు చేయగా ఆటోలో 210 గ్రాముల గంజాయితో మహ్మద్ షకీల్ పట్టుబడ్డాడు. అతడి నుంచి గంజాయితో పాటు, బజాజ్‌ఆటో, ఒక స్మార్ట్‌ఫోన్, ఒక కీప్యాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణనిమిత్తం ఆ వ్యక్తిని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

రాజేంద్రనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భార్యా పిల్లలతో కలసి పుట్టింటికి వెళ్లిపోవడంతో మానసికంగా కృంగిపోయిన ఓ భర్త తన ఇంటి ముందు గేటుకు సోమవారం తెల్లవారు జామున తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శాస్త్రీపురం రిజ్వాన్ కాలనీకి చెందిన మహ్మద్ నజీర్(35)కు రెహెమా బేగంతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ప్లంబర్‌గా పనిచేసే నజీర్ తాగుడుకు బానిసై కొద్ది రోజులుగా పనులకు వెళ్లడం లేదు. దీంతో రెండు నెలల క్రితం రెహెమా బేగం పిల్లలను తీసుకుని బంజరాహిల్స్‌లో ఉండే తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో మానసికంగా కృంగిపోయిన మహ్మద్ నజీర్ సోమవారం తెల్లవారు జామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నజీర్ తల్లి తాహేరా బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న మైలార్‌దేవుపల్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఔటర్‌పై రెండు వాహనాలు ఢీ

● ఇద్దరికి గాయాలు

నార్సింగ్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగ్ వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మీయాపూర్‌కు చెందిన మహ్మద్ యూసూఫ్(50) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ప్యాసింజర్‌లను క్యాబ్‌లో తీసుకొని గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపుకు వెళ్తుండగా ఉదయం 6 గంటల ప్రాంతంలో బొలెరో వాహనం వీరిని ఢీకొట్టింది. దీంతో క్యాబ్ డ్రైవర్ మహ్మద్ యూసూఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. కారులో ప్రయాణిస్తున్న ప్యాసింజర్ అనిల్ కూడా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న నార్సింగ్ పోలీసులు గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సికింద్రాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తితే సత్వరమే తన దృష్టికి తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో సోమవారం జిల్లాలోని అన్ని మండలాల ఉప విద్యాశాఖ అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లు, రూట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి వచ్చే నెల 2 వరకు జరిగే పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు, పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ప్రహరీలు లేని పరీక్ష కేంద్రాల్లో పోలీసు సిబ్బందిని తరచూ తనిఖీలు చేపట్టేలా చూడాలన్నారు. సమావేశంలో డీఈవో రోహిణి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు చిరంజీవి, వెంకటేశ్వర్లు, బాలూనాయక్, విజయలక్ష్మి, నెహ్రూబాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై దృష్టి

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై పోలీసులు దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్, ఇతర రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సిటీ పరిధిలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలు, వాటిలో సమస్యాత్మకమైన ప్రాంతాలు, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పోలీస్ భద్రత తదితర అంశాలపై చర్చించారు.

మీర్‌పేట మేయర్‌పై వీగిన అవిశ్వాసం

- ముఖం చాటేసిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- మాటిచ్చి వెనక్కి తగ్గిన ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు
- సమావేశానికి 'కోరం' కరువు

సరూర్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మేయర్ దుర్గాదీప్‌లాల్‌పై 31మంది కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నాటకీయ పరిణామాల మధ్య వీగి పోయింది. కలెక్టర్‌కు అందజేసిన అవిశ్వాస లేఖపై సంతకాలు చేసిన బీఆర్ఎస్ అసంతృప్త సభ్యుల్లో ఇద్దరు సభ్యులు ముఖం చాటేయగా.. లేఖపై సంతకం పెట్టకపోయినా అవిశ్వాసానికి మద్దతు ఇస్తానంటూ నమ్మబలికిన మరో బీఆర్ఎస్ సభ్యుడు సైతం గైర్హాజరు కావడంతో అవిశ్వాసానికి అవసరమైన బలం తగ్గిపోయింది. మరోవైపు ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు కూడా చివరి నిమిషంలో దుమ్మా కొట్టడంతో సమావేశానికి సరిపడా కోరం లేక అవిశ్వాసం వీగిపోయినట్టు అధికారులు ప్రకటించారు.

కాంగ్రెస్ డబుల్ గేమ్..!

వాస్తవానికి మేయర్‌పై అవిశ్వాసం పెట్టిన వారిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎనిమిది మంది సభ్యులతో పాటు 14మంది బీజేపీ కార్పొరేటర్లు, మరో తొమ్మిది మంది బీఆర్ఎస్ అసంతృప్త కార్పొరేటర్లు కీలకంగా వ్యవహరించారు. వీరంతా కలిసి మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ గత నెల 22వ తేదీన రంగారెడ్డి కలెక్టర్‌కు లేఖ అందజేశారు. దీనిపై సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఉదయం 11 గంటలకు సమావేశం ఉండగా అప్పటి వరకు ఒక్కరు కూడా కార్యాలయానికి రాలేదు. దాంతో 11.30 గంటల వరకు వేచి చూసిన ప్రిసైడింగ్ అధికారి సూరజ్‌కుమార్ మరో అరగంట (మధ్యాహ్నం 12.30గంటల వరకు) సమయం ఇస్తూ నోటీసు జారీ చేశారు. కాగా అప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో క్యాంపుల్లో ఉన్న ఆయా పార్టీల సభ్యులు మధ్యాహ్నం 12.20గంటలకు మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. 31 మందికి బదులుగా 29మంది కార్పొరేటర్లు మాత్రమే కార్యాలయంలోని సమావేశ మందిరంలోకి వెళ్లారు. సరిగ్గా 12.30 గంటలు కాగానే అధికారులు మెయిన్ గేట్‌కు తాళం వేయించారు.

కోరం లేక.

31మంది హాజరైతేనే కోరమ్ ఉన్నట్టుగా పరిగణించి సమావేశం నిర్వహిస్తారు. అయితే సోమవారంనాటి సమావేశానికి కేవలం 29మంది కార్పొరేటర్లు మాత్రమే రావడంతో 'కోరం' లేదని భావించిన అధికారులు సమావేశం నిర్వహించకుండానే అవిశ్వాసం వీగిపోయినట్టు ప్రకటించారు.

డబ్బుకు బదులుగా గోల్డ్ చైన్..

సమావేశానికి హాజరైన ఓ మహిళా సభ్యురాలు 'కమిట్‌మెంట్' ప్రకారం డబ్బు ముట్టలేదంటూ అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. దాంతో పక్కనే ఉన్న మరో మహిళా సభ్యురాలు డబ్బుకు బదులుగా తన బంగారు నల్లపూసల తాడు తీసుకొమ్మంటూ మెడలో నుంచి తీసి ఆమె చేతిలో పెట్టడం గమనార్హం! అవిశ్వాసానికి మద్ధతు ఇస్తామంటూ తన వద్ద డబ్బు తీసుకున్న ముగ్గురు బీఆర్ఎస్ సభ్యులు తనను మోసం చేశారని మేయర్ రేసులో ఉన్న బీజేపీ కార్పొరేటర్ నీలారవినాయక్ ఆరోపించారు. చివరి నిమిషంలో అవతలి క్యాంపులోకి వెళ్లి దుమ్మా కొట్టారని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా.. డబ్బు తీసుకుని మోసం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఇళ్ల వద్ద సోమవారం సాయంత్రం మీర్‌పేట్ పోలీసులు రక్షణ ఏర్పాటు చేశారు.

పట్నం, తీగల చెప్పినా మెట్టు దిగని 'చల్లా'

మీర్‌పేట్ మేయర్‌పై అవిశ్వాసం అంశంలో ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల మద్ధతు కీలకంగా మారడంతో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వారిని ఒప్పించడానికి శతవిధాలా ప్రయత్నించారు. ఈ క్రమంలో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో సుదీర్ఘ చర్చలు జరిపినప్పటికీ ఆయన మెట్టు దిగకుండా మద్ధతు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అవిశ్వాసం కాస్తా ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు, ముగ్గురు బీఆర్ఎస్ అసంతృప్త సభ్యుల వెనకడుగు వల్ల వీగిపోయినట్టయింది.

రెజిమెంటల్‌బజారులో కిడ్నాప్ కలకలం

- పారిపోతున్న మహిళకు బస్తీవాసుల దేహశుద్ధి

అడ్డగుట్ట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులో సోమవారం కిడ్నాప్ కలకలం రేగింది. ఓ బాలికను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఇద్దరు మహిళల్లో ఒకరిని పట్టుకుని బస్తీవాసులు దేహశుద్ధి చేశారు. అనంతరం ఆమెను గోపాలపురం పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులోని బస్తీలో ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో బస్తీవాసులు అనుమానించారు. ఈ క్రమంలో ఏడేళ్ల బాలికను కిడ్నాప్ చేసేందుకు మహిళలు యత్నించడంతో స్థానికులు వారిని వెంబడించారు. పారిపోయేందుకు ప్రయత్నించగా ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ సురేష్, పోలీసు సిబ్బందికి మహిళను అప్పగించారు. అయితే, మహిళ తన పేరు చెప్పడానికి నిరాకరించడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరారీలో ఉన్న మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇదిలా ఉండగా, పిల్లలను కిడ్నాప్ చేసేందుకు రెజిమెంటల్ బజార్‌బస్తీలో ఇద్దరు మహిళలు తిరుగుతున్నారని, అప్రమత్తంగా ఉండాలంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.



మాట్లాడుతున్న వైష్ణవి క్యాటరర్స్ అధినేత వైష్ణవి ప్రసాద్

వైష్ణవి ప్రసాద్‌కు బ్రాహ్మణ సంఘాల మద్దతు

కొత్త పేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న వైష్ణవి క్యాటరర్స్ అధినేత వైష్ణవి ప్రసాద్‌కు బ్రాహ్మణ సంఘాలు మద్దతు తెలిపాయి. కొత్తపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం దుడ్డు సుబ్రమణ్యం అధ్యక్షతన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీచేస్తున్న వైష్ణవి ప్రసాద్‌కు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు మద్దుతు పలికారు. అనంతరం వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ పార్లమెంట్ స్థానంలో బ్రాహ్మణుల ఓట్లు కీలక పాత్ర పోషిస్తాయని, తన విజయానికి అందరూ సహకరించాలని కోరారు. సమ్మేళనంలో బ్రాహ్మణ సంఘాల పెద్దలు తులసీ శ్రీనివాస్, జగన్‌మోహనశర్మ, బసవరాజు శ్రీనివాస్, వారణాసి వంశీ, వక్కలంక శ్రీనివాస్, మునిపల్లె శ్రీనివాస్, మంగపతి రావు, దర్శనం శర్మ, కల్పవల్లీ, అనురాధ, భవానీ, శ్రీదేవి పాల్గొన్నారు.

దుకాణాల కేటాయింపులో అక్రమాలు

- విచారణ జరపాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు ● గ్రేటర్ వ్యాప్తంగా 334 ఫిర్యాదులు



అధికారులకు ఫిర్యాదు చేస్తోన్న ఆనంద్‌కుమార్

హైదరాబాద్‌సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కోఠిలోని జీహెచ్ఎంసీ దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బాధితుడు ఆనంద్‌కుమార్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. గతనెల 12న కోఠిలోని జీహెచ్ఎంసీ వాణిజ్య సముదాయంలో దుకాణాల కేటాయింపు జరిగిందని, ఒక్కో దుకాణానికి రూ.60వేల నుంచి రూ.70వేల డిమాండ్ ఉంటే.. తక్కువ రేట్లకు ఎస్టేట్ విభాగంలోని అధికారులు పాత లీజుదారులకు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ విషయంపై సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అదనపు కమిషనర్ రాధికకు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయల ఆదాయం రావాల్సి ఉన్నా.. అధికారుల అవినీతితో జీహెచ్ఎంసీకి ఆర్థికంగా తీవ్రనష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. దుకాణాల కేటాయింపు టెండర్లు రద్దు చేసి.. మళ్లీ బిడ్‌లు ఆహ్వానించాలని ఆయన కోరారు. ప్రధాన కార్యాలయంలో రికార్డు స్థాయిలో 257 ఫిర్యాదులు వచ్చాయి. సర్కిల్, జోనల్ కార్యాలయాలతో కలిపి మొత్తం 334 ఫిర్యాదులు వచ్చినట్టు అధికారులు ప్రకటించారు.

కలెక్టరేట్‌లో 132 దరఖాస్తులు..

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 132 మంది దరఖాస్తు అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ కదిరవన్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్



రాధాకృష్ణ

చంపాపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ సంఘటన చంపాపేట వార్డు కార్యాలయంలో చోటు చేసుకుంది. నాంపల్లి ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ కథనం ప్రకారం లింగోజిగూడ డివిజన్ జనప్రియకు చెందిన తోటపల్లి శ్రీధర్ తన ప్లాటు మ్యుటేషన్ (పేరు మార్పిడి) చేసేందుకు జీహెచ్ఎంసీ ఎల్‌బీ నగర్ సర్కిల్-4ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ యం.రాధాకృష్ణను ఆశ్రయించాడు. ప్లాటు మ్యుటేషన్ చేసేందుకు నేరుగా ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయానికి వెళితే రూ.20 వేలు ఖర్చు అవుతుందని, తన ద్వారా చేయించుకుంటే రూ.8 వేలలో చేస్తానని రాధాకృష్ణ చెప్పాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. డబ్బులు తీసుకుని మొదట ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయానికి రావాలని, ఆ తర్వాత చంపాపేట వార్డు కార్యాలయంలో కలవాలని రాధాకృష్ణ సూచించాడు. సోమవారం మధ్యాహ్నం 1:45 గంటల ప్రాంతంలో చంపాపేట వార్డు కార్యాలయానికి వెళ్లాడు. శ్రీధర్ నుంచి రూ.8వేలు లంచంగా తీసుకుంటుండగా రాధాకృష్ణను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

ముగిసిన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

కీసర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కీసరగుట్టపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆరు రోజులపాటు పలు వైదిక కార్యక్రమాలు, పూజలు నిర్వహించి క్షేత్రదిగ్బలి చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాలల్లో కీసరగుట్టలోని వేద పాఠశాల పండితుడు గణపతి శర్మ, విద్యార్థులకు ఆలయ నిర్వాహకులు పండిత సన్మానం చేశారు.

ఉస్మానియాలో కాలేయ మార్పిడులు



కాలేయమార్పిడి జరిగిన బాలికలతో వైద్యులు

అఫ్జల్‌గంజ్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. వారిద్దరూ కోలుకున్న తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. హన్మకొండ జిల్లా, కమలాపూర్ మండలం అంబాలకు చెందిన దినసరి కూలీ మట్ల రాజు కుమార్తె 15 ఏళ్ల బాలిక సింధూజ విల్సన్స్ వ్యాధి (లివర్‌లో రాగి ఎక్కువగా పేరుకుపోయే జన్యుపరమైన రుగ్మత) కారణంగా దీర్ఘకాలిక కాలేయ వైఫల్యంతో బాధపడుతోంది. బ్రెయిన్ డెడ్ అయిన దాత నుంచి సింధూజకు క్యాడవర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ చేశారు. అదేవిధంగా యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు రాచ స్రవంతి కుమార్తె మెరుగు వైష్ణవి (13) ఆటో ఇమ్యూన్ కాలేయ వ్యాధి కారణంగా బాధపడుతోంది. బ్రెయిన్ డెడ్ అయిన 11 ఏళ్ల చిన్నారి కాలేయ దానం ద్వారా వైష్ణవికి ఉస్మానియాలో కాలేయ మార్పిడి చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండ్ డా. బి. నాగేందర్ అన్ని విభాగాల వైద్యులు, ప్రధానంగా టీమ్ లీడర్లు డాక్టర్లు మధుసూదన్, పాండునాయక్, పావని, మాధవి, అనస్తీషియా విభాగం ప్రొఫెసర్లను, పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ అధికారుల బృందాలను అభినందించారు.

మహిళల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి తదితరులు

పద్మారావునగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపు నిచ్చారు. గాంధీ ఆస్పత్రి నర్సింగ్ కళాశాలకు అనుబంధంగా పనిచేస్తున్న బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయిగుడాలోని జాతీయ మిడ్ వైఫరీ శిక్షణా కేంద్రాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ తల్లీబిడ్డ క్షేమంతో పాటు సిజేరియన్ ప్రసవాలను తగ్గించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ఇందుకు మిడ్ వైఫరీ కేంద్రాల ద్వారా నిష్ణాతులైన వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ను అందిస్తున్నామని తెలిపారు. సమీప భవిష్యత్తులో యూనిసెఫ్ సహకారంతో రాష్ట్రంలో మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి అన్నారు. మిడ్ వైఫరీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 285 మందికి సర్టిఫికేట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ కుర్మ హేమలత, ఫామిలీ హెల్త్ కమిషనర్ ఆర్.వి.కర్నన్(ఐఏఎస్), డీఎంఈ డాక్టర్.వాణి, ఎస్ఈ డాక్టర్.డి.సురేందర్ రెడ్డి, డాక్టర్.దేవేందర్ నాయక్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్.ఎస్.పద్మజ(ఎం.హెచ్.ఎన్), డీఎంహెచ్ఓ డాక్టర్. వెంకట్, ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ సక్కుబాయి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యులత, నర్సింగ్ విద్యార్థులు హాజరయ్యారు.

గోల్డెన్పీ కాక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రామేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాకు గోల్డెన్పీ కాక్ అవార్డు లభించింది. ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఏటా నిర్వహించే గోల్డెన్పీ కాక్ అవార్డు హైదరాబాద్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాకు దక్కడంపై కాలేజీ డైరెక్టర్ రామేశ్వర్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

గోవాకు వెళుతుండగా..

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం : ఒకరి మృతి

రాజేంద్రనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. బోరబండ, మోతీనగర్‌కు చెందిన స్నేహితులు బండారి అనిల్‌కుమార్ (27), సురేశ్‌యాదవ్ (28), బి.నాగరాజు (30), కిరణ్‌కుమార్ (28), బి.పాండు (27) గోవా వెళ్లేందుకు ఆదివారం అర్ధరాత్రి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో హిమాయత్‌సాగర్ వద్ద కారులో శబ్దం రావడంతో ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన ఆపారు. అనిల్‌కుమార్ (27) మూత్రవిసర్జన కోసం కారు దిగగా మిగిలిన వారు పక్కన నిలబడ్డారు. అదే సమయంలో గచ్చిబౌలి వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ అనిల్‌కుమార్‌తోపాటు నలుగురిని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అనిల్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. అనిల్‌కుమార్ సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంటే లేదు..

(5వ పేజీ తరువాయి)

వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం విద్యాసంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఇళ్లలోకి వెళ్తామని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. స్పష్టమైన సమాచారమిస్తే.. కేటాయించిన ఇళ్ల సమీపంలోని పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకుంటామని చెబుతున్నారు. దీంతో అధికారులు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇతర పనులు పూర్తయినా.. విద్యుత్ సరఫరా ఎప్పుడు అందుతుందో చెప్పలేకపోతున్నామని జీహెచ్ఎంసీ ఇంజనీర్ ఒకరు చెప్పారు.

పెండింగ్ ఇళ్లు.. రూ.3 వేల కోట్లు..

లక్ష ఇళ్లలో ఇప్పటి వరకు పూర్తయిన 68 వేల ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. 27 వేలకుపైగా ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిధుల కొరతతో దాదాపు ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. రూ.350 కోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేసేందుకు నిర్మాణదారులు ముందుకు రావడం లేదు. ఒప్పందం చేసుకున్న సమయంతో పోలిస్తే కూలీ, స్టీల్, ఇతరత్రా ధరలు పెరిగిన నేపథ్యంలో తదనుగుణంగా ప్రైస్ ఎస్కలేషన్ ఇవ్వాలన్నది వారి డిమాండ్. గతంలోనే స్టీల్‌కు రూ.500 కోట్లు అదనంగా ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టు పనులు దాదాపు ఎనిమిదేళ్లు నడిచాయి. దీంతో అంచనా వ్యయం 30-40 శాతం పెరిగింది. పురోగతిలో ఉన్న ఇళ్లు పూర్తి చేసేందుకు రూ.3వేల కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెబుతోన్న ప్రస్తుత సర్కారు.. డబుల్ ఇళ్ల విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది తేలాల్సి ఉంది. రెండు పడకల ఇళ్లపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో తెలిపారు.

'మహా' ఆఫీస్ @ పైగా ప్యాలెస్

(5వ పేజీ తరువాయి)

ప్యాలెస్ ఖాళీగా ఉన్నది. శతాబ్దకాలమైనా ప్యాలెస్ కళ ఏమాత్రమూ చెదరలేదు. ఈ భవనాన్ని హెచ్ఎండీఏ వారసత్వకట్టడంగా కూడా గుర్తించింది. కాగా, అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని రెండు, మూడు, నాలుగు, ఐదు, ఏడు అంతస్తుల్లో ప్రస్తుతం హెచ్ఎండీఏ కార్యాలయం కొనసాగుతున్నది. ఖాళీ చేసిన తర్వాత ఆ అంతస్తులను ఆఫీసు లీజుకివ్వడం వల్ల నెలకు కోటి రూపాయల పైగా ఆదాయం రావడానికి అవకాశాలున్నాయి.

హుస్సేన్‌సాగర్ అలలపై అద్భుత లేజర్ షో

(5వ పేజీ తరువాయి)

అండ్ లైట్ షో ఏర్పాటు చేయడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి. ఈ లైట్ అండ్ సౌండ్ షోలో.. ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన 'కోహినూర్' వజ్రం గురించిన కథ కూడా ఉంటుంది. తెలంగాణ భూముల్లోనే కోహినూర్ వజ్రం లభించిన సంగతి తెలిసిందే. తెలంగాణ నుంచి మొదలైన కోహినూర్ కథ.. భిన్న సంస్కృతులు, వివిధ ఖండాలను దాటి చేసి ప్రయాణాన్ని వాటర్ స్క్రీన్‌పై రంగుల రంగుల లేజర్ వెలుతురులో వివరించనున్నారు. ఈ కథను ఎంపీ, సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో.. ప్రముఖ రచయిత ఎస్ఎస్ కంచి రాశారు. సినీ నేపథ్య గాయని సునీత గాత్రాన్ని అందించగా.. ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని అందించారు. కోహినూర్ కథతో పాటుగా.. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, దేశ స్వాతంత్ర్య సంగ్రామం వంటి ఘట్టాలను కూడా అందమైన లైటింగ్ ప్రొజెక్షన్ ద్వారా పర్యాటకులను ఆకట్టుకునేలా వివరిస్తారు. తెలంగాణ కథ, సంస్కృతి, దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ షోను రూపొందించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కార్యాలయ వర్గాలు వివరించాయి. ఇక ఈ లేజర్ షోకు వచ్చే పర్యాటకులకు సరైన సూచికలు, 800 నుంచి 1,000 మంది కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లున్నాయి. ఇందుకోసం అన్ని వసతులతో కూడిన గ్యాలరీని కూడా సిద్ధం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొననున్నారు.


ప్రాజెక్టు ప్రత్యేకతలివే..

రొబోటిక్ నాజిల్స్, లైటింగ్: వెయ్యికి పైగా రొబోటిక్ నాజిల్స్, డీఎంఎక్స్ ప్రొటోకాల్‌తో కూడిన అడ్వాన్స్‌డ్ అండర్ వాటర్ లైటింగ్ సిస్టమ్స్ ద్వారా అద్భుతమైన రంగురంగుల లైట్లు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఈ లేజర్ రంగుల కోసం.. మూడు 40 డబ్ల్యూ ఆర్‌జీబీ లేజర్స్‌ను ఏర్పాటు చేశారు.

గ్యాలరీ, రూఫ్‌టాప్ రెస్టారెంట్: 800 నుంచి 1,000 మంది కూర్చునేలా సీటింగ్ గ్యాలరీ, మల్టీమీడియా షో వీక్షించేందుకు పనోరమిక్ వ్యూ కోసం రూఫ్ టాప్ రెస్టారెంట్‌ను సిద్ధం చేశారు.

హెచ్‌డీ ప్రొజెక్షన్: ఒక్కొక్కటి 34 వేల ల్యుమెన్స్ సామర్థ్యం గల 3 హెచ్‌డీ ప్రొజెక్టర్స్ ద్వారా.. వాటర్ స్క్రీన్‌పై స్పష్టమైన, ఆకర్షణీయ ప్రొజెక్షన్ ఉండేలా ఏర్పాట్లున్నాయి. బీమ్ మూవింగ్ హెడ్‌లైట్స్ ద్వారా.. విజువల్ ఎఫెక్ట్ అందంగా ఉండనుంది.


రికార్డ్-బ్రేకింగ్ వాటర్ ఫౌంటెయిన్: 260 అడుగుల ఎత్తు, 540x130 డైమెన్షన్‌తో దేశంలోనే అతి పెద్ద, అతి ఎత్తయిన వాటర్ ఫౌంటేన్‌ను ఈ ప్రాజెక్టులో వినియోగిస్తున్నారు.



ప్రపంచవ్యాప్తంగా ప్రతి వంద మందిలో పది మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇందుకు కారణం మూత్రపిండాల వ్యాధుల పట్ల తగినంత అవగాహన లేకపోవడమే! కాబట్టి మూత్రపిండాల సంరక్షణ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం అవసరం.

కిడ్నీలు కీలకం

కిడ్నీలు రక్తాన్ని వడగట్టి, వ్యర్థాలను శరీరం నుంచి తొలగిస్తాయనే విషయం అందరికీ తెలిసిందే! ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసే హార్మోన్లు, ఎముకల పెరుగుదలకు ఉపయోగపడే డి విటమిన్ తయారీపరంగా కిడ్నీలు తోడ్పడతాయి. రక్తపోటును నియంత్రణలో ఉంచుతూ గుండె సక్రమ పనితీరుకు సహాయపడతాయి. అలాగే శరీరంలోని, క్యాల్షియం, పొటాషియం మొదలైన పోషకాల నియంత్రణలో కూడా సహాయపడతాయి.



లక్షణాలు ఇవే!

- నురగతో కూడిన మూత్రం
- తరచూ లేదా ఆగి ఆగి మూత్రవిసర్జన చేయడం
- మూత్రంలో రక్తం
- ఆకలి మందగించడం, వికారం, వాంతులు
- త్వరగా అలసిపోవడం
- చర్మం పొడిబారి, దురదగా ఉండడం

కిడ్నీలు దెబ్బతినే అవకాశాలు ఇవే!

- మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బుల సమస్యలు ఉన్నవాళ్లలో మూత్రపిండాల సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ.
- ఊబకాయులు, అరవై ఏళ్లు పైబడినవాళ్లు, ధూమపానం అలవాటు ఉన్నవాళ్లకు కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఎక్కువ
- దీర్ఘకాలం పాటు పెయిన్ కిల్లర్స్, ఇన్సులిన్ వాడేవాళ్లకు కూడా ముప్పు పొంచి ఉంటుంది.
- కిడ్నీలో రాళ్లు, దీర్ఘకాలిక మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు మూత్రపిండాల వ్యాధికి దారి తీస్తాయి

కిడ్నీ వ్యాధి నిర్ధారణ ఇలా...

మూత్రపిండాల వ్యాధిని ముందుగానే కనిపెట్టడం కోసం క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రం కాకుండా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. మూత్రపిండాల వ్యాధిని నిర్ధారించే పరీక్షల ఖర్చు తక్కువే! రెండు పరీక్షలతో వ్యాధిని నిర్ధారించుకోవచ్చు.

- మూత్రంలో ప్రొటీన్‌ను పసిగట్టే పరీక్ష ప్రధానమైనది. మూత్రంలో తక్కువ ప్రొటీన్ పోవడం మూత్రపిండ వ్యాధికి సంకేతం. యూరిన్ ఆల్బ్యుమిన్ క్రియాటినిన్ రేషియో పరీక్ష ద్వారా కిడ్నీ సమస్యను కనిపెట్టవచ్చు.
- కిడ్నీలో రక్తం ఏ మేరకు శుద్ధి అవుతుందో తెలిపే పరీక్ష జీఎఫ్ఆర్ పరీక్ష. ఈ పరీక్షతో కిడ్నీ పనితీరు తెలుస్తుంది. ఈ రెండు పరీక్షల్లో అవకతవకలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.

కిడ్నీ కేర్

- మధుమేహం, అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి.
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను, మూత్ర వ్యవస్థలో సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.
- తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో కూడిన సంతులన ఆహారం తీసుకోవాలి.
- క్రమం తప్పక వ్యాయామం చేయడంతో పాటు, సరిపడా విశ్రాంతి తీసుకోవాలి
- మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి.

ఇవి కూడదు

- మరీ ముఖ్యంగా అధిక రక్తపోటు ఉన్నవాళ్లు ఉప్పును పరిమితంగా వాడుకోవాలి.
- ధూమపానం కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యను పెంచుతుంది. కాబట్టి ఈ అలవాటు మానుకోవాలి
- వైద్యులు సూచించకపోయినా పెయిన్ కిల్లర్స్ వాడుకోకూడదు
- ఆరోగ్యానికి హాని చేసే పసరు మందులు వాడకూడదు
- తరచూ అధిక ప్రొటీన్‌తో కూడిన రెడ్ మీట్, ప్రాసెస్డ్ ఫుడ్ తినకూడదు

డయాలసిస్ - కిడ్నీ మార్పిడి

కిడ్నీ వ్యాధి ఉన్న ప్రతి ఒక్కరికీ డయాలసిస్ అవసరం ఉండదు. వ్యాధి ప్రారంభ దశలో సమర్థమైన చికిత్స, వ్యాయామం, ఆహారంతో వ్యాధి ముదరకుండా, అదుపులోకి తెచ్చుకోవచ్చు. క్రియాటినిన్ పెరుగుదలను మందులతో అరికట్టవచ్చు. వ్యాధి తీవ్రత పెరిగి కిడ్నీలు పూర్తిగా పని చేయడం మానేసినప్పుడు మాత్రమే డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమవుతుంది. సరైన జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించగలిగితే, డయాలసిస్‌తో సగటు ఆయుర్దాయం 15 నుంచి 20 సంవత్సరాల వరకూ పెరిగిన దాఖలాలు ఉన్నాయి. అయితే మూత్రపిండాల వ్యాధికి డయాలసిస్ నివారణ కాదు. మూత్రపిండాల మార్పిడి చేసుకునేవరకూ డయాలసిస్ మీద ఆధారపడక తప్పదు. అయితే కిడ్నీ మార్పిడి క్లిష్టమైన వ్యవహారం. సరైన డోనార్ దొరికే వరకూ ఎదురుచూడవలసి ఉంటుంది. కాబట్టి మూత్రపిండాలు వ్యాధులకు గురి కాకుండా కాపాడుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకుంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. మధుమేహులు, అధిక రక్తపోటు ఉన్నవారు, 50 ఏళ్లు పైబడినవాళ్లు, గుండె జబ్బులు ఉన్నవాళ్లు, ఊబకాయులు క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి.

డాక్టర్ హిమదీప్తి ఆళ్ల
నెఫ్రాలజిస్ట్ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్,
ఎఐజి హాస్పిటల్స్, గచ్చిబౌలి, హైదరాబాద్.

షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కొంతమంది తటపటాయిస్తూ ఉంటారు. లేదంటే చేతులు తుడుచుకుని ఆ తర్వాతే షేక్ హ్యాండ్ ఇస్తూ ఉంటారు. విపరీతంగా చమట పడుతూ చేతులు తడిగా ఉండడమే ఇందుకు కారణం. అర చేతులు, పాదాలు, బాహుమూలలు, ముఖం, తల... ఈ ప్రదేశాల్లో విపరీతంగా చమట పట్టే పరిస్థితి 'హైపర్ హైడ్రోసిస్'. దీన్ని చిన్నపాటి సర్జరీతో సరిదిద్దవచ్చు అంటున్నారు వైద్యులు.



హైపర్ హైడ్రోసిస్

చమటలో తడిచిపోతున్నారా?

సింపథెక్టమీతో...

ఇది ఒక్క గంటలో పూర్తయ్యే తేలికపాటి సర్జరీ. ఉదయం సర్జరీ చేయించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోవచ్చు. పక్కటెముకల దగ్గర ఐదు మిల్లీమీటర్ల రంధ్రాలు చేసి కెమెరా సహాయంతో సదరు ప్రాంతంలో చమట పట్టడానికి కారణమైన నాడికి క్లిప్ వేయడం జరుగుతుంది. ముఖం, తల, చేతులు, పాదాల్లో చమటను నియంత్రించడానికి వెన్నులో రెండవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, అరచేతులు, పాదాలు, బాహుమూలల్లో చమటను నియంత్రించడం కోసం మూడవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, అరచేతులు, పాదాల్లో చమట నియంత్రణ కోసం నాల్గవ పక్కటెముక దగ్గరున్న నరానికీ, కేవలం పాదాల్లో చమటను నియంత్రించడం కోసం ఐదవ పక్కటెముక దగ్గరున్న నరానికీ క్లిప్ వేయవలసి ఉంటుంది. సర్జరీ తర్వాత కొందరికి అరచేతులు బాగా పొడిబారిపోవచ్చు, కానీ పాదాల్లో చమట కొంత మేరకు కనిపిస్తూ ఉండవచ్చు. పాదాల్లో చమటను నియంత్రించడానికి నరానికి బలంగా క్లిప్ వేస్తే, వాళ్లకు వెన్నులో ఎక్కువగా చమట పట్టే పరిస్థితి మొదలవుతుంది. కాబట్టి వైద్యులు చేతుల్లో చమటను తగ్గించడమే ప్రధానంగా సర్జరీ చేస్తారు.



మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్... ఈ సమస్యలున్న కొందర్లో చమట ఎక్కువగా పడుతూ ఉంటుంది. ఈ సమస్యలేవీ లేని కొందర్లో, అకారణంగా విపరీతంగా చమట పట్టే పరిస్థితి ఉంటుంది. ఆ చమట చుక్కలుగా కారేటంత తీవ్రంగా ఉంటుంది. వాతావరణంలో స్వల్ప మార్పు చోటు చేసుకున్నా, ఆందోళన, ఒత్తిడులకు గురైనా కొందరికి విపరీతంగా చమట పడుతూ ఉంటుంది. ఈ పరిస్థితి ఏకంగా ఒకటి నుంచి రెండు గంటల పాటు కొనసాగుతూ ఉంటుంది. 20 నుంచి 30 ఏళ్ల వయస్కులు ఎదుర్కొనే ఈ సమస్య ప్రమాదకరమైనది కాకపోయినా, దైనందిన జీవితాన్ని ఇబ్బంది పెడుతూ ఉంటుంది. నడుస్తున్న బస్సెక్కబోతూ చమట పట్టిన చేతి నుంచి హ్యాండిల్ జారిపోయి కిందపడిపోతూ ఉంటారు. పరీక్ష రాసేటప్పుడు అరచేతుల్లో అధిక చమట వల్ల ఆన్సర్ పేపర్ తడిచిపోయే పరిస్థితి వస్తూ ఉంటుంది. ఐటి ఉద్యోగులు ఉద్యోగరీత్యా ప్రెజెంటేషన్ సమయంలో అందరికీ షేక్ హ్యాండ్ ఇవ్వవలసి వస్తూ ఉంటుంది. కానీ అరచేతుల్లో చమట కారణంగా షేక్‌హ్యాండ్ ఇవ్వలేక, ఉద్యోగమే పోగొట్టుకునే పరిస్థితిని ఎదుర్కొనే వాళ్లూ ఉంటారు.

హైపర్ హైడ్రోసిస్

అధిక చమటకు మూలకారణాన్ని కనిపెట్టడం ముఖ్యం. అధిక రక్తపోటు, థైరాయిడ్, మధుమేహం కారణమైతే, వాటిని మందులతో అదుపులో పెట్టుకుంటే సమస్య సర్దుకుంటుంది. ఇవేవీ కారణం కానప్పుడు, హైపర్ హైడ్రోసిస్‌గా నిర్ధారించుకోవాలి. కొందరికి అర చేతుల్లో (పామర్), ఇంకొందరికి పాదాల్లో (ప్లాంటార్), మరికొందరికి బాహుమూలల్లో (యాక్సిలరీ), ఇంకొందరికి ముఖం, తలలో (క్రేనియో ఫేసియల్) విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది. అరుదుగా కొందరికి ఈ నాలుగు ప్రదేశాల్లో విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది. ఈ పరిస్థితికి కారణమైన నాడులు పక్కటెముకల దగ్గర ఉంటాయి. చిన్నపాటి సర్జరీతో వాటి పనితీరును నియంత్రించడం ద్వారా అధిక చమట సమస్యను సరిదిద్దవచ్చు.

ప్రధాన దుష్ప్రభావాలు

సర్జరీతో అరచేతుల్లో చమటను ఆపేసినప్పుడు, తొడ వెనక ఎక్కువగా చమట పట్టే అవకాశాలు కొందర్లో ఉంటాయి. సర్జరీ తర్వాత కొందర్లో నెల వరకూ అధిక చమట కొనసాగి, క్రమేపీ తగ్గిపోవచ్చు. అలాగే అధిక చమటకు ఆస్కారం ఉండే ఆందోళన, భయాలు, ఒత్తిడులను కూడా తగ్గించుకోవాలి.

డాక్టర్ మంజునాథ్ బాలే
సీనియర్ మినిమల్లీ ఇన్వేసివ్ అండ్ రోబోటిక్ థొరాసిక్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్.





కొందరికి అర చేతుల్లో (పామర్), ఇంకొందరికి పాదాల్లో (ప్లాంటార్), మరి కొందరికి బాహుమూలల్లో (యాక్సిలరీ), ఇంకొందరికి ముఖం, తలలో (క్రేనియో ఫేసియల్) విపరీతంగా చమట పట్టేస్తూ ఉంటుంది.

ప్లానింగ్

పెళ్లికి ముందు పరీక్షలు

పెళ్లికి ముందు అటు ఆరు తరాలూ, ఇటు తరాలూ గమనించాలి అంటారు. పెళ్లి నూరేళ్ల పంటగా వర్ధిల్లడం కోసమే ఈ ముందు జాగ్రత్తలు. అయితే దంపతుల ఆరోగ్యాలతో పాటు, పిల్లలు పుట్టే అవకాశాలు, జన్యుపరంగా సంక్రమించే వ్యాధులు లాంటి వివరాలను కూడా ముందుగా తెలుసుకోవడం కూడా అవసరమే! అందుకోసం పెళ్లి చేసుకోబోయే జంట కొన్ని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. అవేంటంటే...



రక్తపరీక్షలు:

అనీమియా లాంటి అంతర్గత ఆరోగ్య సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు తెలుసుకోవడం కోసం ఈ పరీక్ష చేయించుకోవాలి.
ఈ పరీక్షతో ఇద్దరి బ్లడ్‌గ్రూప్ కూడా తేటతెల్లమవుతుంది.

జెనెటిక్ స్క్రీనింగ్:

వంశపారంపర్యంగా సంక్రమించే జన్యు సమస్యలు, ముప్పులను ఈ పరీక్షతో పసిగట్టవచ్చు. ఈ పరీక్ష ఫలితాన్ని బట్టి దంపతులు పిల్లల ప్లానింగ్ చేసుకోవచ్చు. అలాగే అవసరమైన ముందు జాగ్రత్తలు, చికిత్సలను ఆశ్రయించవచ్చు.

ఎస్‌టిఐ:

లైంగికంగా సంక్రమించే కొన్ని వ్యాధులు శాశ్వత వంధత్వాన్ని తెచ్చిపెడతాయి. కాబట్టి పెళ్లికి ముందు ఈ పరీక్ష తప్పనిసరిగా చేయించుకుని, అవసరాన్ని బట్టి చికిత్స తీసుకోవాలి.

ఫెర్టిలిటీ పరీక్షలు:

పునరుత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు ఇద్దరూ చేయించుకోవాలి. స్త్రీలల్లో అండాశయాలు, గర్భాశయ లోపాలు, పురుషుల్లో వీర్యకణాలు, కదలికల వివరాలు ఈ పరీక్షతో తెలుస్తాయి. లోపం ఎవరిలో ఉన్నా చికిత్సతో సరిదిద్దుకుంటే, తర్వాత పిల్లలను కనడంలో ఎలాంటి సమస్యలూ ఎదురవకుండా ఉంటాయి.

మీకు తెలుసా?

పాప్‌కార్న్ బ్రెయిన్


మొక్కజొన్న గింజలను వేయించేటప్పుడు అవి చిన్నపాటి టపాసుల్లా పేలుతూ చెల్లాచెదురుగా ఎగిరి పడిపోతూ ఉంటాయి. అదే పనిగా ఇంటర్నెట్, సోషల్ మీడియా ఉపయోగించే వాళ్ల ఆలోచనలు కూడా పాప్‌కార్న్‌లా ఒక దగ్గరి నుంచి ఇంకో దగ్గరకి ఎగిరి పడుతూ ఉంటాయి.



ఈ పరిస్థితినే పాప్‌కార్న్ బ్రెయిన్ అంటారు. ఈ స్థితికి చేరుకున్న వారి సామాజిక అనుబంధాలు దెబ్బతింటాయి. సహనం తగ్గడంతో పాటు మానసిక సంతులనాన్ని కూడా కోల్పోతారు.
ఆందోళన పెరిగి ఉత్పాదకత కూడా తగ్గుతుంది. దేని మీద మనసు కేటాయించలేకపోవడం, అప్రమత్తత లోపించడం కూడా పాప్‌కార్న్ బ్రెయిన్ లక్షణాలే! ఈ పరిస్థితి వృత్తిపరమైన, వ్యక్తిగతమైన జీవితాలను దెబ్బతీస్తుంది. కాబట్టి ఇంటర్నెట్, సోషల్ మీడియా వాడకాలను పరిమితం చేసుకోవాలి.

అవగాహన

ఆ గీతకు అర్థం?



మందుల స్ట్రిప్‌ల మీద అడ్డుగా ఉండే ఎర్రని గీతను ఎప్పుడైనా గమనించారా? అలాంటి గీతలను చాలా మందుల స్ట్రిప్‌ల మీద చూశాం కదా? దాన్లో విచిత్రమేముంది? అనుకోకండి. ఆ గీతకు ఒక అర్థం ఉంది. యాంటీబయాటిక్స్ విచక్షణా రహితంగా వాడడం వల్ల యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ పెరుగుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పటి నుంచో గగ్గోలు పెడుతోంది. ఈ పరిస్థితి సూక్ష్మజీవుల మ్యుటేషన్‌కు దారి తీస్తుందనీ, మందులకు లొంగని వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల సంఖ్యను పెంచుతుందని మనందరికీ తెలుసు. కాబట్టే వైద్యులు సూచించినప్పుడు, సూచించినంత కాలం మాత్రమే యాంటీబయాటిక్స్ వాడుకోవాలి. ఈ మందులను తేలికగా గుర్తించడం కోసమే యాంటిబయాటిక్స్ స్ట్రిప్‌ల మీద ఎర్రని గీతను ముద్రిస్తూ ఉంటారు. ఈ గీత ఆధారంగా మందుల షాపుల్లో విక్రయించే యాంటీబయాటిక్స్‌ను తేలికగా గుర్తించవచ్చు. తలనొప్పి, జలుబు లాంటి స్వల్ప రుగ్మతలకు ఓవర్ ది కౌంటర్ మెడికేషన్ కొనే సమయంలో అవగాహన లేమితో యాంటీబయాటిక్స్‌ను కొనేసి విచక్షణారహితంగా వాడకుండా ఉండడం కోసమే ఈ ఏర్పాటు.

రంజాన్

పవిత్ర మాసంలో నిండైన ఆరోగ్యం

ముస్లిం క్యాలెండర్‌లో తొమ్మిదో నెల రంజాన్ మాసాన్ని ఏడాది మొత్తంలో ఎంతో పవిత్రమైన నెలగా పరిగణిస్తారు. ఈ నెలలో ప్రపంచవ్యాప్తం ముస్లింలు అందరూ ఉపవాసం ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే! రోజాలో ఉన్నప్పుడు, తెల్లవారుఝాము నుంచి పొద్దు కుంగేవరకూ ఉపవాసం చేసే సమయంలో ఆరోగ్యం దెబ్బ తినకుండా ఉండడం కోసం ప్రతి ఏటా, ప్రపంచ ఆరోగ్య సంస్థ ముస్లింలకు కొన్ని ఆహార నియమాలను సూచించడం పరిపాటి. అవేంటంటే....

సంతులన భోజనం
ఉపవాసానికి ముందూ, తర్వాత సంతులన ఆహారం తీసుకోవడంతో పాటు నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉపవాసం ముగిసిన తర్వాత వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి.

ఉప్పు ఇలా
పదార్థాల్లో ఉప్పుకు బదులుగా మూలికలను చేర్చుకోవాలి. సహజసిద్ధమైన మూలికలు ఆహారం రుచిని పెంచడంతో పాటు, ఆరోగ్యాన్ని సమకూరుస్తాయి.

శారీరక వ్యాయామం
ఉపవాసంలో ఉంటున్నప్పటికీ వ్యాయామాన్ని మానవలసిన అవసరం లేదు. వ్యాయామంతో జీర్ణశక్తి మెరుగ్గా ఉండడంతో పాటు, ఆరోగ్యం కూడా భేషుగ్గా ఉంటుంది.

వంట ఇలా
ఆహారంలోని పోషకాలను నష్టపోకుండా ఉండడం కోసం, పదార్థాలను నూనెలో వేయించడానికి బదులుగా, బేక్ చేయడం ఆవిరి మీద ఉడికించడం చేయాలి.



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 12 మార్చి 2024
cinema@andhrajyothy.com



జీవితంలో ఒక్కసారైనా తళుక్కున మెరవాలని, ఒక్కసారైనా గెలిచి నిలవాలని సినీ కళాకారులు కలలు కనే వేదిక.. ఆస్కార్స్. ప్రారంభమై 96 ఏళ్లు గడిచినా ఈ అవార్డులకు ఉండే క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు సరికదా ప్రతి ఏడాది మరింత పెరుగుతోంది. గోల్డెన్ గ్లోబ్, బాఫ్తా, కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లాంటివి ఎన్నున్నా ప్రపంచ సినిమా ప్రతిష్ఠాత్మకంగా భావించేది ఆస్కార్ అవార్డులే. ఎప్పటిలాగే ఈ ఏడాదీ ఎన్నో చిత్రాలు, నటీనటులు, సాంకేతిక బృందాలు ఆస్కార్ బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి.

గెలుపు గుర్రం ఓపెన్‌హైమర్




ఉత్తమ నటుడు: కిలియన్ మర్ఫీ

టెలివిజన్ సిరీస్ పీకీ బ్లైండర్స్‌లో థామస్ షెల్బీగా కిలియన్ మర్ఫీ అందరికీ సుపరిచితమే. ఈ నటుడు క్రిష్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన బ్యాట్‌మెన్ ట్రయాలజీ, ఇన్‌సెప్షన్, డన్‌కిర్క్ చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషించారు. ఓపెన్‌హైమర్‌లో అణు బాంబు తయారు చేసిన థీరియాటికల్ ఫిజిసిస్ట్ జె రాబర్ట్ ఓపెన్‌హైమర్ పాత్రను పోషించారు మర్ఫీ. అణు బాంబు విస్ఫోటనం జరిగే సందర్భాల్లో ఆయన కనబరిచిన భావోద్వేగాలు గొప్పగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో కిలియన్ మర్ఫీ నటన సినీ ప్రపంచంలోని అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా మిగిలిపోతుంది. ఉత్తమ నటుడిగా నిలిచిన కిలియన్ మర్ఫీ, ఆస్కార్ అందుకున్న తొలి ఐరిష్ సంతతి నటుడిగానూ అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. ఈ అవార్డు కోసం కిలియన్ మర్ఫీతో బ్రాడ్లీ కూపర్ (మేస్ట్రో), కోల్మన్ డొమింగో (రస్టిన్) పాల్ జియామటి (ది హోల్డోవర్స్), జెఫ్రీ రైట్ (అమెరికన్ ఫిక్షన్)లు పోటీపడ్డారు.

అంగరంగ వైభవంగా...



ప్రపంచ వ్యాప్తంగా సినీప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆశగా ఎదురు చూసే ఆస్కార్ అవార్డుల వేడుక ఆదివారం రాత్రి లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరిగింది. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులకు నిరసిస్తూ కొంతమంది ఆందోళనకారులు డాల్బీ థియేటర్ ముందు నినాదాలు చేస్తున్న నేపథ్యంలో ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. గత ఏడాది ఇదే వేదికపై ఎన్టీఆర్, రామ్‌చరణ్, రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డ్ సాధించి, తెలుగు సినిమా సత్తా చాటింది. ఈసారి ఆస్కార్ అవార్డుల్లో భారతీయ సినిమా మెరుపులు ఏమీ లేవు. సినిమా విడుదలైన దగ్గర నుంచి వార్తల్లో నిలిచి అందరి దృష్టినీ ఆకట్టుకొన్న 'ఓపెన్‌హైమర్' చిత్రం ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు అవార్డులు సాధించి, చరిత్ర సృష్టించింది. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ బయోగ్రాఫికల్ థ్రిల్లర్ ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితో సహా ఏడు అవార్డులు సొంతం చేసుకుంది. 53 ఏళ్ల క్రిస్టఫర్ నోలన్ చిత్రాలకు ఆస్కార్ అవార్డులు రావడం కొత్త కాదు కానీ ఒక దర్శకుడిగా మాత్రం ఆయన ఈ అవార్డ్ అందుకోవడం ఇదే తొలిసారి. 'ఓపెన్‌హైమర్' చిత్రం కోసం మూడేళ్లు ఎంతో కష్టపడ్డారు నోలన్. 2020లో వచ్చిన 'టెనెట్' చిత్రం తర్వాత మరో సినిమా జోలికి పోకుండా 'ఓపెన్‌హైమర్' చిత్రం మీదే ప్రత్యేక దృష్టి పెటారు నోలన్. మరో విషయం ఏమిటంటే ఆయన రూపొందించిన తొలి బయోపిక్ ఇదే. 'అమెరికన్ ప్రొమేథియస్': 'ద ట్రయంప్ అండ్ ట్రాజెడీ ఆఫ్ జె రాబర్ట్ ఓపెన్‌హైమర్' అనే పుస్తకం ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు నోలన్. మూడు గంటల రన్‌టైమ్‌తో ఆయన చిత్రాల్లో తొలి స్థానంలో నిలిచిన 'ఓపెన్‌హైమర్' లో కిలియన్ మర్ఫీ ముఖ్య పాత్ర పోషించారు. ఉత్తమ నటుడుగా ఆయన అవార్డ్ అందుకుంటూ భావోద్వేగానికి గురై ఈ అవార్డ్‌ను శాంతికాముకులకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆస్కార్ అవార్డ్ పొందిన ఈ చిత్రాన్ని ఈ నెల 24 నుంచి జియో సినిమాలో హిందీ, ఇంగ్లీష్ వెర్షన్స్‌లో ప్రేక్షకులు చూసే అవకాశం కల్పిస్తున్నారు.



వేదికపైకి నగ్నంగా..

సరిగ్గా 50 ఏళ్ల క్రితం జరిగిన ఆస్కార్ అవార్డుల వేడుకలో ఎలిజబెత్ టైలర్‌ను వేదికపైకి ఆహ్వానించినప్పుడు ఓ వ్యక్తి హఠాత్తుగా నగ్నంగా వేదికపైకి వచ్చాడు. అప్పట్లో ఆ సంఘటన సంచలనం సృష్టించింది. మళ్లీ ఇన్నాళ్లకు 96వ అవార్డుల వేదికపైకి ఓ సూపర్‌స్టార్ అలా నగ్నంగా వచ్చి బెస్ట్ కాస్ట్యూమ్స్ డిజైనర్ అవార్డ్ విజేతను ప్రకటించడం విశేషం. ఆ సూపర్‌స్టార్ మరెవరో కాదు.. రెజ్లర్ జాన్ సీనా. నగ్నంగా వేదికపైకి రావడం తనకు ఇష్టం లేదని, మగవాడి శరీరం జోక్ కాదని ఆయన చెప్పారు. వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న జిమ్మీ కిమ్మెల్ అతని చేతికి ఓ కవర్ ఇచ్చి విజేత పేరు నువ్వే ప్రకటించు.. అని వెళ్లిపోయారు. ఆ కవర్ అడ్డం పెట్టుకుని నగ్నంగానే మైకు ముందుకు వచ్చి ఆ కవర్‌ను తను ఓపెన్ చేయలేనని చెప్పారు. అప్పుడు మళ్లీ జిమ్మీ వేదికపైకి వచ్చి విజేత పేరు ప్రకటించారు.

ఆస్కార్ వేదికపై మరోసారి మెరిసిన ఆర్‌ఆర్‌ఆర్



దర్శకదిగ్గజం రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా నటించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందడమే కాకుండా ఇందులోని 'నాటునాటు' పాట బెస్ట్ ఒరిజనల్ సాంగ్ విభాగంలో ఎన్నికై ప్రతి తెలుగు వాడు కాలర్ ఎగరేసేలా చేసింది. ఈ సినిమాతో ఎన్టీఆర్, రామ్‌చరణ్ గ్లోబర్ హీరోలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. విదేశాల్లోనూ అభిమానుల సంఖ్య పెంచుకున్నారు. కోట్లాదిమంది భారతీయుల కలను నిజం చేసిన 'నాటునాటు' పాటను తాజా ఆస్కార్ అవార్డ్స్ వేదిక మరోసారి గుర్తు చేసింది. బెస్ట్ ఒరిజనల్ సాంగ్ కేటగిరిలో అవార్డ్‌ను ప్రకటించే క్రమంలో తెరపై 'నాటు నాటు' పాట బిట్‌ను ప్రదర్శించేసరికి టీవీలు చూస్తున్న భారతీయ ప్రేక్షకులు ఆనందపరవశులై నృత్యాలు చేశారు. అలాగే ఇప్పటివరకూ వచ్చిన బెస్ట్ యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించి ఓ వీడియో ప్రదర్శిస్తూ అందులో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని రెండు యాక్షన్ షాట్స్ ప్రదర్శించడం మన సినిమాకు మరోసారి దక్కిన గౌరవం.

ఉత్తమ నటి: ఎమ్మాస్టోన్



లాలా ల్యాండ్, అమేజింగ్ స్పైడర్ మ్యాన్, బర్డ్ మ్యాన్ వంటి సినిమాల్లో ఉత్తమ నటన కనబరిచి అందరినీ మెప్పించిన నటి ఎమ్మాస్టోన్. తాజాగా ఈమె 'పూర్ థింగ్స్' అనే చిత్రంలో తన నటనతో అందరి హృదయాలను గెలుచుకోవడమే కాక ఉత్తమ నటి అవార్డునూ కొల్లగొట్టింది. ఉత్తమ నటి పురస్కారానికి ఎమ్మాస్టోన్‌కు అన్నెతె బెన్నింగ్ (నయాడ్), లిలీ గ్లాడ్‌స్టోన్ (కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్), సాండ్రా హూల్లర్(అనాటమీ ఆఫ్ ఏ ఫాల్) నుంచి గట్టి పోటీ ఎదురైనా అవార్డును ఈ నటి ఎగరేసుకుపోవడం విశేషం.

ఉత్తమ ఇంటర్నేషనల్ చిత్రం: ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్



మార్టిన్ అమిస్ రాసిన పుస్తకం ఆధారంగా ఈ హిస్టారికల్ డ్రామాను జొనాథన్ గ్లేజర్ తెరకెక్కించారు. "మనం తీసుకున్న నిర్ణయాలు మన జీవితాలని ప్రతిబింబిస్తాయి" అని అవార్డు అందుకునేటప్పుడు ఈ చిత్ర దర్శకుడు అన్నారు. 1943లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ కాన్సన్‌ట్రేషన్ క్యాంపులో (హోలోకాస్ట్) జరిగిన ఆరాచకాలను ఓ కుటుంబ కథ నేపథ్యంగా ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించారు.

మంత్రముగ్ధుల్ని చేసిన మెస్సీ



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ అతిరథ మహారథులతో పాటూ ఆస్కార్ వేడుకల్లో మరో విశిష్ట అతిథి మెరిసింది. ఆ అతిథి ఎవరో కాదు.. 'అనాటమీ ఆఫ్ ఏ ఫాల్' చిత్రంలో నటించిన మెస్సీ అనే కుక్క. ఈ వేడుకకు ముస్తాబై వచ్చిన మెస్సీ తన సపోర్టింగ్ నేచర్‌తో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసి మంచి మార్కులు కొట్టేసింది. అవార్డులను ఇస్తున్నప్పుడు డాల్బీ థియేటర్‌లోని ప్రేక్షకుల కరతాళధ్వనులు ఒక ఎత్తయితే.. విజేతలను అభినందిస్తూ మెస్సీ చేసిన హంగామా మరో ఎత్తు. వేడుకకు వచ్చిన ప్రముఖలంతా మెస్సీతో సెల్ఫీ దిగారు. ప్రతీ ఏడాదీ ఆస్కార్ వేడుకల్లో ఏదో ఒక విషయం హైలైట్‌గా నిలిచినట్లే.. ఈ ఏడాది మెస్సీ నిలిచిందంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

ఉత్తమ దర్శకుడు: క్రిస్టఫర్ నోలన్



అనూహ్యమైన చిత్ర కథనాలతో ప్రేక్షకుల మెదడుకు పదును పెట్టి, వారిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే దర్శకుడు క్రిస్టఫర్ నోలన్. ఆయన తెరకెక్కించిన చిత్రాలు వేటికవే విభిన్నంగా నిలుస్తుంటాయి. ప్రతీ చిత్రానికి ఒక సరికొత్త జానర్‌ను ఎన్నుకుని దానిని మరింత నూతనంగా తెరపై ఆవిష్కరించడంలో ఆయన సిద్ధహస్తుడు. ఇప్పటివరకూ సినీ చరిత్రలో నిలిచిపోయే ఎన్నో చిత్రాలను అందించిన ఆయన తొలిసారి ఈ అవార్డును అందుకోవడం విశేషం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణు బాంబు తయారు చేసిన థీరియాటికల్ ఫిజిసిస్ట్ జె రాబర్ట్ ఓపెన్‌హైమర్ అనే వ్యక్తి జీవిత కథ 'అమెరికన్ ప్రొమేథియస్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు నోలన్. ఆయన దర్శకత్వ బాధ్యతలు చేపట్టిన తొలి బయో పిక్ ఇదే కావడం మరో ఆసక్తికర విషయం. ఉత్తమ దర్శకుడు విభాగంలో జస్టిన్ ట్రియెట్ (అనాటమీ ఆఫ్ ఏ ఫాల్), మార్టిన్ స్కోర్స్ (కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్), యోర్గోస్ లాంతిమోస్(పూర్ థింగ్స్), జొనాతన్ గ్లేజర్ (ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్) పోటీగా నిలిచారు.



నితిన్ దేశాయ్‌కు నివాళి

అంతకుముందు సంవత్సరంలో మరణించిన సినీ ప్రముఖులను ప్రస్తుతం జరుగుతున్న వేడుకలో స్మరించుకుని నివాళి ఘటించడం ఆస్కార్ ఫంక్షన్‌లో ఓ సంప్రదాయం. దానిని పాటిస్తూ గత ఏడాది మరణించిన ఆర్ట్ డైరెక్టర్, నిర్మాత నితిన్ చంద్రకాంత్‌దేశాయికి నివాళులు అర్పించింది ఆస్కార్ వేదిక. మూడు పదుల తన సినీ జీవితంలో ఆస్కార్‌కు నామినేట్ అయిన 'లగాన్' చిత్రంతో సహా పలు భారీ చిత్రాలకు నితిన్ దేశాయి కళాదర్శకుడిగా పనిచేశారు. ఆయన గొప్పతనాన్ని, పని చేసిన చిత్రాల గురించి వివరిస్తూ ఓ వీడియోను ఆస్కార్ వేదిక తెరపై ప్రదర్శించారు.

భారతీయ చిత్రానికి నిరాశ





భారత సంతతికి చెందిన కెనడియన్ ఫిల్మ్‌మేకర్ నిషా పహూజా దర్శకత్వం వహించిన 'టు కిల్ ఏ టైగర్' చిత్రానికి ఆస్కార్ వేడుకలో నిరాశ ఎదురైంది. మన దేశం నుంచి ఈ ఏడాది నామినేషన్ పొందిన ఏకైక చిత్రం ఇదే. 13ఏళ్ల నిషా అనే చిన్నారికి జరిగిన అన్యాయంపై పోరాడిన తల్లిదండ్రుల కథే ఈ చిత్రం .జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఈ చిత్రం కచ్చితంగా అవార్డును తెస్తుందన్న నమ్మకం కలిగించింది. అయితే ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం విభాగంలో '20 డేస్ ఇన్ మరియాపోల్' అనే చిత్రం పోటీగా నిలిచి అవార్డ్ గెలుచుకోవడంతో 'టు కిల్ ఏ టైగర్' వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఉక్రెయిన్ ఫిల్మ్‌మేకర్, జర్నలిస్ట్ మిస్టిస్లావ్ చెర్నోవ్ '20 డేస్ ఇన్ మరియాపోల్' చిత్రాన్ని రూపొందించారు. ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత 20 రోజుల పాటు మారియో పోల్ సిటీలో జరిగిన సంఘటనలే ఈ చిత్ర కథాంశం. "ఇది ఉక్రెయిన్ చరిత్రలోనే తొలి ఆస్కార్ అవార్డు అనుకుంటా. ఉక్రెయిన్ మీద రష్యా దాడులు విరమించుకుంటే ఈ ఆస్కార్ అవార్డు వారికివ్వటానికి సిద్ధం" అని ప్రకటించారు మిస్టిస్లావ్.

హైదరాబాద్‌లో వేట్టయాన్



ఇటీవలే 'లాల్ సలామ్' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన రజనీకాంత్ తన తదుపరి చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'వేట్టయాన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆదివారమే నగరానికి చేరుకున్న రజనీకాంత్ ఓ ప్రైవేట్ స్టూడియోలో షూటింగ్‌లో పాల్గొన్నారు. మరికొన్ని రోజుల పాటు రజనీకాంత్ చిత్రీకరణలో పాల్గొంటారు. 'వేట్టయాన్' చిత్రానికి టీజే జ్ఞానవేల్ దర్శకుడు. అమితాబ్‌బచ్చన్, రానా, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సుభాస్కరన్ నిర్మాత.

ప్రేమకు జయం




సత్య మేరుగు, దీపిక జంటగా తెరకెక్కుతోన్న యాక్షన్ ఎంటర్టైనర్ 'జయం'. జి కిరణ్ కుమార్ దర్శకత్వంలో రవికుమార్ చౌదరి నిర్మిస్తున్నారు. సోమవారం చిత్ర బృందం పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గతంలో వచ్చిన 'జయం' సినిమా టైటిల్‌ను మా సినిమాకు పెట్టాం. ఈ సినిమా కూడా అంత పెద్ద హిట్ అవ్వాలి. కిరణ్ కుమార్ మంచి విజన్ ఉన్న దర్శకుడు' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'కథకు తగ్గ నటులు టెక్నీషియన్లు దొరికారు. లవ్, యాక్షన్, ఎంటర్టైన్‌మెంట్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ రవిరామ్. సినిమాటోగ్రఫీ: యూఎస్ విజయ్



వైజాగ్‌లో పుష్ప రూల్

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రం షూటింగ్ ఏకధాటిగా కొనసాగుతోంది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ విశాఖపట్నంలో ప్రారంభమైంది. షూటింగ్‌లో పాల్గొనేందుకు అల్లు అర్జున్ విశాఖపట్నం వెళ్లారు. వారం రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రతినాయక పాత్ర పోషిస్తున్న ఫహాద్ ఫాజిల్ కూడా పాల్గొంటున్నారు. ఆగస్టు 15న 'పుష్ప 2' ప్రేక్షకులు ముందుకు రానుంది. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక మందన్న కథానాయిక.

మళ్లీ వస్తున్న ప్రేమికుడు



ప్రభుదేవా కథానాయకుడిగా శంకర్ దర్శకత్వం వహించిన 'ప్రేమికుడు' చిత్రం అప్పట్లో సంచలన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. అప్పట్లో కుర్రకారును ఓ ఊపు ఊపిన ఈ సినిమా ఈ తరాన్ని అలరించేందుకు త్వరలో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రాన్ని మరళీధర్ రెడ్డి, రమణ రీ రిలీజ్ చేస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఇది ఎన్నికల సినిమా కాదు

- [illegible]

'నేను చరిత్రను తప్పుగా చెప్పలేదు. ఒకవేళ 'రజాకార్' సినిమా కోసం అలాంటి తప్పు చేస్తే నేను చరిత్రహీనుడిగా మిగిలిపోతాను' అని దర్శకుడు [illegible] 'రజాకార్' [illegible] సినిమా [illegible] అని ఆయన చెప్పారు.



దర్శకుడు సూర్యకిరణ్ కన్నుమూత

ప్రముఖ నటుడు, సినీ దర్శకుడు సురేష్ అలియాస్ సూర్య కిరణ్ (48) అనారోగ్యం కారణంగా సోమవారం చెన్నై నగరంలో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతూ నగరంలోని జెమ్ హాస్పిటల్‌లో చికిత్స పొందిన ఆయన.. సోమవారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికెళ్లిన కొద్దిసేపటికే కన్నుమూశారు. భౌతికకాయాన్ని స్థానిక కేకే నగర్‌లోని ఆయన నివాసంలో చివరిచూపు కోసం ఉంచారు. కేరళకు చెందిన సూర్యకిరణ్... తమిళంలో 'మౌనగీతంగల్' అనే చిత్రం ద్వారా బాల నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. తమిళం, తెలుగు చిత్రాల్లో నటించడమే కాకుండా, పలు చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. తెలుగులో 'సత్యం' సినిమాతో దర్శకుడిగా మారిన ఆయన... 'ధన 51', 'బ్రహ్మాస్త్రం', 'రాజుభాయ్', 'చాప్టర్6' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. అలాగే, రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి వంటి హీరోల చిత్రాల్లో కూడా చిన్న పాత్రలను పోషించారు. హీరోయిన్ కళ్యాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్న సూర్యకిరణ్... మనస్పర్థల కారణంగా విడిపోయారు. తమిళంలో వరలక్ష్మి శరత్ కుమార్ నటించిన 'అరసి' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించగా, ఈ చిత్రం విడుదల కావాల్సివుంది.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

షబ్నమ్ షో



సత్తా చాటిన తెలుగు టీనేజర్

యూపీపై గుజరాత్ విజయం

దీప్తి పోరాటం వృథా

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్‌లో తమ ప్లేఆఫ్ ఆశలను గుజరాత్ జెయింట్స్ సజీవంగానే ఉంచుకుంది. సోమవారం యూపీ వారియర్స్‌తో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో జెయింట్స్ 8 పరుగుల తేడాతో నెగ్గింది. విశాఖపట్నం టీనేజ్ పేసర్ షబ్నమ్ షకీల్ (3/11) బౌలింగ్‌లో అదరగొట్టింది. అటు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (60 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 88 నాటౌట్) అద్భుత పోరాటం వృథా అవడంతో యూపీ దాదాపు నిష్క్రమించినట్టే. ముందుగా జెయింట్స్ 8 వికెట్లకు 152 రన్స్ చేసింది. మూనీ (74), వోల్వార్డ్ (43) రాణించారు. ఎకెల్‌స్టోన్‌కు 3, దీప్తికి 2 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 144 పరుగులు చేసి ఓడింది. పూనమ్ (36 నాటౌట్) రాణించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షబ్నమ్‌కు మూడు వికెట్లు దక్కాయి.

శతక భాగస్వామ్యంతో..: ఓ మాదిరి ఛేదనలో యూపీ 4 రన్స్‌కే మూడు.. 16 రన్స్‌కే 5 వికెట్లు కోల్పోవడం దెబ్బతీసింది. అయినా దీప్తి శర్మ పట్టు వదలకుండా చివరి వరకు నిలిచినా ఓటమి తప్పలేదు. తొలి ఓవర్‌లోనే హీలీ (4), అటపట్టు (0)లను అవుట్ చేస్తూ 16 ఏళ్ల తెలుగు పేసర్ షబ్నమ్ షాకిచ్చిం ది. తర్వాత గ్రేస్ (0), గార్డ్‌నర్ (1) కూడా వెనుదిరగడంతో పవర్‌ప్లేలో జట్టు 30/4తో కష్టాల్లో పడింది. ఏడో ఓవర్‌లో శ్వేత (8)ను కూడా షబ్నమ్ అవుట్ చేశాక, దీప్తి శర్మకు పూనమ్ జత కలిసింది. ఆఖరి 14 ఓవర్లు ఈ జోడీ గుజరాత్ బౌలర్లను అద్భుతంగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాగింది. ఇద్దరూ ఎడాపెడా షాట్లతో గుజరాత్‌పై ఒత్తిడి పెంచారు. 15వ ఓవర్‌లో ఫోర్‌తో దీప్తి హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. అయినా చివరి ఓవర్‌లో 26 రన్స్ అవసరపడగా, దీప్తి రెండు సిక్సర్లు బాదినా మరో 8 పరుగుల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చింది. ఈ జోడీ ఆరో వికెట్‌కు అజేయంగా 109 పరుగులు జతచేసింది.

ఓపెనర్లు మినహా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు ఓపెనర్లు బెత్ మూనీ, వోల్వార్డ్ మెరుపు ఆరంభాన్ని అందించారు. వీరి జోరుతో పవర్‌ప్లేలో జట్టు 53 పరుగులు సాధించింది. అయితే ఈ దూకుడును ఎకెల్‌స్టోన్ అడ్డుకుంటూ వోల్వార్డ్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే మరో ఎండ్‌లో టపటపా వికెట్లు కోల్పోతున్నా మూనీ మాత్రం పట్టు వదల్లేదు. 19వ ఓవర్‌లో రెండు ఫోర్లతో ఫిఫ్టీ పూర్తి చేసిన తను ఆఖరి ఓవర్‌లో ఐదు ఫోర్లతో 21 పరుగులు సాధించి స్కోరును 150 దాటించింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 152/8 (మూనీ 74, వోల్వార్డ్ 43; ఎకెల్‌స్టోన్ 3/38, దీప్తి 2/22).
యూపీ: 20 ఓవర్లలో 144/5 (దీప్తి 88 నాటౌట్, పూనమ్ 36 నాటౌట్; షబ్నమ్ 3/11).

నేటి మ్యాచ్
ముంబై x బెంగళూరు
రాత్రి 7.30 గం. నుంచి



దీప్తి (88 నాటౌట్)

ఈసారైనా అందేనా?



స్పోర్ట్స్ 18, జియో సినిమాలో మధ్యాహ్నం 3.30 నుంచి

కళ్లన్నీ సాత్విక్-చిరాగ్ పైనే..

నేటినుంచి 'ఆల్ ఇంగ్లండ్' బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: బ్యాడ్మింటన్‌లో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌నకున్న హోదా, గుర్తింపు వేరు. ప్రతీ షట్లర్ ఈ టైటిల్ కోసం పరితపిస్తుంటాడు. భారత్ తరఫున దశాబ్దాల క్రితం ప్రకాశ్ పడుకోన్ (1980), పుల్లెల గోపీచంద్ (2001) మాత్రమే విజేతలుగా నిలిచారు. ఆ తర్వాత 23 ఏళ్లుగా భారత షట్లర్లు ఏ విభాగంలోనూ ఇక్కడ చాంపియన్లు కాలేకపోయారు. మధ్యలో సైనా నెహ్వాల్ (2015), లక్ష్య సేన్ (2022) ఫైనల్ దాకా వెళ్లినా రన్నరప్‌కే పరిమితమయ్యారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ మంగళవారం నుంచి 17వ తేదీ వరకు జరుగబోతోంది. ఈసారి మాత్రం డబుల్స్‌లో వరల్డ్ నెంబర్ వన్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రూపంలో భారత్ కల నెరవేరే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. గతేడాది రెండో రౌండ్‌కే పరిమితమైన ఈ ద్వయం ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉంది. గత ఆదివారమే ఫ్రెంచ్ ఓపెన్‌ను వేసుకున్న ఈ సూపర్ జోడీ.. ఆ జోరులోనే ఇక్కడా చెలరేగాలనే కసితో ఉంది. 2023లో సాత్విక్-చిరాగ్ జోడీ ఇండోనేసియాలో కెరీర్‌లో తొలి సూపర్ 1000 టైటిల్‌ను నెగ్గింది. తాజా టోర్నీ కూడా నాలుగు సూపర్ 1000 టైటిళ్లలో ఒకటి. అయితే మూడు సార్లు వరల్డ్ చాంపియన్స్‌గా నిలిచిన మహ్మద్ ఎహ్సాన్-హెండ్రా సెటియవాన్ (ఇండోనేసియా) జోడీతో భారత్ డబుల్స్ జంట తొలి రౌండ్‌లో తలపడనుంది. గతేడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ వీరి చేతిలోనే ఓడారు. మిగతా భారత షట్లర్లలో లక్ష్య సేన్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్, కిడాంబి శ్రీకాంత్ సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతవారం ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన లక్ష్య సేన్ ఈసారి ఇక్కడ టైటిల్ కొడితే సింగిల్స్‌లో ఆ ఘనత సాధించిన మూడో ఆటగాడిగా నిలుస్తాడు.

సింధుకు కష్టమే..

గత నాలుగు నెలలుగా ఎడమ మోకాలి గాయంతో ఆటకు దూరమైన పీవీ సింధు ఇటీవలి ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్స్ వరకు చేరగలిగింది. ఇక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో వొన్నే లీ (జర్మనీ)పై తొలి రౌండ్ నెగ్గితే సింధు.. రెండో రౌండ్లో వరల్డ్ నెంబర్‌వన్, టాప్ సీడ్ అన్ సే యంగ్ (కొరియా)ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రత్యర్థి 2-0తో సింధుపై ఆధిక్యంలో ఉంది. ఆకర్షి కశ్యప్ భారత్ నుంచి బరిలో ఉన్న మరో సింగిల్స్ క్రీడాకారిణి. ఇక, డబుల్స్‌లో రెండేళ్లుగా సెమీస్‌దాకావచ్చిన ట్రీసా జాలీ-గాయత్రి జోడీ ఈసారైనా విజేత కావాలని పరితపిస్తోంది. వీరితో పాటు అశ్విని-తనీషా జోడీ ఏమేరకు ప్రభావం చూపుతారో చూడాలి.

టీ20 వరల్డ్‌కప్‌నకు షమి దూరం



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్ ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి షాక్ తగిలింది. ఈ మెగా టోర్నీకి స్టార్ పేసర్ మహ్మద్ షమి దూరం కానున్నాడు. గతనెల 26న షమి చీలమండ గాయానికి లండన్‌లో సర్జరీ చేయించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతను ఎప్పటి నుంచి బరిలోకి దిగుతాడనే విషయమై బీసీసీఐ కార్యదర్శి జైషా స్పష్టతనిచ్చాడు. ఇప్పటికే షమి ఐపీఎల్‌లో ఆడని విషయం తేలిపోగా.. తాజాగా అతను సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్ నుంచి అందుబాటులో ఉంటాడని షా పేర్కొన్నాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో భారత ఓటమి తర్వాత షమి గాయంతో క్రికెట్‌కు దూరమయ్యాడు. పెయిన్ కిల్లర్ ఇంజక్షన్ చేయించుకుంటూనే ఆ వరల్డ్‌కప్ ఆడినట్టు షమి అప్పట్లో తెలిపాడు. ప్రస్తుతం షమి జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో కోలుకుంటున్నాడు.

పట్టు బిగిస్తున్న ముంబై

- రహానె, ముషీర్ అర్ధసెంచరీలు
- విదర్భతో రంజీ ఫైనల్



రహానె (58 బ్యాటింగ్)

ముంబై: కీలక సమయంలో రహానె (58 బ్యాటింగ్) అర్ధ శతకంతో ఫామ్‌లోకి రావడంతో.. విదర్భతో రంజీ ఫైనల్లో ముంబై పట్టు బిగిస్తోంది. ఆటకు రెండో రోజు రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ముంబై 141/2 స్కోరు చేసింది. సోమవారం ఆట ముగిసేసరికి రహానెతోపాటు ముషీర్ (51 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. 119 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి ముంబై ఇప్పటికే 260 రన్స్ లీడ్ సాధించింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 31/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విదర్భ 105 పరుగులకు కుప్పకూలింది. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 224 రన్స్ చేసింది.

ఒలింపిక్ బెర్త్ చేరువలో నిషాంత్

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ క్వాలిఫయర్ టోర్నీలో భారత బాక్సర్ నిషాంత్ దేవ్ (71 కిలోలు) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన బౌట్‌లో నిషాంత్ 5-0తో క్రిస్టోస్ కరైటిస్ (గ్రీస్)ను చిత్తు చేశాడు. ఇక, మంగళవారం జరిగే క్వార్టర్స్‌లో ఒమారి జోన్స్ (అమెరికా)ను ఓడిస్తే నిషాంత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారవుతుంది.



పారా వరల్డ్‌కప్‌లో శ్రీధర్-పావని జోడీకి కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): పారా షూటింగ్ వరల్డ్‌కప్‌లో హైదరాబాద్ జోడీ శ్రీధర్-పావని కాంస్య పతకం కొల్లగొట్టింది. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన ఆర్11 మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్2 విభాగం కాంస్య పతక పోరులో శ్రీధర్-పావని జంట 16-15 స్కోరుతో బ్రుంజెల్ నటాలై-కిరణ్‌జిత్ సింగ్ (న్యూజిలాండ్) ద్వయంపై నెగ్గి, తృతీయ స్థానంలో నిలిచింది. బ్రూనో స్టోవ్-జెస్సిక (బ్రెజిల్) జోడీకి స్వర్ణం దక్కగా, హేస్ బెన్-చాంపియన్ మాడిసన్ (అమెరికా) జంట రజతం దక్కించుకొంది.

ట్రయల్స్‌లో ఫొగట్ రచ్చ!

- ఒకేరోజు రెండు కేటగిరీల్లో బరిలోకి..
- ఆసియా క్వాలిఫయర్స్‌కు అర్హత
- శాంపిల్ ఇవ్వకుండానే వెళ్లిన రెజ్లర్?



పటియాలా: పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ టోర్నీ కోసం జరుగుతున్న మహిళల రెజ్లింగ్ సెలెక్షన్ ట్రయల్స్‌లో ఆసియాడ్ పతక విజేత వినేష్ ఫొగట్ హంగామా సృష్టించింది. నిబంధనలను అతిక్రమిస్తూ ఒకేరోజు రెండు వెయిట్ కేటగిరీలు 50, 53 కిలోల్లో బరిలోకి దిగడానికి అనుమతించాలంటూ రచ్చ చేసింది. మొత్తమ్మీద రెండింటిలో తలపడి ఒకదానిలో గెలిచి ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. సోమవారం దాదాపు రెండున్నర గంటలు ట్రయల్స్‌కు ఆటంకం కలిగించడంతో.. అధికారులు ఆమె ఒత్తిడికి తలొగ్గారు. పైగా, 53 కిలోల ట్రయల్స్‌లో ఓడినా ఒలింపిక్స్ ఆరంభానికి ముందు ఫైనల్ ట్రయల్స్ నిర్వహించేలా తనకు లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయితే, ఫొగట్‌ను రెండు వెయిట్ కేటగిరీల్లో అనుమతించడంపై పలువురు రెజ్లర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేసిన వారిలో వినేష్ ముందు వరుసలో ఉంది. వినేష్ సహజంగా 53 కిలోల విభాగం బరిలోకి దిగుతుంది. అయితే, ఆ కేటగిరీలో అంతిమ్ ఈపాటికే ఒలింపిక్ కోటా బెర్త్ సాధించడంతో ఫొగట్ తన వెయిట్ కేటగిరీని 50 కిలోలకు మార్చుకొంది. ఈ కేటగిరీలో గెల్చి వచ్చేనెల్లో జరిగే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు ఎంపికైంది. అయితే, 53కిలోల బౌట్‌లో ఫొగట్ చిత్తుగా ఓడింది. కాగా, ట్రయల్స్ ముగిశాక మూత్రం శాంపిల్‌ను ఇవ్వాల్సి ఉన్నా.. వినేశ్ ఇవ్వకుండానే వెళ్లిపోయిందని సమాచారం.

ఆసీస్ క్లీన్‌స్వీప్

- రాణించిన క్యారీ, మార్ష్
- రెండో టెస్టులో కివీస్ ఓటమి

క్రైస్ట్‌చర్చ్: అలెక్స్ క్యారీ (98 నాటౌట్), మిచెల్ మార్ష్ (80) అద్భుత పోరాటంతో.. న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 279 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 77/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 7 వికెట్లకు 281 పరుగులు చేసి గెలిచింది. బెన్ సీర్స్ 4, హెన్రీ 2 వికెట్లు పడగొట్టారు. న్యూజిలాండ్ 162, 372 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 256 రన్స్‌కు ఆలౌటైంది.

రోహిత్.. చెన్నైకు ఆడాలి!

రాయుడు ఆకాంక్ష



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో రోహిత్ శర్మ.. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడితే చూడాలని ఉందని మాజీ ఆటగాడు అంబటి రాయుడు అన్నాడు. 'అతడు కెప్టెన్సీ కావాలనుకుంటే.. అప్పగించడానికి అందరూ సిద్ధంగా ఉన్నారు. వచ్చే ఏడాది చెన్నైకి రోహిత్ ప్రాతినిధ్యం వహించాలని బలంగా కోరుకొంటున్నా. ఒకవేళ ధోనీ రిటైరైతే.. ఆ స్థానంలో శర్మ పగ్గాలందుకోవచ్చ'ని రాయుడు అన్నాడు. ఈ సీజన్‌లో ముంబై..రోహిత్‌ను తప్పించి హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ అప్పగించిన సంగతి తెలిసిందే.

బిజినెస్

పదేళ్లలో నిఫ్టీ 75,000

రాందేవ్ అగర్వాల్

ముంబై: భారత స్టాక్‌మార్కెట్‌కు మరో పదేళ్ల వరకు ఢోకా లేదని నిపుణుల అంచనా. మధ్య మధ్యలో కొన్ని కరెక్షన్లు వచ్చినా మదుపరులు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఛైర్మన్, సహ వ్యవస్థాపకుడు రాందేవ్ అగర్వాల్ తెలిపారు. పెద్ద అడ్డంకులు ఏమీ లేకపోతే నిఫ్టీ 2031 నాటికి 50,000 పాయింట్లు, మరో పదేళ్లలో 75,000 పాయింట్లను తాకే అవకాశం ఉందన్నారు. ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అంచనాలు వెల్లడించారు. మదుపరులు ఏ షేర్లను పడితే ఆ షేర్లను కాకుండా మంచి ఫండమెంటల్స్ ఉన్న కంపెనీల షేర్లను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. మరో పదేళ్ల పాటు మౌలిక, రక్షణ, క్యాపిటల్ మార్కెట్ కంపెనీలకు ఢోకా ఉండకపోవచ్చని అగర్వాల్ తెలిపారు.

బైజూస్ ఆఫీసుల మూసివేత



ఉద్యోగులకు ఇంటి నుంచే పని

బెంగళూరు: ఎడ్యుటెక్ కంపెనీ బైజూస్ బెంగళూరులోని ప్రధాన కార్యాలయం తప్ప, దేశవ్యాప్తంగా పని చేస్తున్న మిగతా ఆఫీసులన్నింటినీ మూసివేయాలని నిర్ణయించింది. కొంతైనా ఖర్చులు తగ్గించుకునేందుకు కంపెనీ ఈ చర్య తీసుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆఫీసుల మూసివేత ప్రక్రియకు సుమారుగా గత ఆరు నుంచి ఎనిమిది మాసాలుగా కంపెనీ రంగం సిద్ధం చేస్తూ వస్తోంది. పలు కార్యాలయాలు పని చేస్తున్న భవనాల లీజు గడువు ముగుస్తున్నప్పటికీ చాలా కాంట్రాక్టులు రెన్యూ చేయలేదు. అలాంటి కార్యాలయాలన్నింటినీ లీజు గడువు ముగిసిన వెంటనే మూసివేస్తారు. అయితే ఈ ఆఫీసుల్లో పని చేసే సిబ్బంది మాత్రం ఇంటి నుంచి పని (వర్క్ ఫ్రం హోమ్) చేయాలని కంపెనీ కోరింది. ఇది ఎప్పటి వరకు అనే విషయాన్ని మాత్రం స్పష్టం చేయలేదు. అయితే ప్రధాన కార్యాలయం వెలుపల పని చేస్తున్న ఉద్యోగులకు, దేశ వ్యాప్తంగా ఉన్న 300 ట్యూషన్ కేంద్రాల సిబ్బందికి మాత్రం వర్క్ ఫ్రం హోమ్ వర్తించదు. ఆ ట్యూషన్ కేంద్రాలు యథాతథంగా పని చేస్తాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు ఈ కేంద్రాలకు వచ్చి విద్య అభ్యసిస్తూ ఉంటారు గనుక వాటిని యథాతథంగా కొనసాగించాలని కంపెనీ నిర్ణయించింది.

బైజూస్ ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉంది. వర్కింగ్ క్యాపిటల్‌కు కూడా ఇబ్బందులు పడుతోంది. కంపెనీ ఉద్యోగుల్లో 75 శాతం మందికి ఫిబ్రవరి నెల జీతాలు ఇప్పటి వరకు అందలేదు. రైట్స్ ఇష్యూ ద్వారా సమీకరించిన 20 కోట్ల డాలర్ల నిధులను కూడా స్తంభింపచేయడమే ఇందుకు కారణమని కంపెనీ చెబుతోంది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఉన్న తన ఆఫీసులన్నింటినీ మూసివేయాలని బైజూస్ నిర్ణయం తీసుకోవడం విశేషం.

రూ.3.15 లక్షల కోట్లు ఆవిరి

617 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

చిన్న కంపెనీల షేర్లు విల విల

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి తెరపడింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 616.75 పాయింట్లు నష్టపోయి 73,502.64 వద్దకు జారుకుంది. నిఫ్టీ 160.90 పాయింట్ల పతనంతో 22,332.65 వద్ద క్లోజైంది. అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో దేశీయంగానూ మదుపరులు బ్యాంకింగ్, లోహ రంగ షేర్లలో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణం. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 నష్టపోయాయి. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.3.15 లక్షల కోట్లు తగ్గి రూ.389.66 లక్షల కోట్లకు (4.75 లక్షల కోట్ల డాలర్లు) పరిమితమైంది.

మరిన్ని విషయాలు..

- ఎలక్టోరల్ బాండ్ల డేటాను ఈనెల 12న విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించిన నేపథ్యంలో బ్యాంక్ షేరు 1.86 శాతం క్షీణించి రూ.773.50 వద్ద ముగిసింది.
- జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్ షేరు 10 శాతం పతనమై రూ.9.77 వద్ద ముగిసింది. నియంత్రణ నియమావళిని ఉల్లంఘించినందుకుగాను కొత్తగా డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు లీడ్ మేనేజర్‌గా వ్యవహరించకుండా జేఎం ఫైనాన్షియల్‌పై సెబీ నిషేధం విధించడం ఇందుకు కారణం.
- బిట్‌కాయిన్ సరికొత్త రికార్డు స్థాయి 72,000 డాలర్లకు చేరుకుంది. అమెరికాతోపాటు తాజాగా యూకే సైతం క్రిప్టో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల(ఈటీఎఫ్) ట్రేడింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఇందుకు కారణమైంది.
- క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.680-715గా నిర్ణయించింది.

ఎస్ఎంఈ షేర్ల ధరల్లో అవకతవకలు!



సంకేతాలందాయన్న సెబీ చీఫ్ మాధవి పురి బుచ్

ముంబై: చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) షేర్ల ధరల్లో అవకతవకలు జరుగుతున్నట్లు సంకేతాలందాయని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ అన్నారు. పబ్లిక్ ఆఫరింగ్‌లతో (ఐపీఓ) పాటు సెకండరీ మార్కెట్ ట్రేడింగ్‌లోనూ ఈ అవకతవకలు జరుగుతున్న సంకేతాలున్నాయని ఆమె చెప్పారు. ఈ నేపథ్యంలో మదుపరులు అధిక రిస్క్‌తో కూడుకున్న ఈ విభాగ కంపెనీల షేర్లలో పెట్టుబడుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని బుచ్ హెచ్చరించారు. సోమవారం ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె మహిళా జర్నలిస్టులతో మాట్లాడారు. "కొన్ని సంస్థలు ఎస్ఎంఈ లిస్టింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను దుర్వినియోగపరుస్తున్నట్లు మాకు సమాచారం అందింది. ఎందుకంటే, ఎస్ఎంఈ ఐపీఓల్లో అక్రమాలకు పాల్పడటం సులువు. ఇందుకు సంబంధించిన కొన్ని ప్యాటర్న్స్ మా దృష్టికి కూడా వచ్చాయి. వీటిని గుర్తించి, ఎదుర్కొనే విషయంలో మాకు మార్కెట్ నుంచి సూచనలు అందాయి. డేటాను విశ్లేషించి, అవగాహన చేసుకునేందుకు అడ్వైజర్లతో కలిసి కృషి చేస్తున్నాం" అని బుచ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఈ విభాగానికి అదనపు సమాచార బహిర్గత నిబంధనలు ప్రవేశపెట్టే దిశగా ఆలోచన చేస్తున్నట్లు ఆమె చెప్పారు. సెబీ ఛైర్‌పర్సన్ వ్యాఖ్యల నేపథ్యంలో బీఎస్ఈలోని ఎస్ఎంఈ ఐపీఓ సూచీ 3.28 శాతం నష్టపోయి 55,453.91 వద్దకు జారుకుంది.

బుడగ ఏర్పడుతోంది..: ఎస్ఎంఈ సెగ్మెంట్లో కొన్ని కంపెనీల షేర్లు అనూహ్యంగా పెరగడంపైనా సెబీ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. "మార్కెట్లో కొన్ని విభాగ షేర్ల ధరలు అసాధారణంగా పెరగడంతో బుడగ (బబుల్) ఏర్పడుతోంది. ఈ బుడగను మరింత పెరగనివ్వడం సరి కాదు. ఎందుకంటే, ఆ బుడగ పగిలినప్పుడు తీవ్రంగా నష్టపోయేది చిన్న మదుపరులే. అది మంచిది కాదు. ప్రస్తుతం కొన్ని సంస్థల షేర్ల ధరలు వాటి ఆర్థిక స్థితిగతి, పనితీరుతో పొంతన లేకుండా పెరిగాయి. అది అతిశయోక్తిలా కన్పిస్తోంది" అని బుచ్ అన్నారు. 2023 జనవరి నుంచి స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీకి మించిన పనితీరును కనబరిచాయి. అధిక వాల్యువేషన్స్‌తోపాటు నష్ట అవకాశాలు పెరిగిన నేపథ్యంలో పలు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు ముందుజాగ్రత్త వ్యూహంతో స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్లలో ఏక మొత్తం లేదా సిప్ పెట్టుబడుల స్వీకరణను కూడా నిలిపివేశాయి.

28 నుంచి టీ+0 సెటిల్‌మెంట్

మార్కెట్లో సెక్యూరిటీ క్రయ, విక్రయ లావాదేవీల పరిష్కార సమయం మరింత తగ్గనుంది. ఈ లావాదేవీలను జరిగిన రోజే పరిష్కరించే (టీ+0 సెటిల్‌మెంట్) ప్రక్రియ ఈనెల 28న ప్రారంభం కానుందని బుచ్ తెలిపారు. అయితే, ఇది ఐచ్ఛికమేనని ఆమె స్పష్టం చేశారు. టీ+0 సెటిల్‌మెంట్‌ను రెండు విడతల్లో అమలు చేయాలని సెబీ ప్రతిపాదించింది. తొలి దశలో మధ్యాహ్నం 1.30 గంటలకు జరిగిన లావాదేవీలకు అదే రోజున సెటిల్‌మెంట్ జరగనుంది. రెండో విడతలో మార్కెట్ ముగిసే (3.30 గంటల) వరకు జరిగే లావాదేవీలకు కూడా దీన్ని వర్తింపజేయనున్నారు. భవిష్యత్‌లో ట్రేడింగ్ లావాదేవీల తక్షణ (ట్రేడింగ్ జరిగిన క్షణాల్లోనే) సెటిల్‌మెంట్‌కు ఇది బాటలు వేయనుంది.



రూ.6,785 కోట్ల ఇండిగో షేర్లు విక్రయించిన గంగ్వాల్

ఇండిగో ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ ఇంటర్‌గ్లోబల్ ఏవియేషన్ ప్రమోటర్లలో ఒకరైన రాకేశ్ గంగ్వాల్ సంస్థలో 5.83 శాతం వాటాకు సమానమైన 2.25 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.6,785 కోట్లకు విక్రయించారు. బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా ఈ షేర్ల విక్రయం జరిగింది. తన సహ ప్రమోటర్ రాహుల్ భాటియాతో వివాదం నేపథ్యంలో గంగ్వాల్ 2022 ఫిబ్రవరిలో కంపెనీ బోర్డు నుంచి తప్పుకున్నారు. అలాగే, కంపెనీలో తన వాటాను వచ్చే ఐదేళ్లలో క్రమంగా తగ్గించుకోనున్నట్లు ప్రకటించారు. అదే నెలలో రాకేశ్ గంగ్వాల్ భార్య శోభ గంగ్వాల్ కంపెనీలో 4 శాతం వాటాను రూ.2,944 కోట్లకు, 2023 ఆగస్టులో మరో 2.9 శాతం వాటాను రూ.2,800 కోట్లకు విక్రయించారు. కాగా, 2022 సెప్టెంబరులో దంపతులిద్దరు కలిసి 2.74 శాతం వాటాను రూ.2,005 కోట్లకు విక్రయించారు. బీఎస్ఈలో కంపెనీ షేరు ధర సోమవారం 3.63 శాతం పెరిగి రూ.3,214.25 వద్ద ముగిసింది.

జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు అవార్డు

శంషాబాద్ రూరల్: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డు లభించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఏటా 1.5 కోట్ల నుంచి 2.5 కోట్ల మంది ప్రయాణించే ఎయిర్‌పోర్టుల్లో 2023వ సంవత్సరానికి ఎయిర్‌పోర్టు సర్వీస్ క్వాలిటీ (ఏఎస్‌క్యూ) విభాగంలో 'ఉత్తమ ఎయిర్‌పోర్టు' అవార్డు దక్కించుకుంది. ఎయిర్‌పోర్టు కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) మొత్తం 400 విమానాశ్రయాల్లో సేవలను పరిశీలించి జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 'ఎయిర్‌పోర్టు ఉద్యోగులు, ఇతర భాగస్వామ్య వర్గాలు అలుపూ సొలుపు లేకుండా అంకిత భావంతో పని చేయడం వల్లే మాకు ఈ గుర్తింపు లభించింది' అని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ పణిక్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయ విస్తరణతో అందుబాటులోకి వచ్చిన సదుపాయాలు కూడా ఇందుకు దోహదం చేశాయన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,280 ▲	60,760 ▲	79,000 ▼
ముంబై	65,650 ▲	60,130 ▲	72,550 ▲

పిట్టి ఇంజినీరింగ్ చేతికి బగాడియా ఇండస్ట్రీస్

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే పిట్టి ఇంజినీరింగ్ లిమిటెడ్ (పీఈఎల్) తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటకకు చెందిన బగాడియా చైత్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీఐపీఎల్) కంపెనీని కొనుగోలు చేసింది. ఇందుకోసం ఆ కంపెనీ ఎంటర్‌ప్రైజ్ వాల్యూ కింద రూ.124.92 కోట్లు చెల్లించనుంది. బీసీఐపీఎల్ కంపెనీ తుముకూరు వద్ద ఉన్న తన ప్లాంటులో ఏటా 18,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏసీ/డీసీ మోటార్లు, ఆల్టర్నేటర్లు, పంపులు, గృహోపయోగ పరికరాలు, విద్యుత్ వాహనాలకు అవసరమయ్యే ఎలక్ట్రికల్ లామినేషన్లు, అల్యూమినియం డై క్యాస్ట్ రోటార్లు తయారు చేస్తోంది. ఈ కొనుగోలుతో దక్షిణ భారతదేశం అంతా కార్యకలాపాలు విస్తరించవచ్చని పీఈఎల్ భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ	
హైదరాబాద్	410
12వ తేదీ	
చిత్తూరు	483
గోదావరి	433
విజయవాడ	433
విశాఖపట్నం	450
వరంగల్	412

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112
వరంగల్	112
కరీంనగర్	112
మహబూబ్‌నగర్	112
కర్నూలు	112
విశాఖపట్నం	103
గోదావరి	106
విజయవాడ	106
గుంటూరు	111
ఒంగోలు	111
చిత్తూరు	123

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

» ఏసీబీ కోర్టులో మెమో, చార్జిషీటు దాఖలు

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్రప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం పాదయాత్ర ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

ఎలనాగకు సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం

న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అనువాదకుడు ఎలనాగ(డా. సురేంద్ర నాగరాజు)కు 2023 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. పవన్ కె వర్మ గాలిబ్ ద మాన్, ద టైమ్స్ పేరుతో రచించిన ఆంగ్ల పుస్తకాన్ని గాలిబ్ నాటి కాలం పేరుతో అనువదించినందుకు న్యాయనిర్ణేతల బృందం ఆయన్ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామానికి చెందిన పిల్లల వైద్యుడు అయిన డా. సురేంద్ర ఎన్నో గ్రంథాలను తెలుగు నుంచి ఇంగ్లీషుకు, ఇంగ్లీషు నుంచి తెలుగుకు అనువదించారు. వచనంలో, పద్యంలో పలు కవితా సంపుటులు వెలువరించారు. భాషా గ్రంథాలు కూడా రచించారు.

ఆరు గ్యారెంటీలకు నిధులెలా తెస్తారు?

» సర్కారును నిలదీసిన బీజేపీ ఎమ్మెల్యే శంకర్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు ఎలా సమకూర్చుకుంటారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో స్పష్టత ఇవ్వాలన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఈనెల 17వ తేదీ నాటికి వంద రోజులు పూర్తవుతుందని, తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయకపోతే ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడగబోమని నాడు రేవంత్ ప్రకటించారని గుర్తుచేశారు. ఎంపీ ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి ఆరు గ్యారెంటీలను వాయిదా వేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లకు సింహభాగం నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఖర్చు చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని.. అయితే ఇందులో రూ.4.50 లక్షలు కేంద్ర పథకాల సహకారంతో వస్తున్న నిధులేనని ప్రకటనలో వివరించారు.

పనులు ఇప్పిస్తానంటూ భగీరథ ఏఈ వసూళ్లు

కీసర, మార్చి11: పనులు ఇప్పిస్తానని చెప్పి ప్రైవేట్ కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండల మిషన్ భగీరథ ఏఈ రాహుల్‌ను పోలీసులు పట్టుకున్నారు. దాదాపు రూ.15 కోట్ల వరకు వసూలు చేసిన రాహుల్ 8 నెలలుగా పరారీలో ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సోమవారం రాహుల్ దేశం విడిచి పారిపోతుండగా ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారని తెలుసుకొన్న బాధితులు ఒక్కొక్కరిగా కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తున్నారు. కాగా రాహుల్ భార్య విద్యుత్ శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తున్నారని... ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ ఆటలకు రాహుల్ బానిసగా మారినట్టు బాధితులు చెబుతున్నారు.

అమ్మకానికి సిద్ధంగా హెచ్‌ఎండీఏ ప్లాట్లు

» ఇన్ముల్ నర్వాలో 95 ఎకరాలకు వచ్చిన ఫైనల్ లేఅవుట్

» మరో మూడుచోట్ల 546 ఎకరాల్లో లేఅవుట్లకు సన్నాహాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ తీసుకొచ్చిన తర్వాత హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన తొలి లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకానికి సిద్ధమయ్యాయి. హైదరాబాద్ మహానగర శివారులో ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలోని కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వాలో 95.25 ఎకరాలను, కందుకూరు మండలంలోని 83 ఎకరాల్లో లేఅవుట్లను హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేస్తోంది. ఇన్ముల్ నర్వాలోని లేఅవుట్‌ను ఇటీవల హెచ్‌ఎండీఏ ఇంజనీరింగ్ అధికారులు మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడంతో ఫైనల్ లేఅవుట్ కూడా వచ్చింది. కేవలం లేమూరు లేఅవుట్ మాత్రమే ఫైనల్ లేఅవుట్ పెండింగ్‌లో ఉంది. ఓవైపు రైతులకు చెందాల్సిన వాటాను అప్పగించడంతోపాటు ఇతర ప్లాట్లను విక్రయించడానికి హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది. ఈ రెండు లేఅవుట్లలో హెచ్‌ఎండీఏకు వాటాగా వచ్చే స్థలాలను విక్రయించడం ద్వారా సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల మేర ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. ఇదే తరహాలో శివారులోని మరో మూడు ప్రాంతాల్లో మొత్తంగా 546 ఎకరాలను రైతుల నుంచి సేకరించి లేఅవుట్లను అభివృద్ధి చేయడానికి హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం భూసమీకరణ పథకంలో భాగంగా.. ఉప్పల్ మండలంలోని ఉప్పల్ భగాయత్ గ్రామంలో హెచ్‌ఎండీఏ 733.08 ఎకరాలను సేకరించింది. అందులో కొన్ని భూములను వాటర్ బోర్డుకు, మెట్రో రైలుకు కేటాయించగా.. మిగతా 413.13 ఎకరాల్లో ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3 లేఅవుట్‌లను అభివృద్ధి చేశారు. భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించగా, హెచ్‌ఎండీఏ వాటాగా వచ్చిన స్థలాలను విక్రయిస్తే.. రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. దీంతో ఇదే తరహాలో ల్యాండ్ పూలింగ్‌ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు భూసమీకరణ పథకం-2017 తీసుకొచ్చారు. ఇందులో భాగంగా నగర శివారులోని ఐదు ప్రాంతాల్లో రైతుల నుంచి 725 ఎకరాలను సేకరించి లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నారు. ఇన్ముల్ నర్వాలో ఫైనల్ లేఅవుట్‌కు కూడా హెచ్‌ఎండీఏ అనుమతులిచ్చింది. లేమూర్‌లో ఫైనల్ లేఅవుట్ పెండింగ్‌లో ఉంది. మరోవైపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలో 129 ఎకరాల్లో, కీసర మండలం బోగారంలో 133 ఎకరాల్లో, యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ రెవెన్యూ పరిధిలోని 284 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి చేయడానికి రైతులు అంగీకరించారు. దాంతో హెచ్‌ఎండీఏ ఫామ్-1 నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ మూడు చోట్ల దాదాపు 546 ఎకరాల్లో లేఅవుట్లను అభివృద్ధి చేయడానికి హెచ్‌ఎండీఏ ప్రణాళికలు రూపొందిస్తోంది.

'ఇన్‌శాట్-3డీఎస్' సేవలు మొదలు

» భూమిని ఫొటోలు తీసి పంపిన ఉపగ్రహం

సూళ్లూరుపేట, మార్చి 11: భూమి, సముద్ర ఉపరితల అధ్యయనం కోసం ఇస్రో గత నెలలో ప్రయోగించిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహం తన సేవలను ప్రారంభించింది. ఈ శాటిలైట్‌లో అమర్చిన ఆరు చానల్ ఇమేజర్స్, 19 చానల్ సౌండర్స్ పేలోడ్ల సాయంతో ఈ నెల 7న తొలిసారిగా భూమి చాయాచిత్రాలను తీసి పంపింది. ఆ ఫొటోలను ఇస్రో సోమవారం తన వెబ్‌సైట్‌లో విడుదల చేసింది. సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఫిబ్రవరి 17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ద్వారా 2,275 కిలోల ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఇస్రో విజయవంతంగా చేరవేసింది. అనంతరం దీనిలో నింపిన ఇంధనాన్ని మండిస్తూ దశలవారీగా ఉపగ్రహాన్ని జియో ఆర్బిట్‌లోకి చేర్చింది. అప్పటినుంచి ఆర్బిట్‌లో తిరుగుతున్న ఇన్‌శాట్-3డీఎస్ తన సేవలను ప్రారంభించింది. అందులోని పేలోడ్ల సాయంతో భూ ఉపరితలంపై కలిగే వాతావరణ మార్పులతో కూడిన చిత్రాలను స్పష్టంగా తీసి కర్ణాటక హసన్‌లోని ఇస్రో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ సెంటర్‌కు పంపింది.

నేటి నుంచే రంజాన్


రంజాన్‌కు ముస్తాబైన మక్కా మసీద్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో

ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.


జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..

ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు

» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?

» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం

» హార్డ్ డిస్కుల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు

» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా

» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?

» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్కులను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్కులను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్‌కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి

» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న

అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ

» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, మాజీ ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక... బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు

» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.




ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల, కొండా సురేఖ; సభకు హాజరైన జనం

మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ ఖాళీ!

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నా. బీఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితేరా. మీ అయ్య చార్లెస్ శోభరాజేరా. రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో పరువు తీసింర్రా" అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. హరీశ్‌రావు దూలం లెక్క పెరిగిండు కానీ దూడకు ఉన్న బుద్ధి కూడా లేదంటూ విమర్శించారు. బిల్లా రంగాలు తోడు దొంగలుగా మారి కాళేశ్వరాన్ని కూల్చేశారని, మేడిగడ్డ మేడిపండైందని, అన్నారం పగిలిందని, సుందిళ్ల సంకనాకిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ అని ప్రాజెక్టులు కడితే సీతారామ అని పేరు మార్చి, కోట్లు కొల్లగొట్టి, ఖమ్మం జిల్లాకు తాగడానికి కూడా నీళ్లు లేని పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని, ఇద్దరూ ఒక్కటై కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అందుకే, బీజేపీ తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తే ఆ తొమ్మిది స్థానాల్లో బీఆర్ఎస్ ఇంతవరకు అభ్యర్థులను ప్రకటించలేదని ప్రస్తావించారు. బీఆర్ఎస్ నాలుగు చోట్ల అభ్యర్థులను ప్రకటిస్తే ఆ నాలుగు చోట్ల బీజేపీ వాళ్లు ఇంతవరకు అభ్యర్థులను ప్రకటించలేదన్నారు. పరస్పరం పోటీ లేకుండా అభ్యర్థులను ప్రకటిస్తున్న రెండు పార్టీల తీరే కాంగ్రెస్‌ను ఓడించేందుకు వీళ్లిద్దరూ కుమ్మక్కయ్యారనడానికి నిదర్శనమని చెప్పారు. మీ మధ్య పొత్తు లేకుంటే ఖమ్మంలో ఇంకా ఎందుకు నామా నాగేశ్వర్‌రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయలేదని, మహబూబాబాద్‌లో మాలోతు కవితను, కీలకమైన మెదక్‌లో అభ్యర్థిని ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. నిజామాబాద్‌లో కేసీఆర్ కూతురికి టికెటిస్తే ఓటర్లు బండకేసి కొడతారని అనుమానం వచ్చిందా? అన్నారు. రెండు పార్టీలూ కలిసి కనిపిస్తే తెలంగాణ ప్రజలు చెప్పుతో కొడతారన్నారు. చీకట్లో ఒప్పందం చేసుకుని మోదీ కేసీఆర్‌లు అలాయ్ బలాయ్ చేసుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీపై కలిసి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలో పథకాలు స్పష్టంగా అమలు చేస్తున్న తరుణంలో 14 సీట్లలో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ రోజుకోసారి అంటున్నారని, ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో ఎలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే చాలామంది రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గత పదేళ్లలో ముఖ్యమంత్రిని కలిసే భాగ్యం కలగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రులు, ముఖ్యమంత్రి సహా అందరం అందరికీ అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఐదేళ్లు కాపాడే బాధ్యత తమదేనని తనను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని ప్రస్తావించారు. తాను అనుకుని గేట్లు తెరిస్తే కేసీఆర్ కుటుంబం తప్ప ఆ పార్టీలో ఎవరూ మిగలరని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇందిరమ్మ రాజ్యానికి అండగా నిలబడతారని చెప్పారు.



సభావేదికపై భట్టి, రేవంత్ మాటామంతీ

తాము రాజనీతితో ముందుకు వెళ్లాలని అనుకుంటున్నామని, అనవసరంగా తమతో గోక్కోవద్దని, గోక్కున్నవారు ఎవరూ బాగు పడలేదని రేవంత్‌రెడ్డి హితవు చెప్పారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎక్కడుందని అన్నారని, నిజానికి కాంగ్రెస్‌కు కార్యకర్తలే వేయి ఏనుగుల బలమని సీఎం వ్యాఖ్యానించారు. కార్యకర్తలకు ఎవరు అడ్డం వచ్చినా పండబెట్టి తొక్కే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే హామీ ఇచ్చిన పథకాలు అమలు చేస్తున్నామని, 30 వేల ఉద్యోగాలు అందించామని ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమానికి అరవై ఏళ్ల క్రితమే ఊపిరి పోసింది ఖమ్మం జిల్లా అని రేవంత్ కొనియాడారు. మాట తప్పని సోనియమ్మ తెలంగాణ బిడ్డల ఆకాంక్షను నెరవేర్చారని, చైతన్యం కలిగిన ఖమ్మం ప్రజలు మూడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టం కట్టారని ప్రశంసించారు. అందుకే జిల్లాకు మూడు మంత్రి పదవులు, ఒక రాజ్యసభ పదవి వరించాయని ప్రస్తావించారు. మన్మోహన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన బలరాంనాయక్‌ను మహబూబాబాద్ ఎంపీగా లక్షన్నర మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ మీదా రేవంత్ విరుచుకుపడ్డారు. "మీ జిల్లాలో ఒక చప్రాసి ఉండు... ఒంటికన్ను శివరాసన్ ఏడున్నాడు? బాగా నీలిగిండు. మా కార్యకర్తలపై అనేక కేసులు పెట్టించిండు" అన్నారు.

ఇందిరమ్మ ఇల్లులేని ఊళ్లో ఓట్లడగం

గత పదేళ్ల పాలనలో కేసీఆర్, మోదీలు పేదలకు ఇళ్లిస్తామని చెప్పి మోసం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. డబుల్ బెడ్రూం పథకం కింద కేసీఆర్ ఇళ్లు కట్టించిన ఊళ్లలో, పీఎంఏవై పథకం కింద మోదీ ఇళ్లు కట్టించిన ఊళ్లలో తాము ఓట్లు అడగబోమని, అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన గ్రామాల్లో ఆ రెండు పార్టీల వారు ఓట్లు అడక్కుండా ఉండాలని రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. ఐదో గ్యారెంటీ రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు పథకానికి సోమవారం భద్రాచలంలో రేవంత్ శ్రీకారం చుట్టారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్కలు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రేవంత్ మాట్లాడుతూ, పేదలకు ఇల్లు అనేది ఆత్మగౌరవంతో కూడుకున్నదని చెప్పారు. అందుకే, తమ ప్రభుత్వం పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద రూ.22,500 కోట్లతో నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల హక్కు పత్రాలు కూడా ఆడబిడ్డల పేరుతోనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇల్లు లేని పేదలకు సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తామని అన్నారు. లబ్ధిదారులు ఎస్సీ, ఎస్టీలయితే రూ.6 లక్షలు ఇస్తామని చెప్పారు. గత పదేళ్లలో డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ ఓట్ల వ్యాపారం చేశారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్లపై హేళనగా మాట్లాడారని ప్రస్తావించారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టుకుంటే కూతురు, అల్లుడొస్తే ఇబ్బంది ఉండదు అంటూ కట్టు కథలు చెప్పి మోసం చేసి గెలిచారన్నారు. పేదలకు మాత్రం ఇళ్లు ఇవ్వలేదన్నారు. అందుకే, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని బొందపెట్టి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా ప్రజలు కేసీఆర్‌ను ఎప్పుడూ నమ్మలేదన్నారు. ఆయన్ని దూరంగానే పెట్టారని ప్రస్తావించారు. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కో సీటు మాత్రమే వచ్చిందన్నారు. ఏపీలో ఉన్న ఐదు గ్రామాల విలీనం సమస్యతో పాటు గోదావరి వరద వస్తే భద్రాచలం పట్టణంలోకి వరద వస్తున్న సమస్యను, ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని సభాముఖంగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం ప్రకటించామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల వ్యవధిలోనే రూ.500 సిలిండర్ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. పేదలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు అందించామని, ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి చూపిస్తామని చెప్పారు. కేసీఆర్, మోదీలా అబద్ధాల హామీలకే పరిమితం కాబోమని, వీటికోసం బడ్జెట్లో నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. 2022 నాటికి పేదలందరికీ ఇల్లు ఇస్తామని చెప్పి బీజేపీ మోసం చేసిందన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని హామీ ఇచ్చి అప్పుల్లోకి నెట్టిన ఘనత కూడా మోదీదేనని వ్యాఖ్యానించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని మోదీ నెరవేర్చి ఉంటే పదేళ్లలో రాష్ట్రానికి రూ.70 లక్షల ఉద్యోగాలు వచ్చి ఉండేవన్నారు. సీఎం, సహచర మంత్రులు కలిసి లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున చెక్కుతో ఇళ్ల మంజూరు హక్కు పత్రాలు అందజేశారు.

సంపదను పెంచుతాం.. పేదలకు పంచుతాం: భట్టి

ప్రతీ పేదవాడికి ఇల్లు అందించాలన్న లక్ష్యంతో రామయ్య సాక్షిగా సోమవారం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సందర్భం స్వర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాదీవెన సభలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు ప్రభుత్వానికి భారం కాబోతోందని వ్యాఖ్యానించారు. సంపదను పెంచి పేదలకు పంచుతామనీ ఎన్నికల ముందే చెప్పామని అది తప్పకుండా పాటిస్తామని ప్రకటించారు.

గృహ నిర్మాణానికి
రూ.7,740 కోట్లు
అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఉప ముఖ్యమంత్రి భట్టి



భద్రాచలం, మార్చి 11: రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7,740 కోట్లు కేటాయించి, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, భద్రాచల రామయ్య ఆశీస్సులతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించామని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. సోమవారం భద్రాచలంలో జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. నిధులు, నీళ్లు నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు ఒక్క హామీనీ అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని చెప్పారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి తీరతామన్నారు. భద్రాచలం అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు.

సీతారామ నిర్మిస్తే సస్యశ్యామలం: తుమ్మల



గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తే గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. భద్రాద్రి రాముని సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమని, రాముని ఆశీస్సులతో ఈ పథకం విజయవంతమవుతుందని ఆకాంక్షించారు. మోడికుంట, పాలెంవాగు ప్రాజెక్టులు, ప్రగళ్లపల్లి ఎత్తిపోతలకు నిధులు కేటాయించడంతోపాటు భద్రాచలం కరకట్టను పూర్తి చేస్తామని తెలిపారు. కరకట్ట పూర్తయితే వరద నీరు పట్టణంలోకి రాదని, శాశ్వత పరిష్కారం ఉంటుందని చెప్పారు.

పదేళ్లలో వాగ్దానాలు తప్ప అభివృద్ధి లేదు: పొంగులేటి



పోరాడి సాధించుకున్న తెలంగాణలో గత ప్రభుత్వం పదేళ్లలో వాగ్దానాలు చేయడం తప్ప ఏ హామీనీ నెరవేర్చలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసంరెడ్డి ఆరోపించారు. మూడు నెలల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల కష్టాలు తీరబోతున్నాయని చెప్పారు. కేసీఆర్ గతంలో భద్రాచలానికి రూ.100 కోట్లు నిదులిస్తామని చెప్పి, రాముణ్ని కూడా మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2.90 లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పి 95 వేల ఇళ్లే పూర్తి చేసిందన్నారు. మిగిలిన ఇళ్లను కూడా ఈ ప్రభుత్వం నిర్మించి, పేదలకు అందిస్తుందని ప్రకటించారు.

పేదల కోసమే పని చేస్తాం: కోమటిరెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసమే పని చేస్తుందని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్, ఆయన కొడుకు, కూతురు ఫాంహౌస్‌లు కట్టుకున్నారు తప్ప, పేదలకు ఇళ్లు నిర్మించలేదని మండిపడ్డారు. గత గవర్నరు కేసీఆర్‌ను కాళేశ్వరరావు అన్నారని, ఇప్పుడు బీఆర్ఎస్ కాళేశ్వరం అవుతుందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఇది పేదల ప్రభుత్వం: సీతక్క



కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని, పేదల కోసం పని చేస్తుందని మంత్రి సీతక్క చెప్పారు. పేదల కళ్లలో ఆనందం చూసేందుకే ఆరు గ్యారెంటీలు ప్రకటించి, అమలు చేస్తున్నామని తెలిపారు. అన్ని హామీలనూ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని భద్రాచలం నుంచి ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చెప్పారు.

భద్రాద్రి అభివృద్ధికి ఎంత స్థలం కావాలో తేల్చండి

- నెల రోజుల్లో కలెక్టర్ నివేదిక ఇవ్వాలి
- నీటిపారుదల, దేవాదాయశాఖల అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

భద్రాచలం, మార్చి 11: "దక్షిణ అయోధ్య భద్రాచల పుణ్యక్షేత్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంత స్థలం సేకరించాల్సి ఉంటుందో తేల్చండి" అంటూ దేవాదాయశాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి భద్రాచలంలో నీటిపారుదల శాఖ, దేవాదాయ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలంలో ప్రభుత్వ స్థలం ఎంత ఉందో పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. ఆలయాభివృద్ధికి సుమారు 48 ఇళ్లను తొలిగించాల్సి ఉంటుందని అధికారులు సీఎంకు చెప్పారు. సంబంధిత ఇళ్ల యజమానులతో సుహృద్భావ వాతావరణంలో మాట్లాడాలని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చూస్తుందనే భరోసా ఇవ్వాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఇళ్లను కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించి, ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, ఈ విధానాన్ని లాటరీ పద్ధతిలో నిర్వహించాలని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, భద్రాద్రి-కొత్తగూడెం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిలను సీఎం ఆదేశించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన నివేదికను నెల రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్‌కు సూచించారు. కాగా.. సీతమ్మసాగర్ ప్రాజెక్టు, భద్రాద్రి కరకట్ట మిగులు పనులను నాణ్యతతో సత్వరమే పూర్తి చేయాలని, జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

15న విశాఖకు రేవంత్‌రెడ్డి

కూర్మన్నపాలెం/ఉక్కునగరం (విశాఖపట్నం), మార్చి 11: విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను నిరసిస్తూ మూడేళ్లుగా కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలపడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 15వ తేదీన కూర్మన్నపాలెం విచ్చేస్తున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జే.అయోధ్యరామ్ తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పాల్గొన్న బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తమకు మద్దతు పలికేందుకు పక్క రాష్ట్ర సీఎం రావడం శుభపరిణామమన్నారు. కాగా, ఉక్కు టౌన్‌షిప్‌లోని తృష్ణా మైదానంలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, పలువురు కేంద్ర మాజీ మంత్రులు పాల్గొంటారని ఆ పార్టీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు ఒక ప్రకటనలో తెలిపారు.




యాదాద్రిలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు; భద్రాచలంలో ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

యాదాద్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు హాజరు.. మంత్రులు భట్టి, సురేఖ, ఉత్తమ్, కోమటిరెడ్డి కూడా

యాదాద్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి వార్షిక తిరు కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరంతా హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రితో పాటు ఉదయమే వచ్చారు. మంత్రి కొండా సురేఖ రోడ్డు మార్గంలో యాదగిరిగుట్ట చేరుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి యాదగిరిగుట్టకు వచ్చిన రేవంత్‌రెడ్డికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సీఎం, మంత్రులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భాలయంలో సీఎం, ఆయన భార్య గీతారెడ్డి, మంత్రులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సీఎం దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరుఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ప్రధానాలయంలో అర్చకులు, వేద పండితులు స్వామివారి ఆశీర్వచనాలు నిర్వహించగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అద్దాల మండపంలో సీఎంకు స్వామివారి చిత్రపటం జ్ఞాపికను అందజేశారు. ప్రధానాలయ విమాన గోపురం స్వర్ణతాపడం పనులపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. స్వర్ణ తాపడానికి 65 కిలోల బంగారం అవసరమని, ప్రస్తుతం 10 కిలోల బంగారం, 20 కిలోలకు సరిపడా నగదు ఉందని ఈవో రామకృష్ణారావు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో సమీక్ష నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. సీఎం కార్యక్రమానికి వచ్చిన స్థానిక కాంగ్రెస్ నేతలను అనుమతించక పోవడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఎం యాదాద్రి టూర్ గంటన్నరలో ముగిసింది.

భద్రాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు

సీఎం హోదాలో రేవంత్ సోమవారం తొలిసారి భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. యాదగిరిగుట్టలో దర్శనం అనంతరం రేవంత్; భట్టి, పలువురు మంత్రులు హెలికాప్టర్‌లో నేరుగా భద్రాచలం వచ్చారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి, అధికారులు, ఎమ్మెల్యేలు సీఎంకు స్వాగతం పలికారు. సీఎం, మంత్రులు నేరుగా సీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అర్చకులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఆ తర్వాత రేవంత్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభకు వెళ్లిపోయారు.

ఇక వడ్డీలేని రుణం!

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌హెచ్‌జీ మహిళల్లో ఎవరైనా మరణిస్తే గ్రూప్ నుంచి వారు తీసుకున్న రుణం మాఫీ అవుతుంది. ఎస్‌హెచ్‌జీల్లోని 63.86 లక్షల మంది మహిళలకు బీమా సౌకర్యం వర్తించనుంది. ప్రత్యేక పథకంలో భాగంగా గ్రూపుల్లోని మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించడంతోపాటు వారికి ఉపాధి కల్పన దిశగా చర్యలు చేపడతారు. మహాలక్ష్మి పేరిట రూ.2500 ఆర్థిక చేయూతను కూడా మహిళాశక్తి పథకం పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ మహిళాశక్తి పథకాన్ని మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షమంది మహిళలతో నిర్వహించే సభ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. కాగా.. వడ్డీలేని రుణాల పథకం అమలు చేయకపోవడంతో రూ.3,750 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఈ మొత్తాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు చెల్లించనుంది. మహిళలు ఇబ్బంది పడకుండా ఉండేలా.. ప్రతి ఆరు నెలలకోసారి వడ్డీ సొమ్ము చెల్లించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. వడ్డీలేని రుణాల అందజేతలో భాగంగా తొలి ఏడాది ఐదువేల గ్రామాలకు రూ.5 వేల కోట్ల రుణాలు అందించనున్నట్లు సర్కారు పేర్కొంది. మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి ఉపాధి కల్పించేలా సంబంధిత శాఖ ద్వారా దృష్టి సారించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారుచేసే ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్ ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో 47% మహిళలకు దక్కాయి: సర్కారు

తెలంగాణలోని మహిళలకు అన్ని రంగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33% కోటా దక్కాలని బీఆర్ఎస్ ఆందోళన చేస్తుండగా.. అంతకుమించి ఉద్యోగావకాశాలు వచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. మూడునెలల్లో 28,942 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించగా అందులో మహిళలకు 47% వరకు ఉద్యోగాలు దక్కినట్లు తెలిపింది. 28,942 పోస్టుల్లో పురుషులు 53%(15,371 మంది) ఎంపికైతే.. మహిళలు 47%(13,571) దక్కించుకున్నారు.


మంత్రి ఎస్కార్ట్ వాహనం ఢీకొని ఏఎస్పీకి గాయాలు

భద్రాచలం, మార్చి 11: భద్రాచలంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఓ మంత్రి ఎస్కార్ట్ వాహనం ఢీకొని భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ గాయపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవానికి వస్తున్న ఓ మంత్రి కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం అక్కడే విధుల్లో ఉన్న పరితోశ్‌ను ఢీకొనడంతో ఆయన కిందపడిపోయారు. వెంటనే పోలీసు సిబ్బంది పరితోశ్‌ను భద్రాచలంలోని ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

భట్టి, సురేఖ పీటలపై వివాదం!

- చిన్న పీటలేయడంపై బీఆర్ఎస్ అభ్యంతరం
- రేవంత్ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్
- అట్రాసిటీ కేసు పెట్టాలన్న బాల్క సుమన్
- కాంగ్రెస్‌కు దళితులంటే విద్వేషం: ఆర్ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యాదాద్రిలో సోమవారం పూజల అనంతరం చివర్లో ఆశీర్వచనం సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అవమానం బీఆర్ఎస్, బీఎస్పీలు విమర్శించాయి. సీఎం దంపతులకు ఇరువైపులా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు పెద్ద పీటలపై కూర్చున్నారు. ఇదే వరుసలో ఇటు చివరన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అటు చివర మంత్రి కొండా సురేఖలు చిన్న పీటలపై కూర్చున్నారు. సీఎం, ఇతర మంత్రుల పీటల కన్నా వీరిద్దరి పీటలు చిన్నవిగా ఉండటంతో, చూసేవాళ్లకు వీరిద్దరూ కింద కూర్చున్నట్టుగా కన్పించింది. ఈ అంశంపై బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత స్పందిస్తూ దళితుడైన డిప్యూటీ సీఎంను, బీసీ మంత్రిని చిన్న పీటల మీద కూర్చోబెట్టడం ఎబ్బెట్టుగా ఉందన్నారు. వారిద్దరినీ సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారని వ్యాఖ్యానించారు. ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి సామాజిక కోణం బయట పడుతోందన్నారు. ఈ సంఘటనపై సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ వెంటనే స్పందించి అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భట్టికి జరిగిన అవమానంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించాలని డిమాండ్ చేశారు. దళితుడైన భట్టిని దేవుడి సాక్షిగా కాంగ్రెస్ అవమానించిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ నిజస్వరూపం బయట పడిందని ట్విటర్ వేదికగా వ్యాఖ్యానించారు. భట్టికి జరిగిన అవమానాన్ని యావత్ దళిత జాతికి జరిగిన అవమానంగా బీఎస్పీ భావిస్తోందదన్నారు. తక్షణమే దళిత జాతికి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల ఓట్ల కోసం కాంగ్రెస్ కపట ప్రేమను ఒలకబోస్తోందని, దళితుల పట్ల నిజంగా ప్రేమ లేదని, విద్వేషం ఉందని ఆరోపించారు.



అందరికీ సమాన గౌరవం

భట్టికి అగౌరవం అవాస్తవమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. దేవాలయంలో అందరికీ సమాన గౌరవం ఉంటుందని, వారికి కేటాయించిన పీటలు హెచ్చుతగ్గులుగా ఉండడాన్ని లోపంగా చూపిస్తూ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. మంత్రులందరికీ సమాన గౌరవం ఇచ్చామని, ఎలాంటి వివక్ష పాటించలేదని ఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి

రూ.85 వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టులు

- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని
- సికింద్రాబాద్-విశాఖ రెండో వందే భారత్ ప్రారంభం
- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ వెల్లడి



హైదరాబాద్ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రూ.85వేల కోట్లతో చేపట్టిన వివిధ రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపనలు, జాతికి అంకితం చేయనున్నారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. సోమవారం రైల్ నిలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు జోన్ పరిధిలో నడిచే మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ప్రధాని ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే జోన్ పరిధిలో 193 వన్‌స్టేషన్ వన్ ప్రొడక్ట్ దుకాణాలు, 9 పీఎం గతిశక్తి కార్గో టెర్మినల్స్, 11 గూడ్స్‌షెడ్‌లు, 2 జన ఔషధి కేంద్రాలు, 3రైల్ కోచ్ రెస్టారెంట్లు, 14 డబుల్ లైన్, థర్డ్‌లైన్, బైపాస్ లైన్లను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో స్థానిక ఉత్పత్తులకు ఆదరణ కల్పించడమే లక్ష్యంగా వన్‌స్టాఫ్ వన్ ప్రొడక్ట్ (ఓఎస్ఓపీ) స్కీమ్‌ను రైల్వే శాఖ చేపట్టిందని, ఇందులో భాగంగా 193 దుకాణాలను జోన్ పరిధిలోని వివిధ స్టేషన్లలో ఏర్పాటు చేసినట్లు జీఎం తెలిపారు. అలాగే ప్రధానమంత్రి గతి శక్తి పాలసీలో భాగంగా జోన్ పరిధిలో తుమ్మలచెరువు, జగ్గయ్యపేట, నక్కన్నదొడ్డి, తిప్పర్తి, సుల్తానాబాద్, రామగుండం, సులేహల్లి, పండాపానీ, దినగాన్ ప్రాంతాల్లో కార్గో టెర్మినల్స్‌ను ప్రవేశపెడుతున్నామన్నారు. రైల్వే ప్రయాణికుల కోసం రైల్వేశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పలు స్టేషన్లలో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటిలో జోన్ పరిధిలో సికింద్రాబాద్, తిరుపతి స్టేషన్లలో ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాలతోపాటు వినియోగించని రైలు బోగీలను ఆధునికీకరించి కాచిగూడ, నెక్లెస్‌రోడ్, గుంటూరులో ఏర్పాటు చేసిన రైల్‌కోచ్ రెస్టారెంట్లను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారని జీఎం తెలిపారు.

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు ఊరట

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో ఐదేళ్ల జైలుశిక్ష పడిన ఏపీకి చెందవిన మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు తెలంగాణ హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆమెకు సీబీఐ కోర్టు విధించిన జైలుశిక్షను సస్పెండ్ చేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తాజాగా మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. ఈ జైలుశిక్షపై హైకోర్టు 2022లోనే స్టే విధించింది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీచేస్తున్నానని.. ట్రయల్ కోర్టు విధించిన జైలుశిక్షను సస్పెండ్ చేయాలని.. లేనిపక్షంలో ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 ప్రకారం తనపై అనర్హత వేటు పడుతుందని గీత మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. జైలుశిక్షపై గతంలోనే స్టే విధించినందున పిటిషనర్ విజ్ఞప్తి మేరకు ట్రయల్ కోర్టు విధించిన శిక్షను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రధాన పిటిషన్లపై విచారణను ఈ నెల 15కు వాయిదా వేసింది.

తెలంగాణ పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ ఏర్పాటు

- సూచనలు ఇచ్చేందుకు 15 మంది నిపుణుల కమిటీ

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమస్యలను అంచనా వేసి తగు నిర్ణయాలు తీసుకునేందుకు తెలంగాణ పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ త్రిసభ్య కమిటీని కేంద్రం నియమించింది. కమిటీ చైర్మన్‌గా గౌరవరం సబిత, సభ్యుడిగా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి స్వర్గం శ్రీనివాస్, సభ్య కార్యదర్శిగా రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ప్రత్యేక కార్యదర్శిని నియమిస్తూ కేంద్రం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ కమిటీకి సూచనలు, సలహాలు అందించేందుకు 15 మంది సభ్యులతో కూడిన రాష్ట్రస్థాయి నిపుణుల అంచనా కమిటీని కూడా కేంద్రం ప్రకటించింది. దీనికి చైర్మన్‌గా ఎం.గోపాల్ రెడ్డిని నియమించారు.

మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ!

- వరంగల్ నుంచి కృష్ణ ప్రసాద్‌కు టికెట్
- నేడో, రేపో బీజేపీ రెండో జాబితా ప్రకటన
- నగేశ్, సైదిరెడ్డికి ఇవ్వొద్దంటూ వినతులు



న్యూఢిల్లీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి అమిత్ షాతో పాటు తెలంగాణ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ దీనికి హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించిన బీజేపీ.. మిగిలిన స్థానాలకు సంబంధించి కూడా కోర్ కమిటీ సమావేశాలు పూర్తయ్యాయి. తెలంగాణలో 17 పార్లమెంటు స్థానాలకు గాను తొలి జాబితాలో 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మరో 8 స్థానాలకు అభ్యర్థులు ఇప్పటికే ఖరారైనట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మహబూబాబాద్ నుంచి మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఖమ్మం నుంచి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్, నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఆదిలాబాద్ నుంచి నగేశ్ పేర్లు ఖరారయ్యాయి. ఇటు మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, వరంగల్ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి కృష్ణ ప్రసాద్ పేర్లు కూడా దాదాపుగా ఖరారైనట్టు తెలిసింది. మెదక్, పెద్దపల్లి విషయంలో కొంత స్పష్టత రావాల్సి ఉంది. మంగళ లేదా బుధవారం ప్రకటించే రెండో జాబితాలో ఆయా అభ్యర్థుల పేర్లు ఉండే అవకాశముంది.

ఆదిలాబాద్ లంబాడాలకే ఇవ్వాలి

ఆదిలాబాద్‌లో లంబాడా బంజారాలకు పార్లమెంటు ఎన్నికల్లో టికెట్ ఇస్తే గెలుస్తామని మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ అన్నారు. మాజీ ఎంపీ నగేశ్ బీజేపీలో చేరిక, లోక్‌సభ టికెట్ ఆయనకు ఇస్తారన్న ప్రచారం నేపథ్యంలో సోమవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, ఎంపీ లక్ష్మణ్‌ను ఆదిలాబాద్ నేతలు కలిశారు. జిల్లాలో ఉన్న పరిస్థితులను బంజారా నేతలు రమేశ్ రాథోడ్, రాథోడ్ బాపురావు వారికి వివరించారు. ఈ సందర్భంగా రమేశ్ రాథోడ్ మాట్లాడుతూ.. చాలా మంది నేతలు మోదీ పాలనను చూసి బీజేపీలో చేరుతున్నారని.. అయితే పార్టీలో మొదట్నుంచి పని చేస్తున్న వారికే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరామని చెప్పారు.

రాళ్ల దాడి చేయించిన వ్యక్తికి టికెట్ ఇవ్వొద్దు

ఆనాడు గిరిజనుల కోసం అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో గిరిజన భరోసా యాత్ర చేపడితే తమపై శానంపూడి సైదిరెడ్డి రాళ్ల దాడి, లాఠీచార్జీ చేయించాడని.. అతడికి ఎట్టి పరిస్థితుల్లో టికెట్ ఇవ్వొద్దని నల్లగొండ జిల్లా బీజేపీ నేతలు పలువురు పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. శానంపూడికి టికెట్ ఖరారైందన్న ప్రచారం నేపథ్యంలో ఆ జిల్లా పార్టీ నేతలు పలువురు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలివచ్చారు. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనేక అక్రమాలకు పాల్పడ్డ వ్యక్తిని పార్టీలో చేర్చుకోవడమే బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మోదీ 'మిషన్ సౌత్'!

15 నుంచి 5 రోజుల పాటు 5 రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటన

- 16న విశాఖపట్నం, జహీరాబాద్
- 17న గుంటూరు, మల్కాజిగిరి
- 19న నాగర్‌కర్నూలులో సభలు
- గుంటూరులో చంద్రబాబు, పవన్‌తో కలిసి ఒకే వేదికపై..



న్యూఢిల్లీ/హైదరాబాద్/అమరావతి, మార్చి 11: లోక్‌సభ ఎన్నికల్లో 400కిపైగా సీట్లలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ అందుకు కార్యాచరణ ప్రారంభించింది. ఎన్‌డీఏ కూటమిలోని పాత మిత్రులను తిరిగి చేర్చుకోవడంతో పాటు, వాటి సాయంతో దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేయాలని భావిస్తోంది. దక్షిణ భారతంలో ఒక్క కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో పెద్దగా బలం లేకపోవడం, విజయాలను రుచి చూడకపోవడంతో ఆ లోటును పూడ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ప్రధాని మోదీ ఈ నెల 15 నుంచి 19 వరకు ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో 5 రోజుల పాటు సుడిగాలిలా పర్యటించి ప్రజలకు చేరువకానున్నారు. ఇక్కడ విజయ పతాకాన్ని ఎగరవేసే బాధ్యతను స్వయంగా తీసుకున్నారు. 'మిషన్ సౌత్'లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పర్యటించి పలు బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఈ నెల 15న తమిళనాడులో అడుగిడడం ద్వారా మోదీ తన దక్షిణ భారత యాత్రను ప్రారంభించనున్నారు. ఒక రాష్ట్రంలో పర్యటన పూర్తి చేసి, మరో రాష్ట్రానికి వెళ్లాలన్న విధానం కాకుండా ఒకేరోజున పక్కపక్క రాష్ట్రాల్లో సభలు ఉండేలా ప్రణాళికను రూపొందించారు.


తమిళనాడు: 15న సేలంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. 16న కన్యాకుమారిలో జరిగే సభలో ప్రసంగిస్తారు. 18న కోయంబత్తూరులో జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలతో పొత్తులపైనా చర్చలు జరిపే అవకాశం ఉంది. ప్రస్తుతం కన్యాకుమారి నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న పి.రాధాకృష్ణన్‌కే మళ్లీ టికెట్ దక్కే అవకాశం ఉండడంతో ఆ స్థానాన్ని నిలుపుకోవడంపై మోదీ దృష్టి పెట్టారు.

కేరళ: 15న పాలక్కాడ్‌లో జరిగే రోడ్డు షోలో పాల్గొంటారు. 17న పథనంథిట్టలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

కర్ణాటక: దక్షిణాదిలో బీజేపీ విజయాలను సమకూర్చుతున్న కర్ణాటకపై మోదీ అత్యధిక శ్రద్ధ చూపిస్తున్నారు. నాలుగు రోజుల పాటు ఈ రాష్ట్రంలో పర్యటించనున్నారు. 15న కోలార్, 17న షిమోగా, 18న బీదర్, 19న ధార్వాడల్లో పర్యటించనున్నారు. షిమోగా.. మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్పకు గట్టి పట్టున్న ప్రాంతం కాగా, ధార్వాడ.. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నియోజకవర్గం కావడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్: తెలుగుదేశం, జనసేనతో బీజేపీ పొత్తు కుదిరిన తరువాత తొలిసారి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌కు రానుండడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. 16న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. 17న గుంటూరులో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లతో కలిసి బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. పదేళ్ల తరువాత ఆ ముగ్గురు అగ్రనాయకులు పాల్గొనే తొలి బహిరంగ సభ ఇదే కానుండటంతో మూడు పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

తెలంగాణ: విజయంపై ఎన్నో ఆశలు ఉన్న తెలంగాణపైనా మోదీ దృష్టి పెట్టారు. 16న జహీరాబాద్‌లో జరిగే రోడ్ షో, 17 మల్కాజిగిరిలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. 19న నాగర్ కర్నూల్‌లో జరిగే బహిరంగ సభతో తన యాత్రను ముగిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ విజయం సాధించడం ముఖ్యం కావడంతో ఏ అవకాశాన్ని కూడా వదులుకోకూడదని కమలనాథులు భావిస్తున్నారు.



నేడు రాష్ట్రానికి అమిత్‌షా

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం రాష్ట్రంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో పార్టీ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం, ఎల్బీ స్టేడియంలో మధ్యాహ్నం 2.30 గంటలకు పోలింగ్ బూత్ సమ్మేళనంలో పాల్గొంటారు. అనంతరం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌చార్జులతో ఐటీసీ కాకతీయలో సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, అమిత్ షా రెండున్నర మాసాల వ్యవధిలో రెండోసారి షా రాష్ట్రానికి వస్తున్నారు.

పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వహించాలి

- పరిశీలకులు అప్రమత్తంగా ఉండాలి
- ఈసీఐ ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్
- ఐఏఎస్, ఐపీఎస్‌లతో ప్రత్యేక సమావేశం

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కసరత్తు చేస్తోంది. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అన్ని రాష్ట్రాల ఎన్నికల పరిశీలకులతో ఈసీఐ ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా 2,150 మంది (900 మంది జనరల్ పరిశీలకులు, 450 మంది పోలీస్ పరిశీలకులు, 800 మంది వ్యయ పరిశీలకులు) ఐఏఎస్, ఐపీఎస్‌లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని, నియమ నిబంధనలను కచ్చితంగా అమలు పర్చాలని రాజీవ్ కుమార్ సూచించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ వారంలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పరిశీలకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. అన్ని రాష్ట్రాల్లో పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పరిశీలకుల వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అధికారులు తమకు కేటాయించిన నియోజకవర్గంలో మాత్రమే పర్యటించాలని పేర్కొన్నారు.స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రశాంత వాతారవణాన్ని నెలకొల్పాలని, ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా దేశవ్యాప్తంగా 96కోట్ల మంది ఓటర్లు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులు, అన్ని జిల్లాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

అభ్యర్థుల రెండో జాబితాపై కసరత్తు.. నేడు ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలలో తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈమేరకు ఐదు రాష్ట్రాలలోని పలు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. సోమవారం సాయంత్రం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్, అసోం, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని పలు నియోజకవర్గాలకు అభ్యర్థుల ఖరారుపై చర్చ జరిగింది. ఫైనల్ చేసిన అభ్యర్థుల జాబితాను మంగళవారం ప్రకటించే అవకాశం ఉంది. బుధవారం జరగనున్న ఎన్నికల కమిటీ భేటీలో తెలంగాణలోని పలు స్థానాలకు అభ్యర్థుల ఖరారుపై చర్చ జరగనుంది. అనంతరం చేవెళ్ల, సికింద్రాబాద్, మెదక్, పెద్దపల్లి తదితర స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది.

తెలంగాణ డిస్కమ్‌లకు 'సీ' గ్రేడ్

- దిగువ స్థాయిలోనే డిస్కమ్‌ల పరపతి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డిస్కమ్‌ల పరపతి ఇంకా నిరాశాజనక స్థాయిలోనే ఉంది. గతంలో మైనస్ 'సీ'గా ఉన్న గ్రేడ్.. కాస్త మాత్రమే మెరుగుపడి 'సీ' గ్రేడ్‌కు చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 12వ రేటింగ్స్‌ను సోమవారం విడుదల చేసిన కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది విడుదల చేసిన 11వ రేటింగ్స్‌లో దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)కు 10.8% రేటింగ్స్‌తో మైనస్ 'సీ' గ్రేడ్ రాగా, 12వ రేటింగ్స్‌లో 19.9 శాతంతో 'సీ' గ్రేడ్ దక్కింది. ఇక ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)కు 11వ రేటింగ్స్‌లో 6.6 శాతంతో మైనస్-సీ గ్రేడ్ రాగా, ఈసారి 17.9 శాతంతో 'సీ' గ్రేడ్ దక్కింది. కాగా, 2023-24లో దక్షిణ డిస్కమ్ ఆదాయానికి, అవసరాలకు మధ్య ఒక్కో యూనిట్‌కు రూ.1.08 అంతరంతో రూ.5962 కోట్ల లోటు ఉన్నట్లు గుర్తించగా, ఉత్తర డిస్కమ్‌లో యూనిట్‌కు రూ.1.19 అంతరంతో రూ.2723 కోట్ల లోటు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు జెన్‌కోల నుంచి కరెంట్ కొనుగోలు చేస్తున్నా సకాలంలో చెల్లింపులు చేయని కారణంగా.. తెలంగాణ డిస్కమ్‌లు బకాయిల జాబితాలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉన్నాయని కేంద్రం తెలిపింది. డిస్కమ్‌ల పరపతి మెరుగుపడాలంటే మీటర్ రీడింగ్‌లో కృత్రిమ మేధ ఆధారిత యంత్రాలను వినియోగించడంతోపాటు డిజిటల్ చెల్లింపులు మెరుగుపరచాలని కేంద్రం సూచించింది.

భట్టి దృష్టికి సింగరేణి ఉద్యోగాల స్థానికత సమస్య

- కరీంనగర్ నుంచి సిద్దిపేట జిల్లాలో కలిసిన మండలాలకు న్యాయం చేయాలన్న పొన్నం

హుస్నాబాద్, మార్చి 11: సింగరేణి ఉద్యోగాలకు సంబంధించిన స్థానికత అంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలు సింగరేణి స్థానికత కిందకు వస్తాయని, అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేట జిల్లాలో కలపడం వల్ల ఇవి హైదరాబాద్ జోన్‌లోకి వెళ్లడంతో సింగరేణి ఉద్యోగాలకు ఆయా మండలాల వారు స్థానికత కోల్పోయారని భట్టికి వివరించినట్టు చెప్పారు. దీంతో ఈ మండలాల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని డిప్యూటీ సీఎంకు చెప్పగా.. ఆయన సానుకూలంగా స్పందించి సింగరేణి సీఎండీతో మాట్లాడారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'కోటా' ఐఐటీ, మెడికల్ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 6వ, 7వ, 8వ, 9వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్ సిద్ధం చేసినట్లు కోటా పేజెస్ వెల్లడించింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్, అసైన్‌మెంట్స్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సప్ ద్వారా పొందవచ్చని తెలిపింది. మరింత సమాచారం కోసం IIT F, MED F అని 9849016661 నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ చేయవచ్చు.

చేవెళ్ల నుంచి కాసాని..!

తొలుత సిటింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరు.. ఆయన విముఖతతో జ్ఞానేశ్వర్‌కు చాన్స్

- నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డి!
- మెదక్ అభ్యర్థిగా ప్రతాప్ రెడ్డి
- చేవెళ్ల, నల్లగొండ బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ భేటీ



నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో సమావేశమైన కేసీఆర్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గతనెలలో లోక్‌సభ నియోజకవర్గాల వారిగా బీఆర్ఎస్ అధినాయకత్వం పార్టీ నేతలతో సమావేశాలు జరిపి.. పార్టీ తరఫున కొందరు అభ్యర్థుల పేర్లు వెల్లడించింది. అందులో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి తొలుత సిటింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరును ప్రకటించింది. అయినప్పటికీ.. ఆయన బీఆర్ఎస్ తరఫున పోటీకి విముఖత చూపిన నేపథ్యంలో.. ఆయనతో సంప్రదింపులు, బుజ్జగింపులు చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో చేవెళ్ల అభ్యర్థిపై పార్టీ అధిష్ఠానం తీవ్రస్థాయిలో కసరత్తు చేసింది. ఆ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను పోటీలో దించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం నందినగర్‌లోని తన నివాసంలో భేటీ అయ్యారు. దీనికి ఎంపీ రంజిత్‌రెడ్డి గైర్హాజరయ్యారు. కాగా రంజిత్‌రెడ్డితో మరో ప్రధాన పార్టీకి చెందిన నేతలు టచ్‌లో ఉన్నారని, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పలువురు ఆయనతో సంప్రదింపులు జరుపుతున్న కారణంగానే.. సమావేశానికి ఆయన రాలేదని తెలుస్తోంది. మరోవైపు.. మెదక్ నుంచి గజ్వేల్‌కు చెందిన బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డికి టికెట్ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పోటీకి అమిత్ రెడ్డి దూరం!

మొన్నటి వరకు నల్లగొండ నుంచి గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి పోటీ చేస్తారని భావించినప్పటికీ.. స్థానిక రాజకీయ పరిణామాల దృష్ట్యా.. ఆయన పోటీ చేసేందుకు ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశమైన కేసీఆర్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ముఖ్యనేతలతో చర్చలు జరిపారు. నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, తేరా చిన్నపరెడ్డి పేర్లు ప్రస్తావనకు రాగా.. కృష్ణారెడ్డికే అవకాశం దక్కనున్నట్లు సమాచారం. రెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది.

కరీంనగర్‌లో నేడు బీఆర్ఎస్ కదనభేరి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అందు లో భాగంగానే మంగళవారం కరీంనగర్‌లో కదనభేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది. ఇందులో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఉద్యమ సమయం నుంచి పార్టీ కార్యక్రమాలను కరీంనగర్‌లోని ఎస్.ఆర్.ఆర్ కాలేజీ మైదానం నుంచే ప్రారంభించాలన్న గులాబీ బాస్ సెంటిమెంట్‌కు అనుగుణంగా ఇక్కడ సభకు ఏర్పాట్లు చేసినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టాలని నిర్ణయించినట్లు బీఆర్ఎస్ వెల్లడించింది. పార్టీ శ్రేణులు భారీ ఎత్తున జనసమీకరణపై దృష్టి పెట్టాయి. ఏడు నియోజకవర్గాల నుంచి దాదాపు లక్ష మందిని తరలించేందుకు చూస్తున్నాయి.

కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చింది

- నీళ్లు, విద్యుత్తు కష్టాలు మొదలయ్యాయి
- ఉద్దెర మాటలతో అధికారంలోకి వచ్చింది: హరీశ్



సిద్దిపేట టౌన్/చిన్నకోడూరు/హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి, కరువును తెచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమ య్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు వ్యూహంపై చర్చించారు. అలాగే సిద్దిపేటలో రూ.5 లక్షలతో నిర్మించే ఏకలవ్య మిత్ర మండలి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమా ల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలని, ఇందుకోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఉద్దెర హామీలిచ్చిందని, రైతు బంధు, రైతు రుణమాఫీ, వరి పంటకు బోనస్ ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్య లక్ష్మి కింద రూ. 10 లక్షల పథకం అమలు చేస్తే, రాష్ట్రంలో ఏ ఒక్కరికైనా రూ. 10 లక్షలు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలకు రూ. 2500 ఇస్తామన్న మాట ఏమైందని, వృద్ధులకు డిసెంబరు నెల నుంచి రూ.4 వేల పెన్షన్ ఇస్తామని, నాలుగు నెలలైనా ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎండాకాలం కరువులోనూ పంట పండుతుందంటే అది కాళేశ్వరం ప్రాజెక్టు, మాజీ సీఎం కేసీఆర్ కృషి వల్లేనని ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించండి

రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు నెలలతరబడి జీతాలు అందడంలేదని, వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర ముఖ్యమైన విధులు నిర్వహిస్తున్న 60వేల మందికి పైగా ఉద్యోగ, కార్మికులకు వేతనాలు రాకపోవడం ఇబ్బందిగా మారిందని సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు.

మద్యం లిఫ్టింగ్ బంద్

- రాష్ట్ర వ్యాప్తంగా నిలిపేసిన వ్యాపారులు
- ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల మధ్య 'ఈ-వేబిల్లుల' పంచాయితీనే కారణం



హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మద్యం వాహనాలకు సంబంధించి కొన్నాళ్లుగా వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖల మధ్య నెలకొన్న 'ఈ-వేబిల్లుల' వివాదం చివరికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా చేసింది. డిపోల నుంచి మద్యం రవాణా వాహనాలు బయటకు రాగానే ఈ-వేబిల్లులు లేవంటూ వాహనాలను వాణిజ్య పన్నుల అధికారులు సీజ్ చేస్తుండటంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వైన్‌షాప్ ఓనర్లు మద్యం లిఫ్టింగ్‌ను నిలిపివేసి, డిపోల ముందు నిరసనకు దిగారు. ఫలితంగా రాష్ట్రంలోని 19మద్యం డిపోలు పనిచేయలేదు. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు రూ.150 కోట్ల రాబడికి గండిపడింది. రాష్ట్రంలోని వైన్ షాపులు, బార్ల ఓనర్లు ఎక్సైజ్ శాఖ ఆధీనంలోని 19 మద్యం డిపోల నుంచి మద్యం, బీరును లిఫ్ట్ చేస్తుంటారు. ఈ డిపోల నుంచి వ్యాన్లు, ఇతర పెద్ద వాహనాల ద్వారా తమ వైన్ షాపుల వరకు తీసుకెళుతుంటారు. అయితే మద్యం రవాణా వాహనాలకు 'ఈ-వేబిల్లులు' ఉండాల్సిందేనంటూ వాణిజ్య పన్నుల శాఖ పట్టుబడుతుండగా.. అవసరం లేదని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. శనివారం నుంచి ఈ వ్యవహారం ఎటూ తేలకపోవడంతో ఎక్కడికక్కడ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మద్యం రవాణా వాహనాలను సీజ్ చేస్తున్నారు. మద్యంతో కూడిన వ్యాన్లను పోలీస్ స్టేషన్లలో పెట్టేస్తున్నారు. సమస్య జఠిలంగా మారడంతో సోమవారం రాష్ట్రంలోని వైన్‌షాపు ఓనర్లు మద్యం లిఫ్టింగ్‌ను నిలిపేశారు. దాదాపు 200మంది వరకు యజమానులు నాంపల్లిలోని ఎక్సైజ్ కమిషనరేట్‌కు తరలివచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సాయంత్రం ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవిని సచివాలయానికి పిలిపించి మాట్లాడారు. సమస్య ఎందుకు తలెత్తింది, దానికి పరిష్కారమేమిటన్న అంశాలపై వారితో సీఎస్ చర్చించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ఆమె ప్రయత్నించినట్లు తెలిసింది. విచిత్రమేమిటంటే, వాణిజ్య పన్నులు/ఎక్సైజ్ శాఖలకు సునీల్‌శర్మే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి. అయితే సమన్వయ లోపం కారణంగా మద్యం లిఫ్టింగ్‌ను బంద్ పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో శనివారంనుంచి ఇప్పటిదాకా 50 వాహనాలను సీజ్ చేశారు. వాహనంలో ఉన్నవారికి నోటీసులు ఇచ్చారు. ఒక్కో వాహనానికి రూ.10 లక్షలకు పైగా పెనాల్టీని వేస్తున్నారు. బెంబేలెత్తిపోయిన వైన్ షాపు ఓనర్లు చివరికి మద్యం లిఫ్టింగ్‌నే బంద్ పెట్టారు. ఎక్సైజ్ శాఖ మాత్రం లిక్కర్ రవాణా వాహనాలకు 'ఈ-వేబిల్లులు' అవసరం లేదని చెబుతోంది

2018లోనే మినహాయింపు

వాస్తవానికి మద్యాన్ని డిపోల నుంచి విడుదల చేయడానికి ముందే దానిపై 70% విలువ ఆధారిత పన్ను(వ్యాట్) పడుతోంది. మద్యాన్ని తరలించే వాహనాల కోసం ఇదివరకు 'ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్లు' ఇచ్చేది. కాగితం దండగ అన్న కారణంతో.. ప్రస్తుతం అలాంటి పర్మిట్లు ఇవ్వడం లేదు. అయినా ఎలాంటి రవాణా పర్మిట్లు లేకుండానే కొన్నేళ్లుగా మద్యాన్ని డిపోల నుంచి తరలిస్తున్నారు. ఇప్పుడే ఈ సమస్య ఎందుకు తలెత్తుందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిజానికి మద్యం రవాణా వ్యాన్లు, పెట్రోలు, డీజిల్ రవాణా ట్యాంకర్లకు 'ఈ-వేబిల్లుల' నుంచి మినహాయింపునిస్తూ 2018లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ దృష్ట్యా ఎక్సైజ్ శాఖ ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్లతో మద్యాన్ని డిపో నుంచి మద్యం షాపు వరకు రవాణా చేసుకోవచ్చు. ఈ ఫిబ్రవరి 29న వాణిజ్య పన్నుల కమిషనర్ టీకే శ్రీదేవి ఒక సర్క్యులర్ జారీ చేశారు. అంతర్రాష్ట్ర మద్యం రవాణాకు తప్ప కుండా 'ఈ-వేబిల్లులు' ఉండాలని, లేనట్లయితే.. వాహనాలను సీజ్ చేయాలంటూ వాణిజ్య పన్నుల శాఖ క్షేత్ర స్థాయి డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లను ఆదేశించారు. అంటే.. తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు మద్యాన్ని సరఫరా చేస్తేనే.. 'ఈ-వేబిల్లుల'ను చూడాలి. కానీ... వాణిజ్య పన్నుల అధికారులు రాష్ట్రంలోని ఒక మద్యం డిపో నుంచి ఒక వైన్ షాపునుకు మద్యాన్ని తరలిస్తున్న వాహనాలను కూడా సీజ్ చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 12 మార్చి 2024

ఎయిమ్స్‌లో నర్సింగ్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)-డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. నర్సింగ్, పారామెడికల్, మెడికల్ విభాగాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. న్యూఢిల్లీ సహా ఇతర ఎయిమ్స్ క్యాంపస్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. అభ్యర్థులు ముందుగా కోర్సులో ప్రవేశం కోరుతూ ప్రాథమికంగా నమోదు చేసుకోవాలి. ఇందుకు సంస్థ అంగీకారం తెలుపుతూ కోడ్ పంపుతుంది. దీని ద్వారా తుది రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తరవాత ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. ఇది పూర్తయ్యాక ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు హాజరు కావాల్సిందిగా అభ్యర్థులకు అడ్మిట్ కార్డు పంపుతారు.



డిగ్రీ కోర్సులు

బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్(పోస్ట్ బేసిక్), బీఎస్సీ(పారామెడికల్ కోర్సులు) ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

అర్హత: బీఎస్సీ(ఆనర్స్) నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియెట్/ పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు వస్తే చాలు. బీఎస్సీ(పారామెడికల్) కోర్సుకు ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/ పన్నెండో తరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం చాలు.

బీఎస్సీ నర్సింగ్ (పోస్ట్ బేసిక్) కోర్సుకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా(జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) కోర్సు పూర్తి చేసి ఉండాలి. నర్సు, మిడ్‌వైఫ్‌గా స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. పురుషులు మిడ్‌వైఫరీ ట్రెయినింగ్‌కు బదులు ఆర్నెల్ల వ్యవధి గల ఓటీ టెక్నిక్స్/ఆప్తాల్మిక్ నర్సింగ్/ లెప్రసీ నర్సింగ్/టీబీ నర్సింగ్/సైకియాట్రిక్ నర్సింగ్/న్యూరోలాజికల్ అండ్ న్యూరో సర్జికల్ నర్సింగ్/కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్/క్యాన్సర్ నర్సింగ్/ఆర్థోపెడిక్ నర్సింగ్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

పీజీ కోర్సులు

ఎమ్మెస్సీ(నర్సింగ్), ఎమ్మెస్సీ కోర్సులు, ఎం.బయోటెక్నాలజీ ప్రోగ్రాములు ఉన్నాయి. ఎమ్మెస్సీ కోర్సుల్లో మెడికల్ అనాటమీ, మెడికల్ బయో కెమిస్ట్రీ, బయో ఫిజిక్స్, మెడికల్ ఫిజియాలజీ, మెడికల్ ఫార్మకాలజీ, రీప్రొడక్టివ్ బయాలజీ అండ్ క్లినికల్ ఎంబ్రియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ, కార్డియోవాస్క్యులర్ ఇమేజింగ్ అండ్ ఎండోవాస్క్యులర్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు.

అర్హత: ఎమ్మెస్సీ(నర్సింగ్) కోర్సుకు కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/బీఎస్సీ(నర్సింగ్) పోస్ట్ బేసిక్/బీఎస్సీ(నర్సింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. నర్సు, మిడ్‌వైఫ్‌గా స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. ఎమ్మెస్సీ కోర్సుల్లో కార్డియోవాస్క్యులర్ ఇమేజింగ్‌కు బీఎస్సీ(రేడియోగ్రఫీ); న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీకి బీఎస్సీ(న్యూక్లియర్ మెడిసిన్/ రేడియో డయాగ్నసిస్/రేడియోథెరపీ)/బీఎస్సీ (ఎంపీసీ/ఫిజిక్స్-లైఫ్ సైన్సెస్)ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన స్పెషలైజేషన్లకు కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ పూర్తిచేసి ఉండాలి. ఎం.బయోటెక్నాలజీకి బీటెక్(బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం
- బేసిక్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 4
- కోడ్ జనరేషన్‌కు ప్రక్రియ ప్రారంభం: మార్చి 12 నుంచి
- కోడ్ జనరేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 12
- ఫైనల్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 12
- వెబ్‌సైట్: aiimsexams.ac.in

మైసూరు ఏఐఐఎస్‌హెచ్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

మైసూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఏఐఐఎస్‌హెచ్)- వివిధ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ, స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి.

డిప్లొమాలు

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్), హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి. హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్ స్పెషలైజేషన్‌కు సంబంధించి సంస్థ స్టడీ సెంటర్లలో ఒక్కోదానిలో 28 సీట్లు ఉన్నాయి.

స్టడీ సెంటర్లు: పీజీఐఎంఈఆర్ డా.రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్-న్యూఢిల్లీ, ఇందిరాగాంధీ మెడికల్ కాలేజ్-సిమ్లా, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్(ఏఐఐపీఆర్) -ముంబై. అర్హత వివరాలు త్వరలో ప్రకటిస్తారు. ఆర్‌సీఐ నిర్వహించే ఆలిండియా ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు పది నెలలపాటు నెలకు రూ.250 స్టయిపెండ్ ఇస్తారు.

పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇందులో 12 సీట్లు ఉన్నాయి. స్టయిపెండ్ ఇవ్వరు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: డిగ్రీ(ఆడియాలజీ/స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ/స్పీచ్ అండ్ హియరింగ్/స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్‌ఐ) ఉత్తీర్ణులై ఉండాలి. ఆర్‌సీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ (బీఏఎస్ఎల్‌పీ)

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో 80 సీట్లు ఉన్నాయి. ఇందులో ఆరు సెమిస్టర్లతోపాటు ఏడాది ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ప్రవేశం పొందిన అభ్యర్థులకు మొదటి మూడేళ్లు ఏడాదికి పదినెలలపాటు నెలకు రూ.800 స్టయిపెండ్ ఇస్తారు. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.5,000 చెల్లిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్/ బయాలజీ/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/సైకాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంపిక: సంస్థ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ఎగ్జామ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్/బయాలజీ సబ్జెక్టుల నుంచి 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ సీబీఎస్ఈ పదకొండు, పన్నెండు తరగతుల సిలబస్ ప్రకారం ఉంటాయి. ప్రశ్నకు 1 మార్కు. చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండున్నర గంటలు.

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఏడాదికి పది నెలలపాటు నెలకు రూ.400 స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఏదేని (డిగ్రీ/పీజీ)(సైన్స్/సోషల్ సైన్సెస్/హ్యుమానిటీస్) ఉత్తీర్ణులు లేదా కనీసం 55 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(సైన్స్, మేథమెటిక్స్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. స్పీచ్-లాంగ్వేజ్ పాథాలజీ, ఆడియాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 44 సీట్లు ఉన్నాయి. రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) నిబంధనల ప్రకారం సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఏడాదికి పది నెలలపాటు నెలకు రూ.1300ల స్టయిపెండ్ చెల్లిస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బీఏఎస్ఎల్‌పీ/బీఎస్సీ(స్పీచ్ అండ్ హియరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: రెండు స్పెషలైజేషన్‌లకు వేరుగా సీబీటీ విధానంలో ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఎగ్జామ్‌లో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం 100 నిమిషాలు.

- **దరఖాస్తు ఫీజు:** డిప్లొమా ప్రోగ్రామ్‌లకు రూ.525(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300); బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లకు రూ.1100 (రిజర్వ్‌డ్ వర్గాలకు 700); బీఏఎస్ఎల్‌పీ, ఎమ్మెస్సీ, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు రూ.1625(దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1225)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 19
- **వెబ్‌సైట్:** www.aiishmysore.in

మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఏడాదికి పది నెలలపాటు నెలకు రూ.650 స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)/ బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈడీ జనరల్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్(హెచ్‌ఐ) పూర్తిచేసినవారు కూడా అర్హులే. సంస్థ నిర్వహించే ఆఫ్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

జాబ్ కార్నర్



బెల్‌లో సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 24

పోస్టు: సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు 15 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.30,000 - రూ.1,20,000 వరకు
వయోపరిమితి: 50 సంవత్సరాలు మించకూడదు
పని ప్రదేశాలు: గువాహటి, ఢిల్లీ, శ్రీనగర్, ముంబై, కోచ్చి, కార్వార్, పోర్ట్‌బ్లెయిర్, విశాఖపట్నం
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: మార్చి 20
వెబ్‌సైట్: https://belindia.in/

ఐటీడీసీలో అసిస్టెంట్ మేనేజర్లు

భారత టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐటీడీసీ)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్: 6 పోస్టులు
2. చెఫ్: 3 పోస్టులు
3. అసిస్టెంట్ మేనేజర్(ఈవెంట్స్): 2 పోస్టులు
4. అసిస్టెంట్ మేనేజర్(సివిల్): 3 పోస్టులు
5. అసిస్టెంట్ మేనేజర్(ఈఅండ్ఎం): 3 పోస్టులు
6. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
7. అసిస్టెంట్ లెక్చరర్స్: 4 పోస్టులు

అర్హత: లా డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, హాస్పిటాలజీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్/మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 14
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
వెబ్‌సైట్: https://itdc.co.in/

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఇంజనీర్లు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)...రామగుండం ప్లాంట్(తెలంగాణ), కార్పొరేట్ ఆఫీస్(నోయిడా)లో రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 25

పోస్టుల వివరాలు
1. ఇంజనీర్(ఇ-1): 19 పోస్టులు
2. సీనియర్ కెమిస్ట్: 2 పోస్టులు
3. అకౌంట్స్ ఆఫీసర్(ఇ-1): 5 పోస్టులు
4. మెడికల్ ఆఫీసర్(ఇ-1): 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు. ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
బేసిక్ పే: పే స్కేల్ రూ.40,000- రూ.1,40,000.
ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
వెబ్‌సైట్: https://rfcl.co.in/

ఎంఓఐఎల్‌లో గ్రాడ్యుయేట్ ట్రెయినీలు

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్, నాగ్‌పూర్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 44

1. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(గనులు): 13
2. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(మెకానికల్): 5
3. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(ఎలక్ట్రికల్): 4
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(జియాలజీ), గ్రాడ్యుయేట్ ట్రెయినీ(ప్రాసెస్): 1
5. గ్రాడ్యుయేట్ ట్రెయినీ(కెమికల్, మెటలర్జీ, మినరల్ ప్రాసెసింగ్): 3
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మెటీరియల్స్): 5
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్): 1
8. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్స్/వెల్): 5
9. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఫైనాన్స్): 5
10. మేనేజర్(సర్వే): 2

విభాగాలు: మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, జియాలజీ, ప్రాసెస్, మెటీరియల్స్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్, పర్సనల్, ఫైనాన్స్, సర్వే
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేట్, ఎంబీఏ, డిప్లొమా, పీజీ, డిగ్రీ, ఇంజనీరింగ్‌లలో ఉత్తీర్ణత.
వేతనం: నెలకు రూ.50,000 - రూ.1,60,000
వయోపరిమితి: 53 సంవత్సరాలు మించరాదు
దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 21
వెబ్‌సైట్: https://www.moil.nic.in/



సీబీఎస్ఈలో గ్రూప్- ఎ, బి, సి పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్...డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 118

1. అసిస్టెంట్ సెక్రటరీ(అడ్మినిస్ట్రేషన్): 18 పోస్టులు
2. అసిస్టెంట్ సెక్రటరీ(అడకమిక్): 16 పోస్టులు
3. అసిస్టెంట్ సెక్రటరీ(స్కిల్ ఎడ్యుకేషన్): 8 పోస్టులు
4. అసిస్టెంట్ సెక్రటరీ(ట్రెయినింగ్): 22 పోస్టులు
5. అకౌంట్స్ ఆఫీసర్: 3 పోస్టులు
6. జూనియర్ ఇంజనీర్: 17 పోస్టులు
7. జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్: 7 పోస్టులు
8. అకౌంటెంట్: 7 పోస్టులు
9. జూనియర్ అకౌంటెంట్: 20 పోస్టులు

అర్హతలు: పోస్టును అనుసరించి విద్యార్హతలు, అనుభవం తదితర పూర్తి సమాచారం మార్చి 12న సంస్థ వెబ్‌సైట్‌లో లభ్యమవుతుంది.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: మార్చి 12
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 11
వెబ్‌సైట్: https://www.cbse.gov.in/

ఐకార్‌లో రీసెర్చ్ మేనేజ్‌మెంట్ పోస్టులు

దేశవ్యాప్తంగా ఐకార్ పరిశోధన సంస్థల్లో...ఒప్పంద కాల ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 11

1. అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్: 3 పోస్టులు
2. డైరెక్టర్: 6 పోస్టులు
3. జాయింట్ డైరెక్టర్: 2 పోస్టులు

విభాగాలు: యానిమల్ హెల్త్, ఇన్‌లాండ్ ఫిషరీస్, ప్లాంట్ ప్రొటెక్షన్ అండ్ బయోసేఫ్టీ తదితరాలు.
అర్హత: సంబంధిత విభాగంలో డాక్టోరల్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 60 ఏళ్లు మించకూడదు
దరఖాస్తు రుసుము: రూ.1500
ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18
వెబ్‌సైట్: http://asrb.org.in/vacancy


లిటిల్స్



సోదర ప్రేమ

ఒక ఊరిలో రాముడు, భీముడు అనే అన్నదమ్ములు ఉండేవారు. ఇద్దరూ స్నేహితుల్లా ఉండేవారు. కలసి మెలసి ఉండేవాళ్లు. రాముడు మాత్రం బలహీనుడు, భయస్తుడు, దుర్బలుడు, పిరికివాడు. భీముడు అయితే పేరుకు తగినట్లు బలాఢ్యుడు, ధీశాలి, కోపిష్టి, గర్వి. ఈ ఇద్దరు అన్నదమ్ముల ఆప్యాయత చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. విషయమేంటంటే అన్న పేరు రాముడు. తమ్ముడి పేరు భీముడు. అన్నను ఎప్పుడూ కాపాడుకునే బాధ్యత తమ్ముడు తీసుకున్నాడు.

చూస్తుండగానే రాజ్యంలో ఒక రోజు దండోరా వచ్చింది. చుట్టు పక్కన గ్రామాల వాళ్లు అంతా రాజు దగ్గరకు తరలి వెళ్లారు. రాజుగారు ఇలా సెలవిచ్చారు.. 'మనదేశంలోని భాండాగారం తరిగిపోయింది. ధనమే లేకుంటే మిమ్ములను చూడలేను కదా. పైగా నాకు పన్నులు వేయడం ఇష్టం ఉండదు' అంటూ బాధపడ్డారు. రాజు బాధ చూసి అందరూ బాధపడ్డారు. వెంటనే మంత్రి కలగజేసుకుని.. 'మీరంతా బాగా పనిచేయాలి. కష్టపడి పని చేస్తే డబ్బులు ఇస్తాం. భాండాగారాన్ని సరిచేయటానికి మీరు అధిక గంటలు ఇక్కడే పని చేయాలి. అయితే తక్కువ డబ్బులు ఇస్తాం. మీరు సర్దుకోవాల్సిందే. ఈ రాజ్యంకోసం.. మన రాజుగారి కోసం చేయలేమా?' అన్నాడు. అందరూ తలలూపారు. రాజ్యంలోని పేదలంతా కష్టపడుతున్నారు. కట్టుబానిసల్లా పని చేస్తున్నారు. పని చేయకపోతే వారిని బందిఖానాలో వేసేవారు. రాముడు పని చేయలేకపోవటంతో బంధీ చేశారు. వెయ్యి రూపాయలు కష్టపడి ప్రతిరోజూ పన్నెండు గంటలు పని చేస్తే కూలి ఇస్తాం అన్నారు రాజ్యాధికారం ఉన్న అక్కడ అధికారులు. రాముడికి అంత పని చేతకాదు. దీంతో భీముడు రెట్టింపు పని చేశాడు. ఎంతో కష్టపడ్డాడు. చివరికి డబ్బులు సంపాదించాడు. భీముడి దగ్గరకు ఒక రోజు రాజు వచ్చాడు. 'ఏ గ్రామం నుంచి వచ్చావు?' అని అడిగాడు. 'ఇంతలా కష్టపడుతున్నావు. నువ్వు ఇక చేసింది చాలు వెళ్లిపో' అన్నాడు. 'అయ్యా.. సంతోషం. మా తమ్ముడు రాముడు కష్టపడలేడు. ఈ డబ్బులు తీసుకుని తమ్ముడిని వదిలేయ్' అన్నాడు. 'వదలను' అన్నాడు రాజుగారు. కష్టపడలేని వాడు రాజ్యంలో ఎందుకన్నట్లు మాట్లాడారు రాజుగారు. వెంటనే భీముడు ఇలా అన్నాడు.. 'ఎవరి కర్మ వాళ్లు అనుభవించాలి. అందరూ గొప్పవారు కాదు. కాలేరు. నా తమ్ముడుకోసమే ఇంతలా కష్టపడ్డాను. నన్ను గుర్తించారు. నా తమ్ముడిని వదలండి.. ఇక్కడ నేను శాశ్వతంగా పని చేస్తా' అన్నాడు. 'ఏమీ ఆలోచించకుండా.. తన సోదరుడి మీద ఉన్న ప్రేమను గుర్తించారు రాజుగారు. ఆ ఇద్దరినీ వదిలేయమని ఆదేశించాడు.



సరైన నీడ ఏది?



10 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 252

1	8	4	3	6		9		2
	5		1				8	
2					8	7		
	9				4	6		
		7	8		9	1		
		1	6				4	
		2	4					5
	1				5		3	
3		5		8	1	2	9	6

సుడోకు - 251 సమాధానం

9	3	6	2	4	7	1	5	8
5	7	8	1	6	9	3	4	2
1	4	2	8	5	3	7	6	9
3	6	9	7	2	1	4	8	5
7	1	5	9	8	4	2	3	6
2	8	4	6	3	5	9	7	1
6	2	7	3	9	8	5	1	4
4	9	3	5	1	6	8	2	7
8	5	1	4	7	2	6	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.